
జయరామ్ రెసిడెన్సీ, శ్రీకాళహస్తి
వారి అధ్వర్యంలో
శ్రీ దక్షిణామూర్తి
ప్రవచన మహాయజ్ఞం
సమన్వయ సరస్వతి, వాగ్దేవీ వరపుత్ర
బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
గారిచే
Date: 12th June – 16th June 2021 Time: from 7pm IST
Live On : YouTube

# శ్రీ దక్షిణామూర్తి మొదటి రోజు (6/12/2021)

శివాయగురవేనమః శ్రీమాత్రేనమః శ్రీవిష్ణురూపాయనమఃశివాయ

శ్రీకాళహస్తీశ్వరాయ నమఃశివాయ




**శ్రీకాళహస్తీశ్వరం పరమలింగం**

**చిద్గుహాభ్యంతరం హృద్యంత వేద్యం**

**జ్ఞానప్రసూనాంబికా మనోనాయకం**

**దాక్షిణ్యమూర్తిమనఘం సదావందే**

దక్షిణామూర్తి అనగానే ఆదిశంకర భగవత్పాదుల వారు రచించిన దక్షిణామూర్తి స్తోత్రం. పది శ్లోకాల స్తోత్ర వాంఙ్మయం ఇది. కానీ ఈ ప్రవచనంలో ఈ స్తోత్రం చెప్పబోవడంలేదు, ఇది వరకూ ఈ స్తోత్రం ప్రవచించారు. ఇప్పుడు దక్షిణామూర్తి గురించి చెప్పబోతున్నారు.
దక్షిణామూర్తి యొక్క స్వరూపము, తత్త్వము, వైభవం తెలుసుకుంటూ ఉపాసన చేసుకోబోతున్నాము. బృహస్పతి శనితో కలిసి ఉండడం వల్ల దుస్థితులు ఉన్నాయట. గురుబలం కావాలి ఇది తగ్గాలంటే, ఆదిగురువుయిన స్వామివారిని తలంచితే తప్పక గురుబలం లభించి అన్నీ పరిస్థితులు చక్కబడతాయి.

హృద్యమైన రహస్యమేదో ఈ మూర్తిలో, నామంలో, తత్త్వంలో దాగి ఉన్నది.

శ్రీకాళహస్తీశ్వరుడు కొలువు అయి ఉన్న క్షేత్రం గురించి అందరికి తెలిసినదే! భక్తవాత్సల్యంతో అనుగ్రహించే స్వామి అని సాలెపురుగు, పాము, ఏనుగులని అనుగ్రహించడం ద్వారా, భక్త కన్నప్ప చరిత్ర ద్వారా తెలుస్తున్నది. అంతేకాక ఇది జ్ఞానక్షేత్రం! ఏది పొందితే మరి దుఃఖం ఉండదో అదే జ్ఞానం! అది ఇవ్వగలిగేది దక్షిణామూర్తి స్వామి!

శివయోగి అని చెప్పవలసిన మహాయోగి ధూర్జటి స్వామిపై రెండు రచించారు 1) స్వామిపై ప్రబంధం 2) కాళహస్తీశ్వర శతకం. రెండూ కూడా అద్భుతమైన రచనలు చదివి తీరవలసినదే!

**పరమేశ్వరుడు ఈ క్షేత్రంలో ఎలా ఆవిర్భవించాడు?**

ఒకప్పుడు వసిష్ఠుల వారు తన తనయులు విశ్వామిత్రుని వల్ల మరణించినప్పుడు దుఃఖితులై ఉన్నారు. మహాత్ములు కూడా కష్టం వచ్చినప్పుడు తత్కాలం దుఃఖపడతారు, కానీ పరమేశ్వరుడు ఏదో రూపంలో అనుగ్రహిస్తూ ఉంటారు. అంతేకాక ఈ కథల ద్వారా మనం నేర్చుకోవలసినది ఏంటంటే దుఃఖములు వచ్చినా చలించకుండా ఉండాలనేది ఋషిహృదయం.

వశిష్ఠులవారు కొండపై నుండి దూకుదాం అనుకున్నారు ఆ దుఃఖంతో! మహాత్ములకి ఇటువంటి బుద్ధి పుట్టినప్పుడు పరమేశ్వరుడు ఏదో విధంగా అలా జరగకుండా చూస్తారు.

(ధూర్జటి మహాయోగి, వైరాగ్య సంపన్నుడు, షట్కాల శివపూజాదురంధురుడు)

భూదేవి వశిష్ఠులవారిని పట్టుకుని మాట్లాడుతున్నది, ఓ వెర్రీ! చచ్చిపోతే పుట్టుక తీరిపోతుందా? (చావన్ పుట్టువు తీరునే?) చచ్చిపోయినంత మాత్రం జన్మలని ఆపగలవా? ఈ శరీరం పోయినా మరో శరీరం వస్తుంది! ఏ దుఃఖం అనుభవించలేక శరీరం చాలించాలి అనుకున్నామో, అది పోయాక మరో శరీరం వచ్చాక అనుభవించాల్సిందే! అంతేకాక ఆత్మహత్య వల్ల వచ్చే పాపం కూడా అనుభవించాలి!

**నిజంగా జీవితం చాలు అనుకుంటే ఏమి చేయాలి? అంటే మళ్ళీ చావుపుట్టుకలు లేని స్థితి కావాలంటే ఏమి చేయాలి?** అది తెలుసుకోవాలి!

ఇప్పుడు ఆక్రమించిన శోకోద్రేకం అనే మేఘం తొలగిపోతే నీలోని జ్ఞానసూర్య ప్రకాశం లభిస్తుంది, అన్నది భూదేవి! జ్ఞానాన్ని తెలియచేసి దుఃఖాన్ని తొలగించడమే పరామర్శ! అది చేసింది భూదేవి!

జన్మలేని పనికోసం ఏమి చేయాలి? శాస్త్రజ్ఞానం ఉన్నంతమాత్రాన సరిపోదు, ఈశ్వరానుగ్రహం ఉండాలి! బ్రహ్మానుభవం రావాలంటే మాత్రము ఆయన జ్ఞానం ఇవ్వాల్సిందే!

**అమాయక భక్తులు ముక్తిని ఎలా పొందారు మరి?** అంటే ఆ భక్తికి సంతోషించి ముక్తికి కావలసిన జ్ఞానం ఆ స్వామియే ఇస్తారు కావున!

భూదేవి చెప్తున్నది, దేవతాశ్రేష్ఠుడైన పార్వతీ రమణుడైన పరమేశ్వరుని భక్తితో కొలుచుకో! అప్పుడు నీకు జీవన్ముక్తి లభిస్తుంది. ముక్తి మరణించాక కాదు, బ్రతికి ఉండగానే పొందాలి! జీవన్ముక్తి అంటే, పరమాత్మ

తాదాత్మ్యాన్ని పొంది సత్యం, జ్ఞానం అనుభవంలోకి తెచ్చుకుంటే అదే జీవన్ముక్తి! దానికి ఈశ్వర శరణాగతి మాత్రమే గతి!

పరమేశ్వరుడు తెలియాలి అన్నా, అనుభవానికి రావాలన్నా, ఆయనలో ఐక్యం కావాలన్నా భక్తి తప్ప అన్యమార్గం లేదు అని గీతాచార్యుని వచనము!

**వశిష్ఠుల వారు తపస్సు ఎలా చేసారు?**

భూదేవి చేసిన ఈ బోధ తర్వాత వశిష్ఠులవారు గజకాననం అనే చోట్లో తపస్సు చేస్తున్నారు!

అనేకజన్మల నుండి వస్తున్న నానారకాల వాసనలు ఉన్న అంతఃకరణం అనే కుసుమాన్ని పరమేశ్వరునికి సమర్పణం చేసాడు. హృదయాన్ని ఈశ్వరారార్పణం చేసాక తపస్సుకే అధీనుడై బ్రహ్మతేజస్సుతో భాసిస్తున్నాడు.

బహిర్ముఖత్వమైన జగత్తులోని వికారాలు తట్టుకుంటూ తపస్సు చేయాలి! అలా చేయాలంటే భక్తి మాత్రమే దిక్కు!

**<u>ముందుగా సాధనకి కావలసినది గురువుని ఆశ్రయించడం!</u>**

# ఎండ బాధ తగలకుండా శివగురుపాదపద్మముల నీడ ఆతపత్రంలా కాపాడుతున్నది! గురుపాదకులు తలమీదనే కదా ఉంటాయి సాధకుడికి! భక్తితో పరమేశ్వరుని ఆశ్రయిస్తే భౌతిక కష్టములు ఏమీ చేయలేవు!

# ఆకలి దప్పికలు ఎలా జయించాడు? జ్ఞానం అనే అమృతం తాగడం వల్ల! చంద్రశేఖరుని ధ్యానం చేసి ఆ అమృత తత్త్వం ఆస్వాదించడం వల్ల ఆయనకు ఆకలిదప్పికలు లేవు!

# మేను మరచి తపస్సు చేస్తూ ఉంటే బయట విషకీటకాలు మొదలగునవి బాధించకుండా ఒక కవచం పెట్టుకున్నాడుట! అది ఏమిటంటే భస్మధారణ! భస్మధారణ రెండు రకాలు: ఉద్ధూళన, త్రిపుండ్రాలు ధరించడం! ఇక్కడ వశిష్ఠులవారు కూడా భస్మధారణ చేసి, దాన్నే కవచంగా కలిగి ఉన్నాడు!

# మరి గాలి బాధ? నిలవవలసినది మనస్సు కదా! అది పడిపోకుండా ఆ మనస్సుని స్తంభం పాతినట్లు పాతాడుట! లోతు అయిన భక్తి అనే గర్తంలో పాతి పెట్టాడట!

# జిత్తులమారి నక్కవంటి మోహము ఎలా బంధించాడు? దాన్ని పట్టడానికి రాజయోగం అనే వల వేసి బంధించాడుట!

అలా దృఢమైన తపస్సు చేయగా పరమేశ్వరుడు వస్తున్నాడట! ఆయన ఎక్కడికక్కడే ప్రత్యక్షం కాగలడు! కానీ ధూర్జటి పరమేశ్వరుడు కైలాసము నుండి వస్తున్నట్లు భావన చేసారు.

**పరమేశ్వరుడు ఎలా వస్తున్నాడు?**

భక్తుడి వద్ద ఉన్న భక్తికన్యని పాణిగ్రహణం చేయడానికి వస్తున్నాడట! అలా వచ్చేటప్పుడు తనకోసం కాచుకుని కూర్చున్న ఇంద్రాదులను కానీ, అమ్మవారి నవ్వుకి చలించకుండా, పిల్లలైన గణపతి, కుమార స్వామిని కూడా చూడకుండా వచ్చారు స్వామి.

**వశిష్ఠుని ముందర సాక్షాత్కరిస్తున్న దివ్య లింగము**

పశ్చిమాభిముఖంగా కనపడుతున్నాడు. తపస్సు చేస్తున్నవారు తూర్పుకు అభిముఖంగా ఉన్నాడు! జ్యోతి స్వరూపమైన పంచముఖలింగం కనిపిస్తున్నది! నాలుగు దిక్కులు, ఊర్ధ్వ దిక్కులో ప్రకాశిస్తున్న పరమేశ్వరుని జ్ఞాన ప్రకాశమే పంచముఖ లింగము! సర్వతోముఖమైన శివజ్యోతి స్వరూపం సాక్షాత్కరించింది! మనోదృష్టికి కూడా అందనటువంటి కాంతి, దిక్కులంతా ఆ కాంతి తప్ప మరొకటి లేదుట! అది కావాలి! ఈశ్వరుడు తప్ప మరొకటి లేదనే ఎరుక సాక్షాత్కారంతోనే కనపడింది!

అయిదు ముఖాలతో అయిదింటినీ లయింప చేసాడట 1) పంచభూత 2) పంచ ఇంద్రియాలు 3) పంచ విషయం తన్మాత్రలు 4) పంచక్లేశములు (అస్మిత, అవిద్య, రాగ, క్లేశ, అభినివేశ ) 5) పంచకోశాలు

ప్రపంచం లయించిపోవడమే కైవల్యం! (ప్రపంచోపశప్రపంచదృష్టి ఈ అయిదు అయిదు అయిదింటితో గట్టిగా పట్టి ఉంటుంది, దాని వల్ల పరమాత్మ తెలియబడడంలేదు! ఈ అయిదు ఆయనలో లయమైతే అప్పుడు మిగిలేది ఆయనే! ఆ లయం మనం చేయగలమా? ఆ మహాజ్యోతి ఉన్నదంతా నేనే అని మొత్తం నిండిపోయి, పంచ పంచ అయిన వాటిని లయం చేస్కుని తాను మాత్రమే సాక్షాత్కరించడానికి పంచముఖాలతో వచ్చాడు స్వామి! ఎందుకంటే వశిష్ఠుడు జ్ఞానం కోసం, ముక్తి కోసం తపస్సు చేస్తున్నాడు! దానికి తగ్గ వర్ణన చూపిస్తున్నారు! పరమేశ్వరుడు తప్ప అన్యం లేదు అనే ఎరుక కలగాలి! ఈశ్వరుడు కాక మరొకటి అని ఉండే ఈ ప్రపంచం ఈశ్వరునియందు లయమై పోవాలి, జ్ఞానం చేత లయించిపోవాలి, నశించి పోవాలి అని కాదు! సర్వం ఈశ్వరుడు అయినప్పుడు జగత్తు ఎక్కడుంది? అది కూడా ఈశ్వరుడే! అది వేరుగా కనిపించడం భ్రాంతి మాత్రమే!

"ముక్తకంచుకాకారంబున"

సర్వవ్యాపకమైన జ్యోతికి వస్త్రం కట్టగలమా? కంచుకం అంటే ఆవరణ! మాయావరణలు లేని శుద్ధ తత్త్వము! ఇదే దిగంబర శబ్దానికి అర్థము!

పంచశరభంజనుడు కనపడ్డాడుట!

అన్నీ అవిద్యలకి కారణం కామం! అటువంటి వాడిని మసి చేసినవాడు కావుననే జ్ఞానస్వరూపుడు అయ్యాడు కదా!

అటువంటి ఆ స్వామి పరమశివలింగరూపము దాల్చి మాట్లాడుతున్నాడుట! లింగం మాట్లాడటమేమిటి? అంటే ఆయనకి పరిమితి అయిన ఇంద్రియములు ఎందుకు? ఇంద్రియములకు కూడా కారణం అయిన సమస్త శక్తులూ ఆయనవే!

**పరమేశ్వరుడు వశిష్ఠునితో మాట్లాడుతున్నాడు**

ముని చూడామణి! నీ తపస్సుకు చాలా సంతోషించాను, నీకి ఏది కావాలో చెప్పు అది ఇస్తాను అన్నారు! వశిష్ఠుడు తన హృదయంలో ధ్యానిస్తున్నది మాత్రము గిరిజాసమేతుడయిన స్వామిని! కానీ ఇక్కడ కనపడుతున్నది మాహాలింగం! అప్పుడు వశిష్ఠుడు అనుకున్నారు, నేను ధ్యానిస్తున్న సాంబుడే ఇక్కడ మాట్లాడుతున్నది కూడా అనుకున్నాడు. స్వామి దర్శనంతో, ఆ మాటలతో, భయభక్తులు కలిగాయి! భయం అంటే తనకంటే మహోన్నతమైన మహోన్నతమైన స్వరూపం సాక్షాత్కరించగానే కలిగే దాన్ని భయం అంటున్నారు ఇక్కడ!

**వశిష్ఠులవారు నమస్కరిస్తున్నారు స్వామిని!**

కనులారా ఆ మహాజ్యోతిస్వరూపాన్ని చూస్తున్నాడు! త్రిపురాసుర సంహారకుడయిన పరమేశ్వరుని యొక్క సర్వాదిగ్వ్యాప్తమైన మహాతేజస్సు! అది చూసి శరీరం వణికిపోయి, మహాసంభ్రమంతో ఆనందం తీవ్రతతో చెమటలు కూడా పట్టి స్తోత్రం చేస్తున్నాడు!

దక్షిణామూర్తి స్వరూపం ఏమిటి? తత్త్వంతో ఈశ్వరుడంటే ఏమిటో తెలుసుకోవాలి! అది చెప్తున్నాడు వశిష్ఠులవారు!

#విశ్వానికి పతివి నువ్వు, విశ్వాన్ని కల్పించినవాడివి, విశ్వరూపుడవు అయి ఉన్నావు, విశ్వానికి సాక్షివి, విశ్వాన్ని పెంచి పోషిస్తున్నావు కావున విశ్వంభర! కానీ విశ్వానికి పరిమితుడవు కావు! విశ్వాధికుడవు! విశ్వానికి అతీతుడవు!

#విశ్వరూపుడుగా ఉంటూ, విశ్వాన్ని నిర్వహిస్తూ, విశ్వాన్ని తన అధీనంలో పెట్టుకుని, విశ్వానికి అతీతుడుగా ఉంటాడు! ఇది విశ్వనాథ నామానికి వ్యాఖ్యానం!

# జగత్తంతా 24 తత్త్వాలు (5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు, 5 భూతాలు, 5 తన్మాత్రలు + 4 అంతఃకరణము) (ఇంకో లెక్కలో మహత్తు, అహంకారము, బుద్ధి, ప్రధానం, మిగిలినవి), ఈ 24 తత్త్వాలే ప్రపంచం! ఇవి ఆయనయందే పుట్టి ఆయనలోనే లయించిపోతున్నాయి! (సముద్రం, కెరటాలు ఉపమానం).

# తత్త్వవేత్తల ద్వారా నేను విన్నది ఏమిటంటే నువ్వు జగత్పరిపూర్ణుడవు, జగత్తుకు అతీతుడవు కూడా!

# అటువంటి నీ స్వరూపం ఎవరికి తెలుస్తుంది? వాదాలు చేస్తూ ఉంటే ఈశ్వరకృపకి పనికిరాదు! వాదన కంటే సాధన ముఖ్యం! ఈ వాదవివాద పాండిత్యాలకి పరమేశ్వరుడు దొరకడు!

కబుర్లు కాకరకాయలు ఇవి భగవంతుని తెలియనివ్వవు! బుద్ధిగా ఇంద్రియాలని నిగ్రహించుకుని శరణు వేడి సాధన చేయాల్సిందే! అప్పుడు స్వానుభవైక వేద్యము అవుతుంది! అనుభవంతో తెలుసుకోవలసిందే!

# ఇప్పుడు నాకు అనుభవంలోకి వచ్చింది! "నువ్వు తప్ప అన్యము లేదు" అని! అఖండమైన అద్వైతము అయిన నీ జ్ఞానమయాకృతి భాషానైపుణ్యంతో తెలుసుకోలేము! ఇవాళ నాకు అనుభవంగా తెలిసింది! ఇది తెలిసినవారికి సంసార సముద్రం దాటడం ఎంత? గోష్పాదం అంత! ముక్తికాంత అటువంటివాడికి ఇల్లాలు అయిపోతున్నది!

ఇష్టం హృదయంలో నుండి వ్యక్తం అవ్వాలి అప్పుడు అనుగ్రహం వస్తుంది! ఆయనకి తెలియనిది అని కాదు! తనకేమి కావాలో చెప్తున్నారు వశిష్ఠులు.

కాలంతో పుట్టి కాలంతో పోయే లోకాల సుఖాలు నాకు వద్దు స్వామి! అంటున్నారు!

కావలసినది ఏమిటంటే కాలమును కూడా మింగేసే నీ చిన్మయాకృతి చూపవయ్యా!

కాలబద్ధుడు జీవుడు, కాలాన్ని జీవులని నియంత్రించే కాలాతీతుడు ఈశ్వరుడు!

కేవలం జ్ఞానమే స్వరూపంగా కలవాడు కనుక ఆ చిన్మయాకృతిని చూపమని అడుగుతున్నాడు వశిష్ఠుడు.

**వశిష్ఠుల వారి మొదటి కోరిక**

#ఈ క్షణం నన్ను అనుగ్రహించు అని అడగాలి పరమేశ్వరుని! ఎప్పుడో కాదు!

"ఆదిగృహస్థశేఖర" అనే శ్లోకం అత్యంత ఉత్కృష్టం, ఎంతో సంప్రదాయం ఉన్నది ఈ పద్యంలో!

బ్రహ్మవిద్య కావాలి అనే తపన కలిగినవాడికి సన్యాసం కావాలి, అది మనస్సులో తీసుకున్నా చాలు! అటువంటి వాడికి భిక్ష పెట్టాలి, ఎవరంటే గృహస్థు అయినవాడు! అది కూడా మధ్యాహ్న వేళ పెట్టాలి భిక్ష!

ఇప్పుడు ఆదిగృహస్థు అయిన పరమేశ్వరుడు సాక్షాత్కరించాడు! మధ్యాహ్నం అయినది అంటే తపస్సు అనే తాపం, భిక్ష నువ్వే పెట్టాలి!

ఆదిగృహస్థు = పరమేశ్వరుడు

మధ్యాహ్నం= తపస్సు అనే తాపం

ఆకలి= బ్రహ్మవిద్య కోసం ఆకలితో బాధపడుతున్నాను అయ్యా! అంటున్నారు! ఎన్నో జన్మల సంస్కారం వల్ల పుడుతుంది ఆ ఆకలి!

భిక్ష = బ్రహ్మవిద్య

పాత్ర = నా హృదయమే

మాములు భిక్ష అయితే రేపటి మధ్యాహ్నంకి ఆకలి సిద్ధం! కానీ నువ్వు భిక్ష పెడితే మరొక్కరిని అడుక్కోవక్కర్లేదు! అంటే అత్యంతిక దుఃఖ మోచనం అని అర్థం!

సంపూర్ణ దుఃఖ నాశనం = మోక్షం; ఈ విలువ తెలిసినవారు దానికోసమే తపిస్తారు!

నువ్వు పెట్టిన బ్రహ్మవిద్య భిక్ష లభిస్తే, మరలా దుఃఖం పోగొట్టుకోవడం కోసం ఎవరినీ ఆశ్రయించక్కర్లేదు!

**వశిష్ఠుల వారి రెండవ కోరిక**

ఇది కోరుకున్నాక మరో కోరిక కోరుతున్నాడే? అంటే మొదటి కోరికకి ఏమాత్రం ఆటంకం కలిగించని కోరిక! మహాత్ములైన బ్రహ్మవేత్తలు అంటే బ్రహ్మానుభవం పొందినవారు ఎందుకు లోకంలో తిరుగుతారు అంటే వారికి ఒక లక్షణం ఉంటుంది అది లోకక్షేమదృష్టి! అది కోరిక అనిపించుకోదు! వారు మోక్షాన్ని పొందారు! కానీ సర్వజీవులు తరించాలని తపిస్తారు! "త్రాతుంలోకాన్ భవదవశిఖాతాపపాపచ్చమానాన్"

**మహాక్షేత్రాలు ఎలా ఆవిర్భవిస్తాయి?**

మహాత్ములు లోకక్షేమం కోసం పరమేశ్వరుని ప్రార్థిస్తారు, దానివల్ల క్షేత్రతీర్థాలు వస్తాయి, బాగుపడేయోగం ఉన్నవారికి వాటిపై విశ్వాసం కలిగి స్వామిని సేవించి తరిస్తారు.

మహాత్ముల తపస్సు వాళ్ళ భగవంతుడు ప్రత్యక్షం అవుతాడు! వారి తపశ్శక్తి, భగవంతుని శక్తి కేంద్రీకృతమై యుగాల కాలం, కల్పాంతకాలం కూడా ఆ శక్తి అక్కడ ఉండిపోతుంది, అది స్వయంభూ క్షేత్రాల మహిమ!

మొత్తానికి ఈ రెండూ కోరికలు కోరాడు వశిష్ఠులవారు! నువ్వు నీ కన్నులతో కృపారసాన్ని కురిపిస్తూ ఈ వరాలని అనుగ్రహించు అనగానే, భక్తకల్పవృక్షమైన పరమేశ్వరుడు ఒక్కసారిగా బ్రహ్మజ్యోతి నుండి స్వరూపం తీసుకున్నాడు!

**పరమేశ్వరుడు పరమలింగం నుండి రూపం తీస్కుని వ్యక్తమవ్వడం**

ఆ మహాలింగం మధ్యలో నుండి వచ్చినవాడు ఎలా ఉన్నాడు అంటే

# పెద్ద మఱ్ఱిచెట్టు, ఆ చెట్టు కింద కూర్చున్న వాడి తేజస్సు వల్ల భాసిస్తున్నదిట

# కల్పవృక్షపు చిగుళ్ల వలె లేత ఎరుపు రంగులో జటాజూటం

#చిన్ముద్ర పట్టి ఉన్నాడు "ఈశ్వరోహం" తెలియచేస్తున్న ముద్ర

# మౌనంగా ఉన్నాడట! గాఢ ఆనందభూతిలో, చిద్రసములో మునిగి మాట్లాడడంలేదో ఏమో!

చిద్రసము = కేవలం జ్ఞాన, ఆనంద అనుభవం మాత్రమే!

ఆ మౌనం చిదానంద రసానికి ఒక వ్యక్తీకరణ లేదా "వ్యక్తీకరించలేని చిదానందమే మౌనంగా కనపడుతున్నది"

నిత్యయవ్వన మూర్తి దక్షిణామూర్తి స్వామి! ఎప్పుడూ 16 ఏళ్ల వాడుగా ఉంటాడు!

ఆ రూపాన్ని చూసినా వశిష్ఠులవారు మాటిమాటికి నమస్కరిస్తూ, ఆనందాశ్రువులు రాలుస్తూ ఉన్నాడు!
శివుడు నిజంగా ఏ ఆకారం లేనివాడు! అనుగ్రహిందలచినప్పుడు ఏ రూపంలో అయినా వస్తాడు! ఏ రూపమూ లేని లింగం నుండి బ్రహ్మవిద్య అడిగాడు కావున దక్షిణామూర్తిగా వచ్చాడు!
ఏ పరమేశ్వరుడు నిర్గుణ, నిరాకార, మహాలింగ మూర్తియో ఆ పరమేశ్వరుడు జ్ఞానాన్ని అనుగ్రహించాడు దక్షిణామూర్తిగా వచ్చాడు! గురువుగా సాక్షాత్కరించాడు!

**ఈశ్వరానుగ్రహం ఆలస్యం చేయదు! ఆలస్యం మనది, ఆయనది కాదు!**
ఏమాత్రం ఆలస్యం చేయకుండా కరుణ ప్రవహిస్తున్న కన్నులతో భవార్తి సంపూర్ణంగా తొలగించడానికై అనుగ్రహిస్తున్నాడు. బ్రతికి ఉండగానే జ్ఞానానందం అనుభవించాలి! మరణించాక కాదు! అది ఎలా వస్తుంది? కేవలం ఈశ్వరానుగ్రహం వల్ల!

జ్ఞానందం అనుగ్రహించడం
కర్మకొద్దీ వేసిన అజ్ఞానపాశాన్ని అతడి భక్తి కొద్దీ తొలగించాడు! తొలగించగానే వచ్చిన జ్ఞానం బ్రహ్మజ్ఞానం!

**బ్రహ్మజ్ఞానం అంటే ఏమిటి?**
# ఆలోచనలు అణగినచోటు (చింతాంత స్థలము) అన్ని చింతలు ఎక్కడ ఆగిపోతాయో అది బ్రహ్మజ్ఞానం.
# కనపడుతున్న జగత్తంతా చిత్రమువలె స్వామిలో ఉందే కానీ దీనికి యదార్థ స్వరూపం లేదు అనే ఎరుక
# కనిపిస్తున్నదంతా భ్రాంతి అనే ఎరుక (జగన్మిథ్యా భావం)
# బ్రహ్మదేవుడి నుండి కీటకం వరకూ వ్యాపించిన ఏకతత్త్వము పరబ్రహ్మము
# పరబ్రహ్మతత్త్వము ఎటువంటిది? మనోవిషయాదూరానందం అయినది, మాటకి మనస్సుకు అందనిది!
యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సః అని చెప్పినట్లుగా ఆద్యంతములు లేని మాటకి మనస్సుకి అందనిది, అలాంటి బ్రహ్మజ్ఞానం/ఆత్మజ్ఞానం/తన జ్ఞానం ఇచ్చి అవిద్యా గ్రంథి తొలగించాడు!
"భిద్యతే హృదయగ్రంథి: ఛిద్యంతే సర్వసంశయా:" అని చెప్పినట్లుగా ఆ పరమేశ్వరుడు తనపై దృష్టి పెట్టి భక్తితో కొలుచుకున్న వసిష్ఠునిపై కరుణరూపమైన దృష్టిని ప్రసరింపచేసి జీవ బ్రహ్మ ఏక జ్ఞానాన్ని ప్రసాదించి అంతర్హితుడు అయ్యాడు!

వశిష్ఠుని తపఃప్రభావం చేత ఆ మహాలింగం అక్కడే నిలిచిపోయింది! అదే మనం అందరం కొలుచుకుంటున్న శ్రీకాళహస్తీశ్వర లింగం! ఇప్పటికి మనం లింగాన్ని దర్శించేముందర ప్రథమతః దక్షిణామూర్తిని దర్శించుకుని వెళ్తాము!

అన్నీ రూపములకి కారణం మహాలింగం! ఒక వటవృక్షం నుండే అనేకరకాల కొమ్మలు, ఆకులు వచ్చినట్లు మహాలింగం నుండే స్వామివారి అన్నీ మూర్తులు వ్యక్తం అవుతాయి. అందుచేత లింగారాధన చేస్తున్నాము అంటే అన్నీ మూర్తులని ఆ లింగముయందే ఆరాధన చేస్తున్నాము అని తెలుసుకోవాలి! సర్వమూర్తులని తను లీనం చేస్కుంటూ ఎప్పుడు ఏ మూర్తి అవసరమో ఆ మూర్తిని ప్రకటించే స్వరూపమే మహాలింగం!

వశిష్ఠుడు అక్కడే ఉంటూ పరవశిస్తూ నివసిస్తూ ఉన్నాడు! శివుడు కూడా అక్కడే ఉంటూ ఉన్నారు! పార్వతీ దేవి కూడా దివ్యమైన శిబిక పై వచ్చి అక్కడ నెలకొన్నది! ఆయనేమో జ్ఞానప్రదాత! ఆవిడ జ్ఞానప్రసూనాంబ! ప్రసూనం అంటే విచ్చుకున్న కుసుమము! సంపూర్ణ జ్ఞానమే ఆ తల్లి!

స్వామి వాయులింగముట! వాయుదేవుడు మహాబలుడు, ఆయన ఇక్కడ తపస్సు చేసాడు! శివుని అష్టమూర్తుల్లోని వాయువు, ఆ వాయుదేవుని అనుగ్రహించాడుట!

**శ్రీకాళహస్తి క్షేత్రం**

ఒక సాలెపురుగు, ఒక పాము, ఒక ఏనుగు స్వామివారిలో ఐక్యం అయ్యాయి! ఇదివరకూ స్వామివారి లింగం ఎలా ఉండిందో తెలియదు కానీ, ఈ మూడూ ఐక్యం అయ్యాక మాత్రం, అడుగు భాగంలో సాలీడు వంటి ఆకృతి, మధ్యలో ఏనుగు దంతం వలె, ఆ ఊర్ధ్వంలో పాముపడగ కనపడుతూ ఉంటుంది!

భక్తుల చిహ్నాలే తన ఆకారంగా చూపే భక్తవత్సలుడు స్వామి!

ఒక పురుగు, జంతువే ముక్తి పొందాయి, బుద్ధి పొందిన మానవులు స్వామిని ఆశ్రయిస్తే తరించవచ్చు అని చెప్పడానికా అన్నట్లు!

వాయువు సాధారణంగా పూలవాసనని మోసుకు వెళుతుంది! అమ్మవారు జ్ఞానప్రసూనం కదా! ఆ జ్ఞాన పరిమళం ఈ వాయువు మోసుకొచ్చి మనకి ఇస్తున్నది! అమ్మ, అయ్యవారు భిన్నం కాదు కానీ వాయులింగం, జ్ఞానప్రసూనాంబ అన్నప్పుడు చక్కటి అనుబంధం!

శ్రీకాళహస్తీశ్వరుని ఏ ఏ దేవతలు ఎలా కొలుచుకున్నారో పురాణాల్లో ఎంతో కనపడుతుంది!

మోక్షం కావాలంటే జ్ఞానస్వరూపం అయిన దక్షిణామూర్తి అనుగ్రహం ఉండాలి! ఇంత స్పష్టమైన దక్షిణామూర్తి క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరక్షేత్రం! జ్ఞానక్షేత్రంగా పురాణాలు చెప్తున్నాయి!

కైలాసం నుండి శివానంద శిఖరం అనే శిఖరం బ్రహ్మాదిదేవతల ప్రార్థన మేరకు కదిలి వచ్చి కాళహస్తిలో నెలకొన్నది! అందుచేత ఈ క్షేత్రానికి దక్షిణకైలాసం అని పేరు! అటు తర్వాత ఎంతోమంది మహర్షులు, సిద్ధులు ఆ చోటుకు చేరారు! వశిష్ఠుడు అంతటివారికి అజ్ఞానమా! తద్వారా పరమేశ్వరుడు లీల చేసి వశిష్ఠ మహర్షి అంతటివారి తపస్సుకు అనుగ్రహించాలి కావున, ఆ మిషతో స్వామి ఇక్కడ స్థిరపడ్డారు!

అది సద్యోముక్తి క్షేత్రంగా భాసిస్తున్నది! ఇక్కడ పరమేశ్వరుడు ఎలా తిరుగుతున్నారో వర్ణిస్తున్నారు!
కొందరు మహర్షులు - యోగసాధనతో ఉన్నవారు
కొందరు మహర్షులు - గృహస్థాశ్రమంలో ఉన్నారు
కొందరు - ఆటవికులు
వీరందరి కంటే ముందర వచ్చిన శివుడు ఏమి చేస్తున్నాడు అంటే వారందరితో కలిసి తగిన వేషాలతో తిరుగుతున్నారట! ఎవరికి తగ్గట్లు వారితో!

**కాళహస్తిలో స్వామి లీలావిహారం**

# ఒకవైపు వివిధములైన శిష్ట సంప్రదాయాలతో సంయమి గృహమేధులు, తపోజీవనులు అయిన తాపస గృహస్థులతో వారితో ఆ వేషంతో తిరుగుతున్నాడు స్వామి!
# బోయలతో పాటు బోయడిగా తిరుగుతున్నాడు!
# అంతర్యాగ సాధనలు చేస్తున్న సిద్ధగృహస్థులతో కలిసి తానూ ఒకడిగా తిరుగుతున్నాడు
# పరిసర ప్రాంతాల్లో జీవిస్తున్న ధర్మబద్ధ భోగాలు అనుభవించే గృహస్థులు ఉన్నారు వారిలో ఒకరిలా ఈయన కూడా పార్వతీ దేవితో కలిసి ఉన్నాడట.
వేటగాడు, గృహస్థు, సన్యాసి, అన్నీ ఆయనే!
"తన్ను తెలిసినవారికి అన్ని దశల తానెయను రీతి బహువేషధారియగుచు"
వివిధరూపాలతో సంచరిస్తున్నాడుట స్వామి!
ఇన్ని లంపటాలతో భక్తలంపటుఁడు అయిన పరమేశ్వరుడు విహరిస్తున్నాడు!

అగస్త్యమహర్షి అటుపై ఇక్కడికి వచ్చి పరమేశ్వరుని ఆరాధన చేయడం కోసం, ఇక్కడ కూడా గంగ ప్రవహిస్తే బాగుంటుంది అని తపస్సు చేస్తే పరమేశ్వరుడు సంతోషించి బ్రహ్మదేవుడి ద్వారా గంగని పంపారుట! అదే సువర్ణముఖరి నది! సువర్ణం భాగ్యానికి సంకేతం! ఈ గంగ భూమికి భాగ్యముగా వచ్చింది కనుక "సువర్ణ", నాదమయమైన శబ్దముతో వచ్చినది కనుక ముఖరి. అందుచేత సువర్ణముఖరి. దిగంతాలను ధ్వనింప చేస్తూ వచ్చినది!

అగస్త్య మహర్షి శివుని అర్చించడం

సహస్రనామాలతో పూజించాడు, వాక్పటిమతో స్తోత్రాలు, ప్రదక్షిణాలు, ప్రణవసహితంగా జపం, ధ్యాననిష్ఠతో మౌనం వహించాడు. అంతా పూర్తి అయ్యాక స్వామిని విడిచిపెట్టలేక చూస్తూ ఉన్నాడు! కాశీని విడిచిపెట్టానన్న బెంగ ఈయనని చూసాక పోయిందట అగస్త్య మహర్షికి!

**అగస్త్య మహర్షి అమ్మవారిని కొలవడం**

**శ్రీవిద్యకి గురువు దక్షిణామూర్తి!**

1) దక్షిణామూర్తి విద్య, 2) హయగ్రీవ విద్య, 3) ఆనందభైరవ విద్య అని మూడు ఉంటాయి!

మొదటిరెండూ దక్షిణ సంప్రదాయం!

దక్షిణామూర్తి అక్కడికి వస్తే శ్రీవిద్యాధిదేవత జ్ఞానప్రసూనాంబిక వచ్చినది!

అగస్త్య మహర్షి, లోపాముద్రాదేవి అమ్మవారిని అద్భుతంగ కొలుచుకుంటున్నారు!

యాభై అక్షరాల స్వరూపిణి (మాతృకావర్ణ రూపిణి), పరశివ రమణి, పంచభూతాలే పీఠాలుగా కలిగిన తల్లి, పంచకేలేశములను తొలగించే తల్లి, పంచవిద్యాస్వరూపిణి (విశేషమైన బ్రహ్మవిద్య స్వరూపం), పృథ్వీ మండలానికి భాగ్యాన్ని కలిగించడానికి ఉన్నది! యోగీశ్వరుల హృదయంలో సంచరించే జ్ఞానప్రసూనాంబని కొలుచుకున్నారు!

**అగస్త్య కృత కాళహస్తీశ్వర దండకం**

అద్భుతంగా చేసారు ధూర్జటి!

పరమేశ్వరా! నువ్వు తప్ప జగత్తులో మరొక్కటి లేదు! మొత్తం పూర్ణమై వ్యాపించి ఉన్నావు! సూక్ష్మ సూక్ష్మార్థమై, స్వార్థమై (స్వ అర్థం, ఆత్మస్వరూపం) నువ్వు తప్ప ఇంకొక్కటి లేకపోయినా నువ్వు తప్ప అన్నీ సత్యమే అన్న అజ్ఞానం ఏర్పడింది! ఎందుకు? దేహమే ఒక ఇల్లు చేస్కుని ఇందులో త్రిగుణములు, బుద్ధి, అహంకార, చిత్తములు, ఆరు శత్రువులు, పాశములు, కోశములు ఇవన్నీ పొందున్నది దేహము! అందులో ఉన్నది నువ్వు! ప్రతీ జన్మలో ఈ దేహంలో నువ్వే ఉన్నావు! అది తెలుసుకోక, ఇవన్నీ నీకే కల్పిస్తున్నట్లు భావిస్తూ, పుణ్యపాప కర్మలను అనుభవిస్తూ, తాము ఐహికాముష్మికా దుఃఖములను పొంది తిరుగుతూ ఉంటాడు జీవుడు!

దేనికి విముక్తి ఏమిటి? నిన్ను ఒక్కసారి హృదయమారా భావిస్తే ఇవన్నీ తొలగిపోతాయి, అది తెలుసుకోలేక, చీకటిలో పడి తిరుగుతూ ఉంటే, దయ తలచి

#అవిద్యలో, జన్మపరంపరల్లో కొట్టుకుపోతూ జీవుడు తరించాలి అని తపన పడి నిన్ను ఆశ్రయిస్తే వారిని అనుగ్రహించడానికి, ముక్తిని ఇవ్వడానికి ఇక్కడ దివ్యలింగంగా వెలిసావు! అయినప్పటికీ తెలుసుకోలేకపోతున్నారు!
#కొందరు ఎలా ఉన్నారంటే అక్కర్లేని వాదాలు అవీ చేస్తూ పరమార్థం తెలుసుకోలేక ఉన్నారయ్యా!

కొందరు యోగసాధనలు చేస్తూ ఉంటారు! చేయగా చేయగా కుండలినిని జాగృతి చేసి, ఆరుచక్రములు అధిగమించి, సహస్రారమనే చిద్వ్యోమమునందు చంద్రబింబము వంటి నీతో తాదాత్మ్యం చెందుతారు! అటువంటివాడికి ద్వంద్వాలు ఉండవు! లోకమునెల్ల పరబ్రహ్మముగా చూస్తారు! ఆ యోగులు పొందే బ్రహ్మమే మా ముందర కాళహస్తీశ్వరునిగా అనుగ్రహిస్తున్నది! చూస్తే చాలు ముక్తినిచ్చే విధంగా నెలకొని ఉన్నావు స్వామి!

దండకం భావం:
లోపల నేను నేను అనుకుంటున్న జీవుడు నిజానికి ఈశ్వర స్వరూపమే! అది తెలియక అనవసర విషయాలతో చుట్టబెట్టుకుంటూ తాపత్రయపడుతూ ఉన్నాడు! దీని నుండి అనుగ్రహించడానికి నువ్వు ఇక్కడ వెలిసి ఉన్నావు! అయితే నువ్వు భక్తికి వస్యుడవు అని తెలుసుకోక భక్తితో నిన్ను ఆశ్రయించలేక అనవరపు సిద్ధాంతాలు చేస్తారు, కొందరు మంత్ర, తంత్ర సాధనలు చేస్తారు మంచిదే చిత్తశుద్ధితో క్రమంగా నీదగ్గరికి వస్తారు, కొందరు యోగసాధనతో నీ దివ్యానుభూతిని పొందుతారు! వీరంతా చిట్టచివరికి ఏ పరమాత్మని పొందుతారో ఆ పరమాత్మ ప్రతీవారికి దర్శనయోగ్యంగా ఈ క్షేత్రంలో వెలసి ఉన్నాడు! ఎందుచేత? భక్తుల పాలిట వాత్సల్యం చేత! ఇంకోటేమి కారణం కాదు!
భక్తవాత్సల్య స్వరూపుడు శ్రీకాళహస్తీశ్వరుడు!

**శ్రీకాళహస్తి అంతరార్థం**
సాలెపురుగు: తన నుండి వచ్చే దారములతో గూళ్ళు కట్టింది. భక్తితో కట్టింది! మనకున్న బుద్ధితో భగవంతుని ఆశ్రయించి ఆయనకి సమర్పణ చేయడం!
మనలోని బుద్ధి సాలెపురుగు
పాము: మన ప్రాణశక్తి
ఏనుగు: శరీరం/దేహం
ఈ మూడు అందరికీ ఉన్నాయి కదా! మన శరీరమే శ్రీకాళహస్తి క్షేత్రం! అందులోని కాళహస్తీశ్వరుని ఎందరు తెలుసుకుంటున్నారు? మన బుద్ధి, ప్రాణం, దేహం ఆయనవైపే తిరగాలి!

ఎవరి బుద్ధి సాలెపురుగుగా తన ఆలోచలనాలని ఈశ్వరార్పణ చేస్తుందో, ఎవరి ప్రాణము సర్పమువలె ప్రాణాయామాది ప్రక్రియలతో ఈశ్వర నామాన్ని ఉచ్చరిస్తూ ఉంటుందో, ఎవరి యొక్క శరీరం కైంకర్య, అర్చన, సత్కర్మాది రూపములతో ఈశ్వరారాధన చేస్తుందో, అటువంటి బుద్ధి, ప్రాణ, దేహములు ఈశ్వరుని తెలుసుకున్నప్పుడు శ్రీకాళహస్తీశ్వర దర్శనం అయి, ఆయనే శ్రీ, కాళ, హస్తులని నడిపిస్తున్నది శ్రీకాళహస్తీశ్వరుడు అని తెలుస్తుంది!

**సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు**

# శ్రీదక్షిణామూర్తి రెండవ రోజు (6/13/2021)

శివాయగురవే నమః    శ్రీమాత్రేనమః

శ్రీవిష్ణురూపాయం నమఃశివాయ

శ్రీకాళహస్తీశ్వరాయ నమఃశివాయ

శ్రీదక్షిణామూర్తయే నమఃశివాయ

కందళిత బోధముద్రం కైవల్యానంద సంవిదున్నిద్రం

కలయే కంచనరుద్రం కరుణారసపూర పూరిత సముద్రం

నిన్నటి స్మరణ: శ్రీకాళహస్తీశ్వరుడే దక్షిణామూర్తి అని తెలుసుకున్నాము! కాళహస్తీశ్వరా లింగము, దక్షిణామూర్తి వేరు కాదు అని తెలుసుకోవాలి! లింగమునుండే దక్షిణామూర్తిగా వ్యక్తమయ్యాడు స్వామి. శ్రీకాళహస్తీశ్వర స్వామియే దక్షిణామూర్తి అని నమస్కరించుకోవాలి! వశిష్ఠుని తపస్సు, అగస్త్య కృత స్వామి స్తుతి, అలాగే శ్రీ, కాళ, హస్తి లోని ఆంతర్యం తెలుసుకున్నాము! శ్రీ, కాళ, హస్తి అంటే బుద్ధి, ప్రాణం, దేహం, ఈ మూడింటికి చైతన్యప్రదాత ఈశ్వరుడు. ఈ మూడింటికీ అందడు! ఈశ్వరునియందు భక్తితో ఈ మూడు ప్రవర్తిస్తూ ఉంటే పరమేశ్వరుడు అనుగ్రహించి ఆ జీవునికి కైవల్యం ప్రసాదిస్తాడు!

**దక్షిణామూర్తి ధరించే చిన్ముద్రకి శ్రీకాళహస్తి క్షేత్రానికి అన్వయం:**

అంతఃకరణం, ప్రాణం, దేహము, ఈ మూడూ నేను అని ప్రతీవాడూ అనుకుంటూ ఉంటాడు! మూడింటితో కలిసిపోయే వాడు జీవుడు! శ్రీ, కాళ, హస్తులకి ఆధారమై, చైతన్యం ఇచ్చేవాడు ఉన్నాడు, వాడు ఉండడం వల్లనే నేను అనుకోగలుగుతున్నాను అని జీవుడు తెలుసుకుంటే, ఆ "నేను" అనుకునే జీవుడు "నేను" కి హేతువు మూడింటికీ విలక్షణంగా ఉన్న ఈశ్వరుడే అని తెలుసుకుని, క్రమంగా "నేను" అనబడే జీవుడు, బుద్ధి, ప్రాణ, దేహములతో మమైకమై పోయి ఉన్న జీవుడు, క్రమంగా ఈ మూడింటికి చైతన్యం ఇచ్చే ఈశ్వరుడిని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ, ఈశ్వరాభిముఖమై  సాధన చేస్తూ ఉంటే, ఆఖరికి జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు కాదు, ఈ

మూడింటితో తాదాత్మ్యం వల్ల భేదం కనపడుతున్నది కానీ అది వదిలి వేసి మూడింటికీ చైతన్య ప్రదాతని తెలుసుకునే ప్రయత్నం చేస్తే జీవుడే ఈశ్వరుడు అవుతాడు!

దేహతాదాత్మ్య స్థితి - ఈశ్వర జీవ భేదం

బ్రహ్మ తాదాత్మ్యం స్థితి - జీవ, ఈశ్వర ఏకత్వం

శ్రీకాళహస్తీశ్వర అనే నామంలోని చిన్ముద్ర రహస్యం ఇది!

దక్షిణ కైలాసం అని కూడా అంటారు శ్రీకాళహస్తీశ్వర క్షేత్రాన్ని. తపస్సు చేయడానికి అత్యంత సులభమైన ప్రాంతం. అంటే తపస్సు సిద్ధించడం ఇక్కడ సులభం! ఇది తపోభూమి!

**కాళహస్తి ఒక రహస్య క్షేత్రం! ఒక్కొక్క క్షేత్రానికి మన శరీరంలోని స్థానాలకు సంబంధం ఉన్నది.**

మూలాధారం = కమలాపురం

చిదంబరము = హృదయం

కాశీ = ఆజ్ఞాచక్రం

మహాకైలాసం = శీర్ష స్థానము

శ్రీకాళహస్తి = విశుద్ధి చక్ర స్థానం, ప్రాణమునకు ప్రధానము

శ్రీకాళహస్తి ప్రధానంగా ముక్తిక్షేత్రం, జ్ఞానక్షేత్రం! అందుచేతనే అమ్మవారు జ్ఞానప్రసూనాంబికగా ఉన్నది, అయ్యవారు జ్ఞానప్రదాతగానే వ్యక్తమయ్యాడు.

ఈ క్షేత్రం జ్ఞానవైరాగ్యదం! హిందూ ధర్మంలో ఈ పుణ్యభూమియందు అనేక క్షేత్రాలు ఉన్నాయి. అయినప్పటికీ ఒక్కొక్క క్షేత్రము నుండి ఒక్కొక్క విభూతిని ప్రకటిస్తూ ఉంటాడు! శ్రీకాళహస్తి జ్ఞానవైరాగ్య క్షేత్రం! కలి ప్రభావం చేత రాహుకేతువుల దోషాలు పోగొట్టుకోడానికి వెళుతున్నారు కానీ, అమ్మవారిని, అయ్యవారిని పట్టుకుంటే అన్నీ గ్రహదోషాలూ పోతాయి.

కాంచీ యతీంద్రులవారు పరమాచార్యవారు ప్రీతి భావంతో కాళహస్తిలో వసించి గుప్తమైన ఎన్నో రహస్య క్షేత్రములని, స్థలాలని ప్రకటింపచేసారు. అక్కడ పంచముఖ పొదలమాటున శివలింగాన్ని చూపించి ప్రకటింపచేసారు.

ఆ కాలంలో ఎక్కువ రద్దీ ఉండేది కాదు కాళహస్తిలో! విశ్వనాథ వారంటారు "తిరుపతికిన్ పోయి ఒడలి నగలెల్ల తీసి ఇచ్చెదరు, హరా! నిన్ను చూచి ఒక నమస్కారమాచరించెదరు" అంటారు!

నిజానికి ఆలయానికి ఆదాయమే అభివృద్ధి చిహ్నం కాదు! ఆ ఆలయంలో జరగవలసిన కైంకర్యాలు, పవిత్రత వీటిని కాపాడటమే నిజమైన అభివృద్ధి! దేవాలయ నిర్వహణ, శ్రద్ధ భక్తులు, పవిత్రతను కాపాడటమే మన కర్తవ్యము!

నమస్కారము మైమరపుతో చేసే ఒక సమర్పణ! జ్ఞాన క్షేత్రం, వైరాగ్య క్షేత్రం! ఇక్కడ భగవానుడు భక్తవాత్సల్య రూపంతో ఉన్నాడు! ఎవరైనా భక్తి చూపిస్తే ముక్తిని ఇస్తాను అని ప్రతిజ్ఞ పట్టినట్లు ఈ క్షేత్రంలో ఉన్నాడు!

ఎన్నో సాధనలు చేస్తే కానీ రాని ముక్తిని, కేవలం సమర్పణ భావంతో శ్రీకాళహస్తీశ్వరుని సేవించుకుంటే ఆయన ముక్తిని ఇస్తాడు. అందుచేత సద్యోముక్తి క్షేత్రం అని చెప్పబడుతున్నది. ఈ క్షేత్రాన్ని ఆశ్రయించుకుని సద్యోముక్తి వ్రతము అని ఒక వ్రతము కూడా చెప్పబడుతున్నది. దీని గురించి పరమాచార్యుల వారు కూడా తెలియచేసారు. ఇప్పటికి ఉన్నారు అది చేసేవారు!

ముక్తిని, సాయుజ్యాన్ని ఇస్తాను అన్నాడు భగవానుడు! మరి జ్ఞానం, వైరాగ్యం, విచారణ లేకుండా ఎలా అంటే? అనేక జన్మల సాధన పండితే ఈ పరమేశ్వరుడి సర్వ సమర్పణ చేసేటువంటి బుద్ధి కలిగి, అలాంటివాడు ముక్తిని పొందుతాడు! అలాగే ముక్తిని పొందినవాడు భక్త కన్నప్ప.

శ్రీకాళహస్తికి వెళ్లకపోయినా, ఆ క్షేత్రాన్ని, స్వామి నామాన్ని శ్రీకాళహస్తీశ్వరా అని నామం అన్నా కూడా ధన్యులు అవుతారు అని వ్యాసోక్తి! ఈ క్షేత్రాన్ని ధ్యానించినా, కీర్తించినా, శ్రవణం చేసినా కూడా, ఇక చూస్తే కూడా ధన్యులు అవుతారు! స్పర్శించినప్పటికీ కూడా అన్నారు అంటే క్షేత్రస్పర్శ, శివలింగ స్పర్శ కాదు, ఇక్కడ శివలింగానికి స్పర్శించడానికి లేదు, దానికి నవగ్రహ కవచం పెట్టి దానికే పూజ చేస్తారు, బిల్వార్చనము, ప్రోక్షణము మాత్రమే, అభిషేకాదులు లేవు! దానివెనుక ఎన్నో రహస్యాలు ఉన్నాయి.

ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ శ్రీమత్ దక్షిణ కైలాసం అనుకున్నా, శ్రీకాళహస్తీశ్వరా అనుకున్నా ధన్యులు అవుతారు.

అక్కడ సంచరించిన వారు ఏదయినా ప్రాంతానికి వెళ్లినా ధన్యులు అవుతారు అంటే ఇక అక్కడే ఉన్నవారి గురించి చెప్పేదేముంది. అనేక శాస్త్ర ప్రమాణములయందు దీని విశేషము ఇలా చెప్పబడుతున్నది.

పశ్చిమాభిముఖంగా ముందర లింగము గోచరించింది కదా, అందుచేత లింగము పశ్చిమాభిముఖంగా ఉంటుంది. మానవుడైనవాడు ఆ క్షేత్రాన్ని చేరుకొని స్వామికి అర్చన చేయించుకోవాలి. అనేక జన్మల తపస్సుల చేత మాత్రమే స్వామివారి దర్శనం జరుగుతుంది.

ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క పేరు ఉన్నది ఈ క్షేత్రానికి. శ్రీకాళహస్తి నగరం అనేది ప్రధానంగా పేరు అయినప్పటికీ

కృత యుగం - బ్రహ్మపురం - స్వర్ణవర్ణం

త్రేతా యుగం - విష్ణుపురం - వెండివర్ణం

ద్వాపర యుగం - నారద పురం - ఇనుము రంగు

కలియుగం - శ్రీకాళహస్తి - రాతివలె

అంతకుముందర శ్రీకాళహస్తి పేరు లేదని కాదు!

అరుణాచలానికి కూడా వర్ణ విశేషాలు ఇలాగే చెప్పారు!

కృతయుగ జీవులు శుద్ధులు కనుక వారికి సూక్ష్మ శక్తిని చూడడం తెలుస్తుంది. కలియుగంలో భౌతికవాదమే ఎక్కువ కనుక వీరికి శిలగానే గోచరిస్తుంది. ఇప్పటికి సిద్ధులైనవారు అనుష్ఠిస్తే జ్యోతీరూపంగా గోచరిస్తుంది.

**అనేకమంది అనేక విధాలుగా స్వామిని కొలుచుకున్న విశేషాలు:**

కృతయుగం - బ్రహ్మదేవుడు, అగస్త్యుడు, పార్వతీదేవి, నీలా, హరహరుడు, మయూరుడు, భీముడు, సూర్యుడు, చంద్రుడు, ఇంద్రుడు

త్రేతాయుగం - హరిహరాదులు, లక్ష్మి, కుమార స్వామి, రామచంద్రమూర్తి, కన్నప్ప (మనం స్వీకరిస్తున్నది త్రేతాయుగం నాటి కథ)
ద్వాపరాంతంలో - కాళ, హస్తులు కొలుచుకున్నారు, మరెందరో కూడా కొలుచుకున్నారు.

**సదాశివగుహ/చిద్గుహ/యక్ష గుహ**

ఇక్కడ ఈ పావన కైలాస పర్వతంలో ఒక గుహ ఉన్నది సదాశివగుహ/చిద్గుహ/యక్ష గుహ. దీన్ని ప్రయత్న పూర్వకంగా దర్శనం చేసుకోవాలి. దీనికి ఈ పేర్లు రావడానికి కారణం కేనోపషత్తు లోని కథ ఈ గుహయందే జరిగినట్లు ప్రమాణాసహితంగా పురాణాల్లో కనపడుతున్నది.
ఒకప్పుడు దేవతలు అసురసంహారం చేసి అహంకరిస్తూ ఉండగా పరమేశ్వరుడు యక్ష రూపంలో కనపడడం, తర్వాత ఆయన అంతర్థానం అయి, అమ్మవారు "ఉమా హైమావతీ బహు శోభమానా" గా కనపడి వచ్చిన యక్షుడు బ్రహ్మము అని తాను ఆయన శక్తిని అని చెప్పి ఇంద్రాదులకు బ్రహ్మవిద్య బోధించింది. ఆ బ్రహ్మవిద్యయే శ్రీవిద్య! ఆ విద్య ఈ చిద్గుహ నుండే లభించింది.

యక్ష అంటే యక్ష జాతికి చెందినవాడు అని కాదు, ఇక్కడ యక్ష అంటే పూజించదగిన వాడు అని అర్థము! స్వామి చేసినదేమిటి? అహంకారాన్ని పరీక్షించి, అటు తర్వాత శరణాగతుడైన ఇంద్రుని కరుణించి అమ్మగా గోచరించాడు!

ఇంద్రునికి సాక్షాత్తుగా శివుని కృపారూపమైన జగన్మాత బోధించినదే శ్రీవిద్య! అదే బ్రహ్మవిద్య! అందుచేత ఇది శ్రీవిద్యా క్షేత్రం! శ్రీవిద్యకి గురువు ఎవరు? దక్షిణామూర్తి ఆయన శ్రీవిద్యా శాస్త్ర ప్రవర్తకుడు! అందుచేత ఇది దక్షిణామూర్తి క్షేత్రం, శ్రీవిద్యా క్షేత్రం.

**పరిపూర్ణమైన శివ శక్తి ఇక్కడ ఉన్నది అని శాస్త్రము చెప్తున్నది!** నాలుగు హేతువుల చేత ఇది శివ సంపూర్ణ సాన్నిధ్యం కలిగిన క్షేత్రం అని చెప్పాలి! ఒక శక్తిని ఎప్పుడు పావుభాగం అనాలి, ఎప్పుడు పరిపూర్ణం అనాలి అని శాస్త్రము చెప్తున్నది (స్కాందంలో చెప్పినది)
#ఏది ఉన్నతమై, ప్రసిద్ధమై స్వయంభూ శివలింగంతో క్షేత్రం ఉంటె అక్కడ శివుడు పాదమాత్రం అనగా పావుభాగం శివతత్త్వం ఉన్నట్లు!
# అదే ఆ శివలింగాన్ని హరి, బ్రహ్మ, ఇంద్రాదులు పూజించితే అక్కడ అర్థ సాన్నిధ్యము ఉన్నట్లు!

# ముప్పాతిక భాగం శివసాన్నిధ్యం ఉన్నదని ఎప్పుడు అనాలి అంటే పుణ్య పర్వతాలు ఉంటూ, పుణ్య నదులు ఉంటూ, అక్కడ ప్రవహించే నది సముద్రంలో ప్రవేశించేవరకు ఒకే నామంతో వ్యవహరింపబడుతూ ఉన్నప్పుడు! ఆ నది తీరంలో దివ్య క్షేత్రం ఉంటె అక్కడ ముప్పాతిక భాగం శివసాన్నిధ్యం ఉన్నట్లు! ఈ పవిత్ర సువర్ణముఖరీ నదిలోని ప్రత్యేక ధాతువులు శక్తిరూపాలు! అందుచేత ఇది చిచ్ఛక్తి క్షేత్రం అని తెలుసుకోవాలి! పైగా శ్రీవిద్య మోక్షప్రధానమైన విద్య, ఆ కారణం చేతనే అమ్మ జ్ఞానప్రసూనాంబిక అని చెప్పబడుతూ ఉన్నది.

# నాలుగు భాగాలు ఉన్న పూర్ణ శివసాన్నిధ్యం అని ఎప్పుడు అనాలి?

సమస్త దేవ, ఋషులు పుణ్య తీర్థాలలో స్నానం చేస్తూ స్వామిని సేవిస్తే, చిద్గుహ ఏ పర్వతంలో ఉంటుందో, ఆ క్షేత్రంలో పూర్ణ భాగం శివసాన్నిధ్యం ఉన్నట్లు!

1) స్వయంభు 2) హరిబ్రహ్మదులు సేవిస్తారు 3) సువర్ణముఖరీ 4) చిద్గుహ

భారతదేశంలో స్వయంభూ శివక్షేత్రాలు ఆసేతుసీతాచలం వరకూ ఎన్నో ఉన్నాయి! ఇవన్నీ ఇప్పటి తరాల వారికి తెలియచేయాలి! విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బోధించినవిధంగా ఇప్పుడు పెద్దలు ఈ తరానికి చెప్పాల్సిన అవసరం ఉన్నది. అప్పుడు ఇటువంటి చారిత్రిక, మహిమాన్విత క్షేత్రములున్న భారతంలో మనం ఉన్నామా అని తృప్తి కలిగి వాటిని సేవించాలి! పద్ధతిగా సేవించాలి!

ఒకప్పుడు కాశీక్షేత్రంలో అనేకమంది మునీశ్వరులు జ్ఞానం చేస్తూ, విచారణ చేస్తూ ఉండగా పెద్ద పెద్ద వారు కూడా అక్కడికి వెళ్లి జీవ, ఈశ్వర భేదం మీద చర్చ చేస్తున్నారట! దీనిమీద రకరకాల సిద్ధాంతాలు ఉన్నాయి! ఈ రకరకాల వాదనలు చేస్తున్న వారు సామాన్యులు కాదు! సాధకులైన మునీశ్వరులకి అయోమయం ఏర్పడడంతో వారంతా బ్రహ్మదేవుని సాక్షాత్కరింప చేస్కుని అడిగారట ఈ విధంగా "స్వామి! ఏదయినా స్పష్టమైన విషయం మీరు బోధించాలి! జీవ, ఈశ్వర భేదం ఉన్నదా? లేదా? రెండూ విషయాలూ చెప్తున్నాయి కదా ఉపనిషత్తులు! అన్వయ లోపమా? శాస్త్రములోనే ఉన్నదా?" అని అడిగారు!సాధకుల ప్రశ్న ఇది! సాధన చేసేవాడికి వచ్చే ప్రశ్న నిజమైన జిజ్ఞాస, ఇదే పరిప్రశ్న!

అప్పుడు బ్రహ్మదేవుడు ముఖ్యమైన కొందరు బ్రహ్మవాదులతో అన్నారు "నేను ఒక క్షేత్రం పేరు చెప్తాను, అక్కడికి వెళ్లి సాధన చేయండి, అప్పుడు సాక్షాత్తు భగవానుడే వస్తాడు" అని చెప్పారు!

**కథలోని ఆంతర్యం:** భగవత్ అనుభవంతో తేలాలి, వాదాలతో ఏదీ తేలదు! ఎంత పండితుడైనా ఈశ్వరానుగ్రహంతోనే సత్యం తెలుసుకోగలడు!

అందరు దక్షిణకైలాసం చేరి ఉగ్రమైన తపస్సు ఆచరించారు! స్వామి సంతోషించి, వారి సంశయాలు ఛేదించడానికి దక్షిణామూర్తిగా సాక్షాత్కరించాడు! శ్రీకాళహస్తీశ్వరుని సహజ రూపం దర్శింపచేసాడు!

చిరునవ్వు, చిన్ముద్ర ఈ రెండే దక్షిణామూర్తి వద్ద ఉన్నవి! చిరునవ్వు = ఆనందం, చిన్ముద్ర = జ్ఞానం; అదే ఆయన రూపము. జ్ఞానందమే ఆయన స్వరూపం! ఈ రెండింటితో ప్రసన్నుడై అక్కడున్న వారి సందేహాన్ని పోగొట్టి అనుగ్రహించాడు!

సత్యము ఒక్కటే! రెండు లేవు! బ్రహ్మము ఒక్కటే! జీవుడు కూడా బ్రహ్మమే! అయితే అది జీవుడికి అనుభవానికి వచ్చేవరకు సాధన దశలో భేదం ఉంటుంది! కానీ ఈశ్వరాభిముఖంగా వెళుతూ ఉన్నప్పుడు తాను వేరు, ఈశ్వరుడు వేరు అనుకున్నా, సిద్ధావస్థకి వెళ్ళేటప్పటికి జీవ బ్రహ్మ ఏక స్థితిని చూపిస్తుంది!

ఎంతవరకూ దేహాత్మభ్రాంతి ఉంటుందో, ఎంతవరకూ ప్రపంచభిమానం ఉంటుందో అంతవరకూ ద్వైత, విశిష్ట అద్వైతములు ఉంటాయి! వ్యవహారమంతా ద్వైతమే! అద్వైతపు కబుర్లు చెప్తూ ద్వైత ప్రపంచంలో దేవుళ్ళు ఆడుతూ ఉంటే అది వంచనయే!

**ద్వైత భావం ఉన్నంత కాలము ఎలా ఉండాలి?**

ధర్మం ఉండాలి, ఉపాసన ఉండాలి, పరమాత్మ పట్ల ప్రపత్తి, శరణాగతి ఉండాలి!

ద్వైతము, విశిష్టాద్వైతము కూడా వేదమే ఇచ్చింది! ఇది కూడా అవసరమే! భక్తి, ప్రపత్తి ఏర్పడుతాయి, తర్వాత క్రమంగా పరమాత్మ "దాసోహం" నుండి "దా" తీసేసి "సోహం" అంటాడు! ఆ స్థితిని ప్రసాదిస్తాడు!

అందుచేతనే పరమమైనది అద్వైత సిద్ధాంతము! అద్వైతము అనగానే దక్షిణామూర్తి గుర్తుకు వస్తాడు!

హయగ్రీవ స్వామి అయినా, శారదాంబ అయినా ఇదే చెప్తున్నారు! ఒకే బ్రహ్మము మూడు గురురూపాలు ధరించింది! ఎవరికీ ఏది ప్రీతో దాన్ని ఉపాసిస్తూ మిగిలినవి కూడా ఆ రూపాలే అని గ్రహించాలి!

మొత్తానికి శుకాదులకు కూడా బ్రహ్మజ్ఞానం బోధించిన దక్షిణామూర్తి శ్రీకాళహస్తీశ్వరుడు అని తెలుసుకోవాలి!

దక్షిణామూర్తి స్తవం లోని శ్లోకం

**ఉపాసతేయం మునయ శుకాద్యా:**

**నిరాశిషో నిర్మమతాధివాసా:**

**తం దక్షిణామూర్తిం తనుం మహేశం**

**ఉపాసహే మోహమహార్తి శాంత్యై**

ఉపాసన ఎలా ఉండాలో చెప్తున్నారు ఈ శ్లోకంలో - ఎటువంటి ఆశలు లేనివారు అయి, మమత్వములు (రాగం, ద్వేషం) లేనివారైనవారు శుకుడు మొదలైన మునులు. అటువంటివారు ఏ మహేశ్వరుని స్వరూపమైన దక్షిణామూర్తిని ఉపాసించి ధన్యులు అయ్యారో అటువంటి స్వామిని మేము ఉపాసిస్తున్నాము! అంటున్నారు! ఎందుకు? మోహమనే మహా ఆర్తిని తొలగించుకోవడానికి!

మోహం మహాభయంకరం -> సత్యాన్ని తెలియనివ్వదు -> అసత్యాన్ని సత్యం అనుకునేలా చేస్తుంది -> అహంకార, మమకారాలు -> చచ్చుచు పుట్టుచు చర్విత చర్వణులై

# అధిష్ఠాన బ్రహ్మము మాత్రమే సత్యము అని తెలుసుకోవాలి! బ్రహ్మము ఎటువంటి సత్యమో, జగత్తు కూడా అటువంటి సత్యము అయితే ఇక బ్రహ్మము కోసం ప్రయత్నం ఎందుకు? మిథ్యా రూపమైన జగత్తు సుఖ దుఃఖాది భ్రాంతులతో మనల్ని తిప్పుతూ ఉంటుంది! అదే మోహము!

**మోహము అనే ఆర్తి ఎలా పోతుంది?** కబుర్లతో కాలక్షేపం చేస్తే లాభం లేదు! కేవలం ఆ బ్రహ్మాన్నే లక్ష్యంగా తీస్కుని, ఆశాదులు విడిచిపెట్టి, మమత్వాలు తొలగించుకుని, ఏ పరమాత్మని ఉపాసిస్తే మోహమహార్తి తొలగుతుందో ఆ పరమాత్మ అయిన దక్షిణామూర్తిని ఉపాసించడం!

శుకాదులకు తెలియదని కాదు లోక సంగ్రహార్ధము పరమేశ్వరుని ద్వారా అందరికీ తెలియచేసారు అని అన్వయించుకోవాలి!

**దక్షిణామూర్తి తత్త్వం – చిన్ముద్ర**

చిన్ముద్రలో జీవ బ్రహ్మ ఏకవిత్వాన్నే తెలుసుకున్నాము! మూడింటికీ ఏది అధిష్ఠానమో దానితో ఐక్యం కావాలి!

**కాశీవిశ్వనాథుడు దక్షిణామూర్తియే**

దక్షిణామూర్తి క్షేత్రములు ఎన్నో ఉన్నాయి! శివక్షేత్రములు ఎన్నో ఉన్నాయి పుణ్య భారత భూమిలో! ప్రధానంగా గుర్తొచ్చేది అవిముక్త మహాక్షేత్రము! విశ్వనాథుడు దక్షిణామూర్తియా? అంటే అవును అనే చెప్పాలి! సుమారు 17 ఏళ్ల క్రితం పూజ్య గురువులు కాశీక్షేత్రంలో ప్రవచిస్తున్న రోజుల్లో ఒక యతి వచ్చి మాట్లాడుతూ ఒక మాట అన్నారు, విశ్వనాథ దర్శనం చేసారు కదా, నందీశ్వరుడు ఎటు ఉంటాడు అని అడిగారట, నందీశ్వరుడు ఉత్తరము వైపు ఉన్నాడు అంటే, అయితే విశ్వనాథుడు దక్షిణాభిముఖుడే కదా అంటే దక్షిణామూర్తియే కదా అని చెప్పి ఆ యతీశ్వరుడు వెళ్లిపోయారట, పరమేశ్వరుడే తెలియచేసాడు ఈ విధంగా!

కాశీక్షేత్రం తత్త్వ క్షేత్రం! జ్ఞానం ఇస్తుంది! బ్రహ్మ విద్యని ఇస్తుంది! అంటే వేరేవి ఇవ్వదని కాదు! అన్నీ ఇస్తుంది కానీ నది ప్రవహించే చోటు ఇక చలమలు ఎందుకు? బ్రహ్మవిద్య అనే నది ప్రవహిస్తున్నప్పుడు చలమలు అందులోనే ఉంటాయి!

కాశీవిశ్వనాథుడు జ్ఞానప్రదాత! మరి మోక్షం ఇస్తాడు కదా తారక మంత్రం ఉపదేశించి! తారక మంత్రం అంటేనే మోక్షం ఇచ్చేది! ఆయన చెవిలో ఏమి ఉపదేశిస్తాడో మనం ఎలా చెప్పగలం! మొత్తానికి ముక్తికి యోగ్యుడయిన వాడికి ముక్త్యుపాయాన్ని బోధించి వెంటనే ముక్తిని ఇవ్వగలిగే శివుడు దక్షిణామూర్తి కాక మరేమవుతాడు! అందుకే ఆయన రుద్రుడు! "కలయే కంచనరుద్రం" అన్నారు కదా! "రుద్ర" అంటే ప్రధాన అర్థము "ప్రణత దుఃఖ ద్రావక:" అనగా అత్యంతిక దుఃఖాన్ని నాశనం చేస్తాడు! అని! ఇంకా చాలా చాలా అర్థాలు ఉన్నాయి, అవన్నీ దక్షిణామూర్తికే వర్తిస్తాయి!

అసలు దుఃఖం సంసారమే! అదే భవరోగం! దాన్ని నాశనం చేస్తాడు స్వామి! సంసారం వైద్యుడు ఆయన! సంసారాన్ని పోగొట్టి ముక్తిని ఇస్తాడు కనుక ముక్తిని ఇచ్చే విశ్వనాథుని దక్షిణామూర్తిగానే చెప్పాలి!

కాశీక్షేత్రం తత్త్వక్షేత్రం! గంగ ఎక్కడైనా గొప్పదే కానీ కాశీక్షేత్రంలో ప్రవహించే గంగని నిత్యం పానం చేస్తూ శివారాధన చేస్తే గంగ ఇచ్చేది తత్త్వజ్ఞానం! అందుచేత కాశీవిశ్వనాథుడు దక్షిణామూర్తియే!

**అళంగుడి**

తమిళనాడులో కుంభకోణం సమీపంలో గ్రహాలయాల్లో అళంగుడి అని ఉన్నది! గురువు రకరకాల రాశుల్లో సంక్రమణం చేసేటప్పుడు విశేష పూజలు చేస్తారు. అక్కడ గురుగ్రహ రూపంలో ఉన్న ఆ క్షేత్రంలో ప్రధాన దైవం దక్షిణామూర్తి! ఆయన్ని సేవిస్తే, ఆరాధిస్తే గురుగ్రహ జనిత సర్వదోషములూ పోతాయి! గురువు అంటే బుద్ధికి అధిదేవత కదా, జ్ఞానం ఆయన స్వరూపం, ఆ జ్ఞానానికి ప్రతిబంధకాలు పోగొట్టుకోవాలి అంటే గురువులకే గురువైన దక్షిణామూర్తిని పూజిస్తే గురువుల్లో ఒకడైన దేవాచార్యుడైన బృహస్పతి అనబడే గ్రహము యొక్క అనుకూలత మనకి లభిస్తుంది!

**శ్రీకాంత ద్రుహిణోపమన్యుస్కందేంద్రనంద్యాదయః**
**ప్రాచీనాగురవోపి యస్య కరుణాలేశాద్గతా గౌరవం**
**తం సర్వాదిగురం మనోజ్ఞ వపుషం మందస్మితాలంకృతం**
**చిన్ముద్రాంచిత ముగ్ధపాణి నళినమ్ చిత్తే శివం కుర్మహే**

బ్రహ్మవిష్ణురుద్రఇంద్రాదులంతా ఏ జగద్గురువు అనుగ్రహం చేత గురుత్వం పొందారో, ఆ ఆదిగురువుని, మనోహర రూపాన్ని ధరించి ఉంటూ, మందస్మితంతో ఉంటూ, చిన్ముద్ర పట్టుకుని ఉన్నారు అటువంటి ఆ స్వామి ఆయన!

ద్రవిడ దేశంలో ఏ శివాలయాన్ని దర్శించినా దక్షిణామూర్తి కనపడతారు! అక్కడ అందరూ దక్షిణామూర్తిని పూజిస్తారు! గురువారం విశేషంగా స్వామిని పూజిస్తారు!

పిల్లలకి బుద్ధిశక్తిని ఇస్తాడు స్వామి! "శివాయగురవేనమః" మహామంత్రం! భక్తికి నామమే మహామంత్రం! అన్నిటికంటే దక్షిణామూర్తి గొప్ప మంత్రం "శివాయగురవేనమః"! పరమేశ్వరుడు

శుభముతో మన బుద్ధిని సంయోజనం చేయుగాక అనేదే గాయత్రీమంత్ర పరమార్థం! సత్ తో బుద్ధి కలిస్తే సద్బుద్ధి, అలా కలపగలిగేవాడు గురువే! అందుకు ఆయన్ని ఆశ్రయిస్తే ఏ విద్యా అయినా ఆయనే ఇస్తాడు!

అంత దక్షిణామూర్తిని ఆరాధిస్తే మోక్షం ఇస్తాడా ఇప్పటినించీ ఎందుకండీ అని కొందరు అంటారు! స్వామివారు ఏ దుఃఖాన్ని అయినా పోగొడతాడు, ఏ విద్యని అయినా ఇస్తాడు! అందుకు ఈశ్వరుని ఆశ్రయించడం పిల్లలకి నేర్పాలి!

**సనాతన ధర్మం పిల్లలకి నేర్పడం ఎలా?** అని కొందరు అడుగుతూ ఉంటారు!

ఈశ్వరుని ఆశ్రయించడం పిల్లలకి నేర్పాలి! ఇలాంటి సాధనలు ముందర మనం చేస్తే పిల్లలు చేస్తారు!

గురవే సర్వలోకానాం
భిషజే భవరోగిణామ్
నిధయే సర్వవిద్యానాం
దక్షిణామూర్తయే నమః

ఇది కూడా ప్రతీవారు అనుకోవలసినది!

సర్వలోకాలకు గురువైనవాడు, సంసారంలో రోగాలు, సంసారమనే రోగం రెండిటికి వైద్యుడు, సర్వ విద్యలకు నిధి అటువంటి దక్షిణామూర్తికి నమస్కారము!

**దక్షిణామూర్తి - వేదప్రమాణం**

విద్యలు: అపరావిద్యలు, పరావిద్యలు; రెండిటికీ గురువు ఆయనే! నువ్వు దేనికి అర్హుడవో దాన్నిబట్టి ఇస్తాడు!

లౌకిక ప్రయోజనాలు ఇస్తూనే, దయతో చిత్తాన్ని సంస్కరింపచేసి, వైరాగ్యాన్ని కలిగించి, వివేకాన్ని కలిగించి, బ్రహ్మవిద్య కావాలనే ఆకలి పుట్టించి, బ్రహ్మవిద్యని వడ్డిస్తాడు భగవానుడు!

ఎలాగోలా చిన్నతనం నుండి దక్షిణామూర్తిని ఆశ్రయిస్తే ఇహంలో ఎంతో అభ్యున్నతిని కలిగించడమే కాకుండా కైవల్య సిద్ధిని ప్రసాదిస్తాడు! ఇహానికి, పరానికి, పరమార్థానికి ఒకడే గురువు, ఆయనే దక్షిణామూర్తి!

# "ఈశాన సర్వ విద్యానాం" మంత్రం మొత్తం దక్షిణామూర్తి దర్శనం!

# సర్వ విద్యలకు ఈశానుడు,

# సర్వ భూతములకు (బ్రహ్మ మొదలు పిపీలికం వరకు) ఈశ్వరుడు,

# దేనికి ప్రభువు? బ్రహ్మాధిపతి (చతుర్ముఖ బ్రహ్మకి) , బ్రహ్మణోధిపతిః (వేదములకు, ధర్మములకు, కర్మలకు ఆయనే ప్రభువు), బ్రహ్మమే ఆయన! సర్వ వ్యాపకుడు, సర్వోత్కృష్టుడు! కావున బ్రహ్మ!

# సదాశివః - ఆయన ఎప్పుడూ శివమే ఇస్తాడు! సూర్యుడు ఎప్పుడూ వెలుగునే ఇస్తాడు, పంచదార ఎప్పుడూ తీపిని ఇస్తుంది, మా శివుడు ఎప్పుడూ శివాన్నే ఇస్తాడు!

సదాశివః = సద్రూప శివుడు; శాశ్వతమైన సద్రూపుడు, గుణాతీత తత్త్వం! ఎప్పుడూ ఆయన గుణాతీతుడుగానే ప్రకాశిస్తూ ఉన్నాడు!

# ఆ సదాశివుడే ప్రణవ వాచ్యుడు, ఆ ఓంకార స్వరూపుడే దక్షిణామూర్తి!

అటువంటి దక్షిణామూర్తి నాకు శుభము కలిగించు గాక!

**అరుణాచలం**

అరుణాచలం అంటేనే రమణుల వారు గుర్తొస్తారు! రమణుల చరిత్రలో, అరుణాచల మాహాత్మ్యంలో కూడా అరుణాచలానికి దక్షిణామూర్తికి ఉన్న అనుబంధం గోచరిస్తూ ఉంటుంది!

అరుణాచలేశ్వరుడు ఎవరు అంటే మొట్టమొదట పరమేశ్వరుడు అగ్నిలింగంగా ఆవిర్భవించినప్పుడు, హరిబ్రహ్మలకు సాక్షాత్కరించి, అటుపై దేవతలచే ఋషులచే పూజింపబడ్డాడు! ఆ తర్వాత అందరిని అనుగ్రహించి ఆ సర్వవ్యాపక మహాలింగం ఒక్క లింగంగా ఏ క్షేత్రంలో నిలించిందో ఆ క్షేత్రం అరుణాచలం! అరుణం అంటే అగ్ని, ప్రధమాగ్నిగా గోచరించాడు కదా స్వామి!

అరుణాచలంలో ప్రధానంగా మూడురూపాలతో ఉంటాడు స్వామి!

1) పర్వతమే శివరూపంతో ఉన్నది! అరుణాచలానికి ఈశ్వరుడే కాదు, అరుణాచలమే ఈశ్వరుడు

2) స్వామివారి అగ్నిలింగం

మొదటి రెండు నిష్కల రూపములు, గోచరిస్తూ ఉన్నాయి.

3) చూడలేని ఒక రూపం అరుణగిరిపై ఉన్నాడని స్కాందపురాణం చెప్తున్నది! ఇది సకల రూపము! అదే దక్షిణామూర్తి రూపం.

అరుణగిరి దక్షిణామూర్తి రూపమే! జ్ఞానాన్ని అనుగ్రహించాడు కదా అగ్ని లింగం ఆవిర్భావంతో! అందుచేత దక్షిణామూర్తి!

ఆ క్షేత్రాన్ని ఆశ్రయించే "సోహం" అనే భావం అనుభవానికి తెచ్చుకుని ఆ కాంతిని ప్రపంచమంతా ప్రసరించారు రమణులవారు!

మనకి తెలిసిన యోగి ఒక్కరైనా, తెలియని ఎందరో యోగులు అరుణాచలాన్ని ఆశ్రయించుకుని ఉన్నారు!

రమణుల వారిని శిష్యులు అడిగారట, మీరు ఎప్పుడైనా దక్షిణామూర్తిని చూసారా అని! నేను ప్రయత్నం చేసానయ్యా కానీ ఆయన అనుగ్రహం లేనిదే చూడగలమా! ఒకమారు శాస్త్రం చెప్పినట్లు సంచరిస్తూ ఉండగా ఒక పెద్ద మర్రిఆకు కనపడింది , చాలా పెద్దఆకు , అలౌకికమైనది! స్వామి అక్కడ మర్రిచెట్టు కింద ఉన్నాడు అని సంకేతం చూపించాడు! అని అన్నారు! అటు తర్వాత శిష్యులు వారు వెళ్లి ప్రయత్నించడం, దారి తప్పడం, రమణుల వారు తిరిగి వారందరికీ దారి చూపి వెనక్కి తీసుకొచ్చారు!

ప్రతీ శివక్షేత్రంలో దక్షిణామూర్తి రూపం కూడా ఉంటుంది! స్వామికి పంచవింశతి మూర్తులు ఉపాసనతో చెప్పబడుతున్నాయి! ఏ మూర్తి లేని వాడు కనుక లింగరూపుడు, ఏ రూపమైనా ధరిస్తాడు కనుక బహుమూర్తుల ఉపాసన చెప్పబడుతుంది! పంచవింశతి అని చెప్పగలమా? ఎన్నో మూర్తులు! ఇరవై అయిదు మూర్తులలో ముఖ్యమైనవి మూడు చెప్పబడ్డాయి 1) దక్షిణామూర్తి 2) నటరాజమూర్తి 3) సోమాస్కందమూర్తి

ఈ మూడు మూర్తుల ఉపాసన ముక్తికి దగ్గర చేస్తుంది! మిగిలినవి ఇవ్వవు అని కాదు! క్రమసః ఇస్తాయి! కానీ ఈ మూడు కైవల్యానికి దగ్గర దారులు! శివతత్త్వము యొక్క సంపూర్ణ ప్రభావం ఈ మూడు మూర్తుల్లో గోచరిస్తుంది.

తెలుగునాట శ్రీశైల క్షేత్రంలో చూస్తే ప్రదక్షిణ క్రమంలో దక్షిణాభిముఖంగా ఉన్న దక్షిణామూర్తి దర్శనం ఇస్తాడు! అక్కడ ఎందరినో స్వామి దక్షిణామూర్తిగా అనుగ్రహించారు! శ్రీశైలము ముక్తి క్షేత్రము కూడా కదా! అందుచేత దక్షిణామూర్తి క్షేత్రంగానే భావన చేయాలి.

**కోటప్పకొండ**

ఇది దక్షిణామూర్తి క్షేత్రం! త్రికూటాద్రియే కోటప్ప కొండ అయినది. అలాగే త్రికోటి అని కూడా ఉన్నది! మూడు శిఖరాలు ఉన్న పర్వత శ్రేణి! బ్రహ్మకూటం, విష్ణుకూటం, రుద్రకూటం! మూడింటి మీద శివలింగాలు ఉన్నాయి! శివుడు మూడు రూపములతో కూడా ప్రకాశిస్తూ ఉన్నాడు!

ఇక్కడ అమ్మవారి గుడి ఉండదుట! వామము కాకుండా దక్షిణమే ఉందిట! అక్కడ శివకల్యాణదులు జరపరు!

అనేకమంది సిద్ధపురుషులు ఇక్కడ తపస్సు చేసి దక్షిణామూర్తి కృపని పొందినట్లుగా చెప్పబడుతున్నది.

దక్షిణ = కుడి/శివుడు ; వామము = ఎడమ/శక్తి

వామభాగం స్వామిలో అంతర్లీనం అయి ఆయన మాత్రమే ఉంటే దక్షిణామూర్తి అనాలి, శివుడు మాత్రమే కనపడుతున్నట్లు!

**దక్షయజ్ఞం (పోతనగారు చూపించిన దక్షిణామూర్తి)**

శాస్త్ర విరుద్ధ యజ్ఞం జరగడం - వీరభద్రుడు వచ్చి దక్షుడిని సంహరించడం - బ్రహ్మాదిదేవతలు పరమేశ్వరుని ప్రార్థించడానికి కైలాసం చేరుకోవడం - దక్షిణామూర్తిని దర్శనం చేస్కోవడం.

కైలాసవర్ణన అంతా చెప్పబడింది మూలంలో!

శివుని శాంతింప చేయడానికి బ్రహ్మాది దేవతలు వెళ్ళేటప్పటికి ప్రశాంతంగా కూర్చున్నాడుట! కోపము ఆయన స్వభావం కాదు! ఆయన స్వభావం శాంతము!

మఱ్ఱిచెట్టు మొదట్లో కూర్చున్నాడు స్వామి! ఆ మఱ్ఱిచెట్టు ఎటువంటిది అంటే, మునీంద్రులు అందరూ ఏ పరమతత్త్వాన్ని చేరి శాంతిని పొందుతారో అది వటవృక్షం! సంసారం అనే ప్రయాణంలో అలిసిపోయినవారికి నీడనిచ్చే చెట్టు. ఆ చెట్టు మూలంలో ఆయనే, ఆ చెట్టే ఆయన!

మఱ్ఱిచెట్టు శివస్వరూపం, అంటే జ్ఞానస్వరూపం! జ్ఞానం వివిధ మార్గములలో కదా అందుతున్నది! ఆ మార్గములు శాఖలు ఊడలై, జటలై దిగితే వాటన్నిటితో విస్తరించిన జ్ఞానవృక్షం మఱ్ఱిచెట్టు!

వేదాంతము, సాంఖ్య (గీత రెండవ అధ్యాయంలో చెప్పబడిన బ్రహ్మవిద్య), యోగములు మొదలైన బ్రహ్మవిద్యా రూపములైన జ్ఞానశాఖలు ఏవైతే ఉన్నాయో అవే దిగిన పెద్ద జ్ఞానవృక్షం! జ్ఞానాన్ని ఆశ్రయిస్తేనే శాంతి మరో మార్గము లేదు! ఆ వృక్షము పురాతన వటము, అదే హరుడు!

"అతి పురాతన వటము ఆదిశివ వటము" అంటారు గురుదేవులు!

ఆ శంకర రూపమైన వటవృక్షము ఎంత ఉన్నది అంటే పొడవు శతయోజనములు ఉన్నది, 75 యోజనాల విస్తారము కలిగిన మహావటవృక్షము. మాణిక్యముల వంటి చక్కని ఎర్రని ఫలాలు ఉన్నాయి! అది మోక్షకాములకు ఆశ్రయము, సంసారం తాప నివారకం! గూడులు లేవుట ఆ చెట్టు మీద! అంటే సంసార రూపమైన వాటిని పెంచదు! సంసారం నుండి నివర్తం చేస్తుంది.

వటవృక్షం చూడగానే శివస్మరణ చేసుకోవాలి!

#వృక్షములలో దేవతాశక్తి దేనికి ఉన్నదో పోల్చగలిగిన మహర్షులు ఆ యా దేవతా వృక్షాలని సేవించండి అని చెప్పారు! తద్వారా ఆ దేవతా విభూతి ఆ వృక్షమునందు కనపడుతుంది! ఈశ్వరుని సాక్షాత్ స్వరూపం చర్మచక్షువులతో, ఇంద్రియాలతో చూడలేము! అందుచేత ఈశ్వర విభూతి ఉన్న వాటిని పూజించాలి!

#సూర్యుడిని దేవుడిగా కొలుస్తాము కాబట్టే హిందువులు గొప్పవారు! దేవుడు అంటేనే ప్రకాశస్వరూపుడు, సూర్యుడిని దేవుడిగా కొలవకపోతే ఎందుకు!

మఱ్ఱిచెట్టు నీడలో కూర్చున్న శివుడిని చూశారట బ్రహ్మాదులు! ఆయన చుట్టూ శాంతమే తమ స్వభావంగా కలిగిన సనందాదులు కూర్చున్నారు! వారి నడుమ ఆ చెట్టు కింద ఆయన కూర్చున్నాడు! కుబేరుడు మొదలైన వారు కూడా కొలుచుకుంటూ ఉన్నారు!

ఆ కూర్చున్న స్వామి ఎవరు అంటే,

విద్యా = ఉపాసన లేదా బ్రహ్మవిద్య; తపస్సు, యోగము, ఈ పథానికి ఆయన అధీశ్వరుడు! ఆ మార్గము ఎలా ఉంటుందో చెప్పడం కోసం ఆ మార్గాలు ఏర్పరిచినవాడే ఆ మార్గాన్నే చూపిస్తూ కూర్చున్నాడు! ఆయనకు తపస్సు ఎందుకు? మనకి చూపడం కోసం! పిల్లలకి నడక నేర్పుతున్న తండ్రిలా! ఆ మార్గముల ద్వారా పొందవలసిన మోక్షమునకు గమ్యము ఆయనే! శివుని చరిత్ర అంతా కూడా యోగమార్గంలో చరించడమే! ఆయన ఎప్పుడూ విశ్వానికి క్షేమంకరుడే! ఎల్లవేళలా కరుణారూపమైన వాత్సల్యం చూపిస్తూ లోకానికి మంగళం కలిగించే శాంత రూపం ఆయనది!

అటువంటి స్వామిని చూసి బ్రహ్మాది దేవతలకు ఉద్విఘ్నత పోయింది ముందర!

తాపసులకు అభీష్టమైన చిహ్నములు ధరించాడు స్వామి! జటలు కెంపు రంగుతో భాసిస్తూ సంధ్యాకాశంలా ఉన్నది, చంద్రలేఖను ధరించాడు!  ఉన్నతశిలపై దర్భలు పరచిన ఆసనంపై ఆ సనాతనమైన బ్రహ్మము ఆసీనుడై ఉన్నాడు!

కూర్చున్న తీరు ఎలా ఉందంటే కుడితొడపై ఎడమపాదాన్ని ఉంచి మోకాలిపై చేతిని ఉంచాడు (తర్కముద్ర), ఒక చేత్తో అక్షమాల పట్టుకున్నాడు. నిర్వికార శాంతమూర్తి ఆయన! నిర్మోహజ్ఞానస్థితి ఆయనది! ఆయన్ని ధ్యానిస్తే అది లభిస్తుంది.

ఆదిముని, ఆదిగురువు అయిన ఆ పరమేశ్వరుని చూసి బ్రహ్మాది దేవతలు నమస్కరిస్తున్నారు! ఆయన ఎలా ఉన్నాడు అంటే బ్రహ్మానందంలో మగ్నుడై ఉన్నాడు (లౌకిక స్పృహ లేకుండా)! ఆయన ఎవరు? గిరిశుడు వాక్కులకు అధిపతి అని అర్థము! యోగపట్టములో కూర్చున్నాడు!

**దక్షిణామూర్తిని ఎలా ధ్యానించాలి?**

దివ్య నామరూపాలు ఎప్పుడూ ముక్తిదాయకములు! వాటి అర్థవిచారణ, తత్త్వవిచారణ చేస్తే, నామరూపాతీత తత్త్వములోకి ప్రవేశిస్తాము! దివ్య నామ, రూపములను ఉపాసించడం చేత నామరూపాతీత శివతత్త్వం లోకి ప్రవేశించగలుగుతాము! అందుకోసమే స్వామి వాటిని ధరించాడు! దక్షిణామూర్తి స్వరూపాలు కూడా ఎన్నో ఉన్నాయి! ఇప్పుడు చెప్తున్నది దక్షయజ్ఞము తర్వాత బ్రహ్మాదిదేవతలు దర్శించినది! దక్షిణామూర్తి అనేకమార్లు వ్యక్తమయ్యారు!

ప్రవచనం వింటున్నా, పుస్తకం చదువుతున్నా మూర్తి ఒక్కసారి మెదిలినా కూడా మన అంతఃకరణంలో, సంస్కారం కనపడుతూ ఉంటుంది!

**శారదాతిలకతంత్రంలో దక్షిణామూర్తిని ఎలా ఉపాసించాలో చెప్పారు!**

మంత్రము, మూర్తి రెండూ అవసరమే!

మూర్తిపై దృఢమైన భక్తి కలిగి ఉండాలి, ఆ మంత్రం/నామముపై ప్రీతి కలిగి ఉండాలి.

రమ్యమైన వటవృక్షం, చుట్టూ అనేక వృక్షాలు, వాటికీ రకరకాల లతికలు అల్లుకుని ఉన్నాయి, మంచి మంచి కుసుమాలు, పక్షుల కిలకిలలు, తుమ్మెదల ఝుంకారాలు అత్యంత ప్రశాంతంగా ఉన్నది! మాత్సర్యాది వికారాలు ఏమీ లేని చోటు!

మరొక ఆగమంలో కడిమి చెట్ల అరణ్యం, ఆ మధ్యంలో వటవృక్షం, దాని నీడలో దక్షిణామూర్తిని ధ్యానించాలి విష్ణువు లక్ష్మీదేవికి చెప్పినట్లు వర్ణించారు!


దక్షిణామూర్తిని ఆశ్రయించుకుని ఉన్నవారు బ్రహ్మవేత్తలు! అంతేకాదు అన్నిరకాల ఫలాలు ఇచ్చేవాడు కనుక ఇంద్రాదులు కూడా వస్తూ ఉంటారు!

వటవృక్షం ఎలా ఉన్నది? పద్మరాగముల వంటి ఫలములతో, గరుడపచ్చ రత్నాల వంటి ఆకులతో ఉన్నది!

స్వామి అక్కడ ఉన్నాడు కదా, రత్నముల జాలర్లు, పుష్పాల మాలికలు అలంకరింపబడి ఉన్నాయి! ఆ వృక్షం ఎటువంటిది అంటే, సంసారతాపము పోగొట్టి, కుశలం అంటే మోక్షము అనే నీడని ఇస్తున్నది! అటువంటి చెట్టుని ధ్యానం చేయాలి! అటువంటి వటవృక్ష మూలంలో రత్నసింహాసనం ధ్యానించాలి! దానిపై ఆసీనుడై ఉన్నాడు స్వామి. మోక్షజ్ఞానం కోరుకునే మునులు స్తుతిస్తూ ఉండగా, ఆ రమ్యమైన మఱ్ఱిచెట్టు నీడలో అద్భుత రత్నసింహాసనంపై, దివ్యములైన అలంకారములతో, శరత్ చంద్రుని వంటి చక్కని వదనంతో జగత్తుకి ఆది అయినటువంటి పరమేశ్వరుడు దక్షిణామూర్తిరూపంలో ప్రకాశిస్తూ ఉన్నాడు!

దివ్య అమృత కలశం ఒక చేత్తో, ఒక చేత్తో అక్షమాల, క్రింద రెండూ చేతుల్లో చిన్ముద్ర, పుస్తకం పట్టుకుని వీరాసనంపై కూర్చుని తెల్లని శరీర కాంతితో జటాజూటమునందు చంద్రలేఖ ప్రకాశిస్తూ ఉండగా, ఆ గంగాధరుడైన స్వామి త్రినేత్రాలతో నీలకంఠుడై, చిరునవ్వు నవ్వుతు, కుడిపాదాన్ని ఒక అసురుడిని తొక్కిపెట్టి, ఎడమపాదాన్ని కుడితొడపై పెట్టుకుని ఆ దివ్య ఆసనంపై దర్శనం ఇచ్చాడు!

## సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు



# శ్రీదక్షిణామూర్తి మూడవ రోజు (6/14/2021)

శివాయగురవేనమః శ్రీమాత్రేనమః శ్రీవిష్ణురూపాయ నమఃశివాయ

శ్రీకాళహస్తీశ్వరాయ నమఃశివాయ

శ్రీదక్షిణామూర్తయే నమఃశివాయ

**ఉపాసకానాం యదుపాసనీయం**

**ఉపాత్తవాసం వటశాఖిమూలే**

**తద్ధామ దాక్షిణ్యజుషాస్వమూర్త్యా**

**జాగర్తిచిత్తే మమ బోధరూపం**

**నిన్నటి స్మరణ:** భాగవత ఆధారంగా పోతనగారి తెలుగు పలుకుల్లో దక్షిణామూర్తిని దర్శించుకున్నాము! బ్రహ్మాదిదేవతలు దర్శించిన మూర్తి, బ్రహ్మవేత్తలతో కూర్చున్న పరమశాంత స్వరూపుడైన స్వామి!

**బ్రహ్మాదిదేవతలు చేస్తున్న స్తుతి**

నువ్వు సాక్షాత్తు ఈశ్వరుడివి, విశ్వానికి ఈశ్వరుడివి! జగత్కారణమైనవాడవు, జగత్తుకి బీజరూపుడవు! ఇది శివలింగ తత్త్వము చెప్పే వాక్యం! జగత్తు ప్రకటింపబడకముందర స్వామిలో బీజరూపంలో ఉంటుంది! వృక్షం విత్తనంలో ఉన్నట్లు! బీజము అంటే మూలము అనే అర్థము తీసుకోవాలి!

ప్రకృతి పురుషులకు అతీతమైన స్వరూపుడవు, అటువంటి బ్రహ్మతత్త్వమువు, దానికి అంతరం లేదు! పరిపూర్ణ తత్త్వము! అటువంటి ఆ తత్త్వమే శివశక్త్యాత్మకమైన రూపం స్వీకరిస్తున్నావు! అలా వ్యక్తమై ఏమి చేస్తున్నావు అంటే ఈ జగత్తుని సృజించి, స్థితి చేసి, తిరిగి లయం చేస్కుంటున్నావు, సాలీడు ఉపమానం. ఎక్కడ నుండో వచ్చే వస్తు సముదాయంతో సృష్టి చేయడంలేదు అనడానికి సంకేతముగా ఊర్ణనాభి ఉపమానం చెప్తారు!

అటుపై స్వామి ప్రసన్నం అయి, దక్షయజ్ఞం పూర్తి చేసి, దక్షుడిని అనుగ్రహించారు!

**స్కాందపురాణంలోని వృత్తాంతం**

ఒకప్పుడు సనక సనందాదులు బ్రహ్మ విద్యను గురించి చర్చిస్తూ వెళుతున్నారు, అలా వెళుతూ ముందర స్వర్గలోకానికి వెళ్ళాడు, అటు నుండి త్రిమూర్తుల వద్దకు వెళ్లారు! ముందర బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళేటప్పటికి వాణీ వినోద లోలుడైన బ్రహ్మదేవుడు

బ్రహ్మవిద్య ఏమి చెప్తారులే అని వెళ్లిపోయారు, తర్వాత విష్ణువు వద్దకు వెళ్లారు ఆయనకి లక్ష్మీదేవి పాదాలు వత్తడం చూసి అక్కడ నుండి కూడా వెళ్లిపోయారు. కైలాసం వెళ్లారు, ప్రదోష కాలం, అమ్మవారి లాస్యం చూసి పరవశం చెంది స్వామి నాట్యం చేస్తున్నారు! ఆ నాట్యంలో ఒక్కసారి అమ్మవారు స్వామిలో మెరిసిందిట! ఈయన పరమ భోగి కనుక నివృత్తి మార్గ సంబంధమైన జ్ఞానం ఎలా చెప్తారు అనుకున్నారట! ఇంతటి వారు అలా అనుకున్నారేమిటి? అంటే మబ్బులా మాయాశక్తి కమ్ముకున్నది, ఇటువంటి వారికి వెంటనే తొలగిస్తాడు పరమాత్మ!

వారు అక్కడ నుండి వచ్చేస్తూ ఉండగా అద్భుత వటవృక్షం కనపడింది! అనేక జ్ఞాన శాఖలతో ఉన్న మహావటవృక్షం! అక్కడ ఒక యువకుడు, చుట్టూ బ్రహ్మవేత్తలు! ఇది చూసి వెళ్లారు ఈయన బ్రహ్మవిద్య చెప్తాడు అనుకుని! అక్కడికి వెళ్లి చూస్తే ఆయనేమి చెప్పడంలేదుట, చిరునవ్వు నవ్వుతు చిన్ముద్ర పట్టుకుని చూస్తున్నారు, దానివల్లనే వారందరికీ సంశయాలు ఛేధింపబడి ఆనందం వ్యక్తం చేస్తున్నారట!

**చిత్రం వట తరోర్మూలే వృద్ధా శిష్యా గురోర్యువా**

**గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయా:**

బ్రహ్మము తప్ప మరొకటి పట్టని వారు చుట్టూ కూర్చుని ఉన్నారు! యువకుడేమో గురువు, శిష్యులేమో వృద్ధులు! మౌనంతోనే వ్యాఖ్యానం చేస్తున్నారు గురువు! చుట్టూ ఉన్నవారి సంశయాలన్నీ పటాపంచలు అయ్యాయి! ఆ వచ్చిన సనకసనందాదులకు కూడా ఛిన్న సంశయం జరిగింది!

సనకాదులకు ఏమి అర్థమైంది అంటే, బ్రహ్మ-సరస్వతులు, లక్ష్మి-నారాయణులు, ఉమా-మహేశ్వరులు కానీ ప్రవృత్తి మార్గంలో ఉన్నవారు కాదు, ఒకే ఈశ్వరుడు మూడు రూపాల్లో ఉన్నాడు, తనకి భిన్నం కాని శక్తితో క్రీడిస్తున్నాడు తప్ప, ప్రవృత్తి మార్గంలో ఉన్నవారు కాదు! బ్రహ్మము జ్ఞాన స్వరూపం అయితే, ఆ శక్తి ఆనంద స్వరూపిణి!

జ్ఞానానంద రూపమే పరమాత్మ! అలా మూడింటికీ ఉన్న ఏకత్వాన్ని చూపిన స్వరూపమే దక్షిణామూర్తి! "సనకాది సమారాధ్యా శివజ్ఞానస్వరూపిణి"

శివజ్ఞానం, విష్ణుజ్ఞానం అని వేరే వేరే ఉండవు! ఒకటే జ్ఞానం అది బ్రహ్మజ్ఞానం! త్రిమూర్త్యాత్మకము అయి ఉన్న ఏక స్వరూపం గోచరించి వారికి సంశయాలన్నీ పటాపంచలు అయ్యాయి!

రమణుల వారు ఈ కథను తరచూ చెప్తూ ఉండేవారట! సూరి నాగమ్మ గారు రమణులవారు చెప్తూ ఉండగా రచించారట!
నిన్నటి దక్షయజ్ఞం తర్వాత ఘట్టంలో కూడా సనకాదులచే సేవింపబడుతున్న స్వామిని దర్శించాము!

**దక్షిణామూర్తి రూపం శివునిదా అమ్మవారిదా?**
అక్కడ ప్రవృత్తిగా కనపడుతూ పార్వతీ దేవి సహితంగా ఉన్నాడు భోగి అనుకున్న సనకాదులకి ఇక్కడ దక్షిణామూర్తి దర్శనం ఇచ్చాడు! దక్షిణామూర్తికి అమ్మవారికి ఎటువంటి భేదము లేదు అని తెలుస్తున్నది! వ్యక్తీకరింప బడుతున్న శివుని స్వరూపంలో శక్తి తప్పకుండ ఉంటుంది! శివుడు ఏ రూపంలో ఉన్న శక్తిసహితుడే!

**అమ్మవారిని ఎందుకు దక్షిణామూర్తిరూపిణి అంటున్నారు?**
దక్షిణామూర్తి రూపంలో కుడిచెవికి మకరకుండలం, ఎడమచెవికి తాటంకము ఉన్నది! మకరకుండలం పురుషదేవతల కర్ణాభరణం, తాటంకము స్త్రీ దేవతల కర్ణాభరణము! దీని అర్థం ఏమిటి? దక్షిణామూర్తి ఒక్కడూ యోగిగా కనపడినా, అమ్మవారు కూడా ఉన్నారు! అందుకే దక్షిణామూర్తికి కూడా అర్ధనారీశ్వర స్వరూపంగానే వర్ణం

కనపడుతున్నది! మరి స్త్రీ రూపం కనపడడంలేదేంటి? అంటే ప్రతీసారి అలాగే ఉండాలని లేదు, అర్ధభాగం ఆ శక్తి ఉన్నది అని తెలుసుకోవాలి!

శ్రీవిద్యకే మరోపేరు దక్షిణామూర్తిరూపిణి! అది స్వతంత్రమైన తంత్రం! అన్నీ తంత్రాల లాంటిది కాదు!

అంతేకాక, స్వంతంత్రము అంటే ఇంకో అర్థము ఏమిటి అంటే స్వాత్మ అయిన పరమాత్మని పొందించగలిగేది! "స్వ" అంటే స్వాత్మ! అది తెలుసుకోవడానికి పనికి వచ్చే విద్య శ్రీవిద్య!

దక్షిణామూర్తి అంటే బ్రహ్మవిద్య అయినప్పుడు దక్షిణామూర్తి రూపిణి అయిన శ్రీవిద్య బ్రహ్మవిద్యయే!

బ్రహ్మము అంటే స్వస్వరూపమైన ఆత్మయే కదా! అందుచేత స్వాత్మ వస్తువు అయిన బ్రహ్మమును తెలియచేసేదే కనుక స్వతంత్ర! అన్నీ తంత్రాలకి నాయకురాలుగా ఉన్నది కనుక "సర్వతంత్రేశీ" అన్నారు!

ఎడమవైపు నుండి చూస్తే దక్షిణామూర్తి రూపం అమ్మవారిది, కుడివైపు నుండి చూస్తే అయ్యవారిది! దక్షిణామూర్తి ఉపాసన అంటేనే అమ్మతో ఉన్న శివుని ఉపాసిస్తున్నాం అని తెలుసుకోవాలి! "శివ"

అనే నామమే వారి ఉభయులది అయినప్పుడు ఇద్దరు శివులు ఉండరు, ఉన్నది ఒకటే శివం! స్త్రీరూపంలో చూస్తే శివా, పుంరూపంలో చూస్తే శివః! రెండూ కలిసిన రూపమే దక్షిణామూర్తిరూపిణి!

**మూర్తి - తత్త్వం**

మూర్తిని అర్థం చేసుకుంటే జ్ఞానం తెలుసుతుంది!

భగవన్నామరూపాలు జాగ్రత్తగా అధ్యయనం చేసి, నామాన్ని అర్థవిచారణ చేసి మూర్తిలోని తత్త్వాన్ని గమనిస్తే, నామరూపాలు నామరూపాతీత తత్త్వానికి తీస్కెళతాయి! సనకాదులు చేసిన పని అదే!
ఎలాంటి తత్త్వాన్ని ప్రకాశింపచేస్తున్నది ఆ మూర్తి అని తెలుసుకోవాలి!
అది చూసిన సనకాదులు అనుకున్నారు, ఓహో మేము అక్కడ పొరపాటు పడ్డాము! ఉభయతత్త్వంగా కనపడుతున్న ఏకతత్త్వము ఉన్నదో దానిసే వాణిహిరణ్యగర్భ, లక్ష్మీనారాయణ, పార్వతీపరమేశ్వరులు అంటారు అని తెలుసుకున్నారు, ఆ రెండూ కలిసిన శివశక్త్యాత్మక తత్త్వమే ఏకము, బ్రహ్మము, అది ఇవాళ దర్శించగలిగాము అనుకున్నారు!
సారాంశం: దక్షిణామూర్తి రూపం శివశక్త్యాత్మక రూపం!

శక్తికి రెండు భేదములు 1) అవిద్య -జగత్తుని ప్రకటించే మాయాశక్తి 2) విద్య - జ్ఞానాన్ని ప్రకటించే విద్య శక్తి. ఈ శక్తి పరమేశ్వరుడిదే! ఆయన నుండి అవిభాజ్యముగా ఉన్నది! పరమాత్మ యొక్క స్వాభావికీ శక్తి అది! ఎవరు భక్తితో ముక్తి కావాలని ఆశ్రయిస్తే విద్యారూపిణిగా అనుగ్రహిస్తుంది, పక్వత లేనివారికి ఆ తల్లి అవిద్యారూపిణిగా ఫలాలు ఇస్తూ క్రమంగా చిత్తశుద్ధిని ఇచ్చి విద్యారూపిణిగా కూడా అనుగ్రహిస్తుంది! విద్యావిద్యారూపిణి అయిన శక్తికి పరమేశ్వరుడు అధిష్ఠానంగా ఉన్నాడు కనుక, తాను ఆ శక్తితో అక్కడ సనకాదులకి గోచరించాడు!

**పురాణాల్లో దక్షిణామూర్తి ప్రకటన - మూర్తి తత్త్వ పరిశీలన**

మూర్తి ధ్యాన ప్రక్రియ అని ఒకటి ఉన్నది! మూర్తి ధ్యానం కుదుర్చుకోవడము చాలా గొప్ప అంశము! మూర్తి ధ్యానం కుదిరితే, ఆ నామం అన్నప్పుడు నామతత్త్వం మూర్తిలో ఎలా స్ఫూరిస్తుందో తెలుసుకోవచ్చు! సహజంగా నామం అనగానే రూపం

స్ఫూరిస్తుంటూ ఉంటుంది! నామానికి, రూపానికి ఉన్న అవిభాజ్య సంబంధం తెలుసుకుంటే నామరూప ఉభయతత్త్వాన్ని మననం చేసుకుంటే నామరూపాలు దాటి తత్త్వానికి వెళ్లగలము!

మోక్షప్రదాత దక్షిణామూర్తి అనే అంశము చాలా శాస్త్రాల్లో చెప్పారు! ప్రత్యేకించి సూతసంహితలో! ఈ సూతసంహిత అధ్యయనం చేయవలసిన విస్తార విషయం! అనేక క్షేత్ర వైభవాలు, ప్రతీ ఉపనిషత్తుకి ఒక అధ్యాయం చొప్పున సర్వ ఉపనిషత్తుల సారము ఉన్నది! ఆదిశంకరులు బ్రహ్మసూత్ర భాష్యానికి ముందర ఈ గ్రంథాన్ని 18 మార్లు చదివారట! అంత ఆస్వాదించారు ఆ గ్రంథంలోని మాధుర్యాన్ని! ఈ గ్రంథాన్ని అర్థం చేసుకుంటే ఉపనిషత్తుల సారము తెలుస్తుంది! పరమపురుషార్థం అయినటువంటి మోక్షం ప్రధానంగా చెప్పే ఈ గ్రంథంలో ముక్తిఖండంలో ఒక మాట అంటారు సూతమహర్షి మహర్షులతో, "అనేకులైన జీవులు దక్షిణామూర్తి అనుగ్రహం చేత మాత్రమే ఎటువంటి ఆయాసం లేకుండా సంసారం నుండి ముక్తిని పొందారయ్యా"! అనాయాస ముక్తిని ఇవ్వగలిగే శక్తి దక్షిణామూర్తి ధ్యానములో ఉన్నది!

దీనిగురించి రమ్యమైన విషయాన్నీ రెండు కథా భాగాలుగా చెప్తున్నది! సాక్షాత్తు పరమేశ్వరుడు తెలియచేసాడు! విష్ణువుతో చెప్తున్నాడు ఈశ్వరుడు ఒకప్పుడు ఏమి జరిగిందంటే అంటూ!
ముందుగా సరస్వతీ రూపావర్ణన చేసి, ఆవిడ సర్వవిద్యాలకూ నిలయమైన తల్లి, ఆవిడ స్వరూపం అంతా అకారాది క్షకారము వరకు తేజస్సు శక్తులతో కలిసిన రూపం! జ్ఞానముద్ర ధరించి, అక్షమాల

పట్టుకుని, కమండలం, పుస్తకం పట్టుకుని ఉన్నది! (శృంగేరి శారదాంబ)! తన అన్న అయినటువంటి శివుని వద్దకు వెళ్లి మాట్లాడుతూ ఉన్నది!
జీవులు ముక్తి పొందడానికి ఉపాయం ఏమిటి అని అడిగింది! ఈ అధ్యాయం ముక్త్యుపాయము అనే అధ్యాయం! దీనిలో రెండు భాగాలు 1) తత్త్వ ప్రతిపాదన: అసలు ముక్తి అంటే ఏమిటి చెప్తారు 2) ఉపాసన: ఇందులో ఉపాయాలు చెప్తారు!
దక్షిణామూర్తి గీత అనుకోవచ్చు ఇప్పుడు శివుడు సరస్వతీ దేవికి చెప్తున్న విషయాలు

**శివ - సరస్వతీ సంవాదం**

**ముక్తి అంటే ఏమిటి?**

ముక్తి అంటే అర్థం బ్రహ్మముతో తాదాత్మ్యం చెందడం! ప్రపంచంతో తాదాత్మ్యం వదిలి, పరమాత్మతో తాదాత్మ్యం పొంది, పరమాత్మయే సత్యం, ప్రపంచానికి ఉనికియే లేదు, ఉనికి పరమాత్మదే అనే అనుభవ స్థితి పేరే మోక్షం! అది లేనిదే శాంతి లేదు, ఆనందం లేదు! అంతవరకూ అంతా భ్రమణమే!

శివుడు చెప్తున్నారు (వేదప్రమాణంతో)
బంధింపబడినవారికి కదా ముక్తి కావాలి! తాడు అనగా పాశంతో బంధించబడినవారు పశువులు!
పాశము లేనివాడు ఈశ్వరుడు!
పాశాలు తగిలించి పశువులను నడిపేవాడు ఈశ్వరుడు!

**ముక్తికి ఉపాయం ఏమిటి?**

ఈశ్వరుడిని ఆశ్రయించడమే మోక్షానికి ఉపాయం! విష్ణువైనా, శివుడైనా ఈశ్వరుడు అనే భావంతో ఆశ్రయించాలి!

**జీవులు ఎందుకు బద్ధులు? ఎలా తరిస్తారు?**

ఈశ్వరుడే జీవులను, వారియొక్క కర్మలను నడుపుతూ ఉంటాడు! ఊరికే నడుపుతూ ఉంటాడా స్వామి? వాడి వాడి కర్మల పాశాలనే వాడికి తగిలిస్తాడు! కాల, కర్మబద్ధులైన జీవులని ఆ కాల, కర్మ బద్ధమైన అవిద్యాపాశంతో నడుపుతున్నాడు పరమాత్మ! తాడు కర్మకొద్దీ తగిలించాడు, విడిపించేదీ ఆయనే అని తెలుసుకుని శరణు వేడాలి!

**శరణు వేడడం అంటే ఏమిటి?**

1) భక్తిపరంగా: అపారమైన భక్తితో ఈశ్వరుని ప్రీతిగా ఆశ్రయించడం

2) జ్ఞానపరంగా: ఈశ్వర తత్త్వం మాత్రమే ఉన్నదని తెలుసుకుని, ఆ ఈశ్వర తత్త్వాన్ని శాస్త్రం ద్వారా, గురువు ద్వారా గ్రహించి, దాన్నే శ్రవణ, మనన, నిధిధ్యాసలు చేయడమే శరణాగతి!

శరణు వేడడం అంటే కష్టం వస్తే ఈశ్వరుని ఆశ్రయించడం అని కాదు, అలా ఆశ్రయించినా కొంత ధన్యుడే, కానీ క్రమంగా, ఎప్పటికో ఈశ్వరుడు మాత్రమే గుర్తు వస్తాడు, ఆయనయందే చింతన, ఆయన గురించే వినడం, అనడం, అనుకోవడం! ఇలా చెయ్యగా చెయ్యగా అదే నిలిచిపోతుంది! ఈశ్వరుడు తప్ప మరేదీ చింతన చేయని స్థితియే శరణాగతి!

**పరమాత్మ వైపు బుద్ధిని ఎలా తిప్పాలి?**

ప్రారబ్ధ వశాత్తూ శరీరానికి ఉన్న వాసనా బలం వల్ల మనస్సు ప్రపంచం వైపు లాగుతున్న దాన్ని భగవంతుడి వైపు తిప్పుతూ ఉండాలి! ఆ ప్రయత్నం చేయాలి, పదిమార్లు తిప్పిదే అదే భగవంతుడి దగ్గర ఉండిపోతుంది!

## పశువు - పాశం - పశుపతి

పశువులు, పాశాలు అందరికీ తెలుసు పతి తెలియడం లేదు! పతిని పట్టుకోవాలి! బ్రహ్మగారితో మొదలు చెట్ల వరకూ ప్రాణులన్నీ పశువులు, వాటికి ఎవరు ప్రభువో అతడు ఈశ్వరుడు! కనుక జ్ఞానులు ఆయన్ని పశుపతి అంటారు!

సర్వజీవులకు ప్రభువే పశుపతి!

ఈ జీవులందరినీ మాయ అనే పాశంతో బంధించి నేను నడుపుతూ ఉంటాను! అయితే ఈ పశువులందరికీ నేనే మోచకుడిని!

మోచకుడిని పట్టుకోవాలి! కట్టబడ్డాము అని తెలిస్తే కదా విప్పుకోవాలి అని ప్రయత్నిస్తాము! కోట్లమందిలో ఒకడు నాకు ఈ తాడు కట్టబడింది అని తెలుసుకుంటాడు, అలాంటి వారిలో కోట్లమందిలో ఒకడు అది విప్పుకోవాలి అనుకుంటాడు, అలాంటి కోట్లమందిలో ఒకడు ఎవడు విప్పుతాడో ఆ పరమేశ్వరుని శరణు వేడతాడు! అంత తేలికయా!

మాయనుండి మోచనం చేసేది నేనే (పరమేశ్వరుడే) అని శాస్త్రం చెప్తున్నది! "మామేవ యే ప్రపద్యంతే మాయామేమాం తరన్తితే" అన్నారు కృష్ణపరమాత్మ! సూతసంహిత చెప్తూ భగవద్గీత ఏమిటి అంటే, జగద్గురువులైన దక్షిణామూర్తి అయినా శ్రీకృష్ణపరమాత్మ అయినా ఒకటే తత్త్వం చెప్తారు! రెండూ ఈశ్వర తత్త్వమే కదా!

దురత్యయా అనే మాయను దాటాలి అంటే పరమాత్మని మాత్రమే ఆశ్రయించాలి! పరమాత్మని మాత్రమే! కష్టసుఖాల కోసం ఆశ్రయిస్తే, పరమాత్మని మాత్రమే ఎలా అవుతుంది? బ్రహ్మతత్త్వము మాత్రమే పట్టుకుంటే తప్పకుండా వాడికి నేను (పరమేశ్వరుడు) మోచనం చేస్తాను అని శృతి చెప్తున్నది! వేదధర్మము మాత్రమే మనల్ని రక్షిస్తుంది!

శివుడు సరస్వతీ దేవితో చేసిన ఈ సంభాషణ శాస్త్రసారము!

**గర్భోపనిషత్తులోని విషయం**

మానవుడు అయిన ప్రతీవాడూ జన్మించేముందర ఎదవ మాసంలో ఈ విషయం అనుకుంటాడుట! ఇది విచారణ చేయవలసిన విషయం!

శిశువుకి మెదడు పనిచేస్తున్న స్థితి (ఆ భంగిమ వల్ల) ఒకటి వస్తుంది అప్పుడు అతడికి అనేక జన్మల నుండి పడుతున్నాను అని గుర్తుకు వస్తాయి! అప్పుడు అతడికి ఈ జన్మని అయినా సార్ధకం చేసుకోవాలి అని! అప్పుడు అతడు ఇలా అనుకుంటాడుట "ఇప్పుడు ఈ గర్భంలో నుండి బయటికి వచ్చేస్తే నేను తప్పకుండ ఈశ్వరుని శరణు వేడి తరిస్తాను"

ఈశ్వరుడికి ఉన్న రెండు లక్షణాలు 1) అశుభక్షయకర్తారం = అశుభాలని తొలగించువాడు 2) పాశము నుండి విమోచనం కలిగించువాడు.

అటువంటి మహేశ్వరుని శరణు వేడుతున్నాను, ఈ జన్మని అయినా చివరి జన్మని చేసుకుంటాను!

ఒకటే ప్రయత్నంచేస్తాను బ్రహ్మచింతన! అని ఒట్లు పెట్టుకుంటాడు!

ఎవరైతే పాశమోచకుడను అయిన నన్ను ఆశ్రయిస్తున్నారో వారు తప్పకుండ ముక్తిని పొందుతున్నారు అని చెప్పారు! శివరూపంలో సరస్వతీదేవికి, కృష్ణరూపంలో అర్జునుడికి చెప్పారు!

**మనం చేయవలసినది ఏమిటి? ప్రపత్తి!**

ప్రపత్తి = తదేక చింతన/అనన్య చింతన! బ్రహ్మము తప్ప మరొకటి లేదు అని! ఈశ్వరుడే నిరంతర చింతనలో ఉండాలి! "అదే గమ్యం, అదే లక్ష్యం, అదే సత్యం" అని నిరంతరం అనుకుంటూ ఉంటే, అంటుకున్న అసత్యం ఎప్పటికైనా వదులుతుంది!

ప్రతీవారు తెలుసుకోవలసినది ఏమిటంటే, వేదము బోధించే విషయం ఇతర ప్రమాణాలు చెప్పలేవు! ఇతర శాస్త్రములు ప్రత్యక్షము, అనుమానము అనేవాటిని ప్రమాణంగా తీసుకొచ్చే

శాస్త్రములు. ఇవాళ ఒకటి అనిపించి ఇదే సత్యం అంటాము, కొన్నాళ్లయ్యాక ఇది కాదు అంటాము! ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలతో ఏర్పడే శాస్త్రాలకు అజ్ఞాన జనితమైన భ్రమ, ప్రమ దోషాలు ఉంటాయి!

భ్రమ =ఒకదానికి ఒకటి అనుకోవడం; ప్రమ = ఇది అంతే అని కొలిచి చెప్పడం!

ఈశ్వరుడి శబ్ద రూపమైన వేదమునందు ఆ దోషములు లేవు కనుక, తరించాలంటే వేదమే ప్రమాణం!

ఇతర శాస్త్రములు ప్రమాణాలు కావా? అంటే వేదములకు విరుద్ధములు కానంతవరకూ ప్రమాణమే!

ఇవాళ శివుడు సరస్వతీ దేవికి చెప్పిన గీత సనాతన ధర్మ సారము!

**సనాతన ధర్మ సారము:**

***బ్రహ్మమే సత్యము! బ్రహ్మమునే ఆశ్రయించు.***

***బ్రహ్మమునే శ్రవణ, మనన, నిధిధ్యాసలు చేయి! దానియందే భక్తికలిగి ఉండు, అప్పుడు చింతన బలపడి, అది తప్ప మరేదీ లేదనే జ్ఞానాన్ని అనుభవ రూపంలో ఇస్తుంది! ఇదే వేదసారం! అందుచేత వేదము చెప్పిన మార్గాలని, యోగాలని, ధ్యాన, ఉపాసన ప్రక్రియలను అవలంబించాలి!***

**మరి స్మృతులు, పురాణాలూ?**

అవి కూడా ప్రమాణాలే! ఎందుకంటే ఇవన్నీ వేదమూలములు కనుక అవన్నీ ప్రమాణములు!

కానీ వీటిల్లో ఎక్కడైనా వేదవిరుద్ధమైనవి కనపడితే అవి స్వీకరించరాదు!

లోకంలో రకరకాల ఉపాసనా పద్ధతులు, శాస్త్రాలు ఉంటాయి, కానీ అవి కూడా వేదవిరుద్ధం కానంతవరకే స్వీకరించాలి! ఈ తంత్ర సాహిత్యాలకు, తంత్రమార్గాలకి నేను దొరకను అన్నారు స్వామి! మరి శ్రీవిద్య తంత్రమే కదా! వైష్ణవ ఆగమాలు అవన్నీ ఉన్నాయి కదా అంటే అందులో వేదవిరుద్ధమైన వాటిని త్యజించాలి! ఇదే పని చేసారు ఆదిశంకరులు! వేదసమ్మతమైనవాటిని తీస్కుని సత్సంప్రదాయాన్ని ప్రతిష్ఠించారు!

శాస్త్రరూపిణి అయిన సరస్వతీదేవితో శాస్త్రములకే మూలము అయిన పరమాత్మ చెప్తున్నారు ఇదంతా!

తంత్రములయందు వేదవిరుద్ధములు అయినవి ప్రమాణం కాదు!

నేను కేవలం వేదైక నిష్ఠులకు మాత్రమే లభిస్తాను! అంటున్నారు స్వామి!

సారాంశం: వేదం, వేదాంతం విడిచిపెట్టి రకరకాల తంత్రప్రక్రియలు చేస్తూ ఈ మంత్రం చేశా, ఆ మంత్రం చేశా అంటూ ఉంటే ముక్తికి దూరం అవుతాము! అందుచేత రకరకాల తంత్రమార్గాలలో, వాటి అనుష్ఠాన మార్గాలలో వ్యర్థ పరచకుండా అవి చిత్తశుద్ధికి, ఈశ్వర భక్తికి, పాపమోచనానికి సహకరించేటట్లు మాత్రమే, వేదసమ్మతంగా ఉన్న తంత్రాన్ని

మాత్రమే స్వీకరిస్తూ, వేదమే ప్రమాణంగా భావిస్తూ, తద్వారా అవిద్యనుండి తొలగించే పరమేశ్వరుని శరణు వేడాలి!

ఏ రూపంతో ఉపాసించినా ఈశ్వర జ్ఞానంతో ఉపాసించాలి!

**ఈశ్వర జ్ఞానంతో ఉపాసించడం అంటే?** ఒక దేవతా విశేషం అని కాకుండా సృష్టి స్థితి లయలకు ఎవరు కారణమో, అవి చేస్తున్నా ఎవరికి సృష్టి స్థితి లయలు లేవో, త్రిగుణాత్మకము అయిన జగత్తుకు చైతన్యం ఇస్తున్నా, ఎవరు త్రిగుణాలకు అతీతుడో అతడు ఈశ్వరుడు!

**సర్వేషామ్ ఆత్మభూతోహం అహమేవ సంసారం మోచకః**

సర్వులకూ ఆత్మగా ఉన్న నేనే సంసారమోచకుడిని, అంటే అర్థం, ఆత్మవిద్య వల్ల మాత్రమే అవిద్య నుండి తరించుతాము! దానివల్లనే ముక్తి లభిస్తుంది! ఆ ఆత్మని నేను, "నన్ను" తెలుసుకోవడం అంటే ఆత్మవిద్య!

నాకంటే వేరుగా పురుషుడు మరొకడు లేడు!

నాన్య అతః అస్తి ద్రష్ట

పరమాత్మకంటే భిన్నంగా మరొక ద్రష్ట (సాక్షి) లేడు! పరమాత్మ తప్ప అన్యము లేదు!

శివకేశవా సంభాషణలో సరస్వతీ శివ సంవాద రూపమైన జ్ఞానవిషయం తెలుసుకున్నాము! ఆయన నుండి వచ్చిన శాస్త్రాల హృదయాన్ని ఆ శాస్త్రరూపిణి అయినటువంటి సరస్వతీ దేవికి చెప్పారు స్వామి!

**ప్రసాద దృష్టి**

ఇదంతా చెప్పక సూతులవారు ఒకమాట అంటున్నారు! నిజానికి ఎవడికి అయినా, ఏదయినా ఇచ్చేవాడు ఈశ్వరుడే!
దేవుడు లేడండి అని చెప్పేవాడికి అలా అనడానికి శక్తి ఇచ్చేది ఈశ్వరుడే!
దేనికైనా ఈశ్వరుడే ఇవ్వాలి! మన నిత్యజీవితంలో ప్రతీది ఈశ్వర ప్రసాదం! ఇది బాగా తెలుసుకోవాలి! ఎవరు పూజించినా పూజించకపోయినా వారి కర్మఫలాలని ఇస్తూనే ఉంటాడు! ఇవ్వడానికి ఉన్నవాడే ఈశ్వరుడు! భక్తుడు అయినవాడు ఇస్తున్నవాడు ఈశ్వరుడు అని తెలుసుకుంటాడు కనుక ప్రపంచంలో ప్రతీది ప్రసాద దృష్టితో అనుభవిస్తాడు!
ప్రసాద దృష్టి వస్తే ప్రశాంతత ఏర్పడుతుంది! జగత్తులో నువ్వు ఏది అనుభవిస్తున్నా కూడా నువ్వు చేసిన కర్మకి ఈశ్వరుడు ఇచ్చిన ప్రసాదం అని చూస్తే, కర్మభావం పోయి

ప్రసాద భావము వస్తుంది, అప్పుడు అది నిన్ను ప్రసాద, ప్రశాంత స్థితికి తీసుకెళుతుంది! మోక్షం ఇవ్వవలసినది ఈశ్వరుడు! ముందు ఆయన్ని శరణు వేడాలి! ఆయన్ని శరణు వేడాలి అంటే ఉపాసకులు సౌలభ్యం కోసం దివ్యమైన రూపం ధరించి వస్తాడు సుమా! అటువంటి ఈశ్వర మూర్తిని ఆశ్రయించాలి అని చెప్తున్నారు సూతపౌరాణికుడు!

**కథ**

పూర్వము ఒక ద్విజశ్రేష్ఠుడు ఉండేవాడు! మూడు ముఖ్య విషయాలు, సాధనోపాయాలు ఇక్కడ చెప్పబడుతున్నాయి.

**1) శ్రద్ధతో వేదము చెప్పిన కర్మలన్నీ చేసాడు 2) అలాంటి సత్కర్మాచరణ పాపనాశనం చేసింది! అంతఃకరణాన్ని అంటిపెట్టుకున్న అవిద్యారూపమైన దోషములే పాపములు! అవి తొలగాలి అంటే విద్యుక్తమైన కర్మాణి చెయ్యాలని చేస్తే ఆ పాపాలు నశిస్తాయి! సాధనోపాయం: మోక్షం చెప్పారని కర్మలని మానేయరాదు! శాస్త్రము చెప్పిన కర్మలని శ్రద్ధతో చేస్తేనే చిత్తశుద్ధి లభిస్తుంది!**

**3) అప్పుడు అతడికి జననమరణ సంసారం మీద భయం కలిగిందిట!**

సంసారం నిస్సారం అనే ఎరుకతో దీని నుండి ఎలా బయటపడాలనే భీతి, ఫియర్ పాజిటివ్ ఫియర్! సంసారం మీద భీతి కలగాలి అంటే చిత్తం శుద్ధం కావాలి (అది ఎలా? సత్కర్మాచరణ వల్ల).

సత్కర్మల వల్ల చిత్తం శుద్ధం అయినవాడు మాత్రమే ముక్తి కోసం తహతహలాడతాడు, అటువంటి వాడికి మాత్రమే ఈశ్వరుడు ముక్తిని ఇస్తాడు!

శ్రద్ధతో సత్కర్మాచరణ -> చిత్తశుద్ధి -> సంసారమంటే భీతి -> ఈశ్వరుని శరణువేడడం

అప్పుడు అతడు శుద్ధమైన అంతఃకరణంతో శాశ్వత కైవల్యం పొందడానికి ఈశ్వరుని శరణు వేడాడు! ఏ ఈశ్వరుని శరణు వేడాడు?

**ప్రలంబిత జటాబద్ధం చంద్రరేఖావతంసకం**
**నీలగ్రీవం శరచ్చంద్రచంద్రికాభిర్విరాజితం**
**గోక్షీరాధవళాకారం చంద్రబింబసమాననం**
**సుస్మితం సుప్రసన్నంచ స్వాత్మతత్త్వైకసంస్థితం**
**గంగాధరం శివం శాంతం లసత్కేయూరమండితం**
**సర్వాభరణ సంయుక్తం సర్వలక్షణ సంయుతం**
**వీరాసనే సమాసీనం వేదయజనోపవీతినమ్**
**భస్మధారాభిరామంతంనాగాభరణభూషితం**

వ్యాఘ్రచర్మాంబరమ్ శుద్ధం యోగపట్టావృతం శివం
సర్వేషామ్ ప్రాణినాం ఆత్మా అజ్ఞానాపస్మారపృష్ఠతః
విన్యస్త చరణం సమ్యక్ జ్ఞానముద్రాధరం హరం
సర్వవిజ్ఞాన రత్నానాం కోశభూతం సుపుస్తకం
దధానం సర్వతత్త్వాక్షమాలికాం కుండికామపి
స్వాత్మభూత పరానంద పరశక్త్యర్థవిగ్రహం
ధర్మరూపవృషోపేతం ధార్మికైర్వేదపారగై:
మునిభిః సంవృతం మాయావటమూలాశ్రీతం శుభం
ఈశానం సర్వవిద్యానాం ఈశ్వరేశ్వరమవ్యయం
ఉత్పత్త్యాది వినిర్ముక్తం ఓంకార కమలాసనం
స్వాత్మవిద్యాప్రదానేన సదా సంసారమోచకం
రుద్రం పరమ కారుణ్యాత్ సర్వప్రాణిహితేరతం
ఉపాసకానాం సర్వేషామ్ అభీష్టసకలప్రదం
దక్షిణామూర్తి దేవాఖ్యం జగత్సర్గాదికరణం

దక్షిణామూర్తిని ఉపాసించాడు, ధ్యానించాడు!
వ్రేలాడుతున్న అందమైన జడలని బంధించి ఉంచాడు, నెలవంకని దాల్చాడు, నీలకంఠుడై ప్రకాశిస్తున్నాడు, నిండు చంద్రకాంతులు తన శరీరము నుండి వెదజల్లుతున్నాడు, గోక్షీర కాంతితో ఉన్నాడు, పూర్ణచంద్రబింబము వంటి వదనం, చిరునవ్వు నవ్వుతున్నాడు, సుప్రసన్నంగా ఉన్నాడు, ప్రసన్నత ఎలా వచ్చింది? అంటే తన తత్త్వంలో (సచ్చిదానంద తత్త్వమునందు) తను ఉన్నందున! గంగాధరుడు, శివం, శాంతం, సర్వ ఆభరణాలు ధరించాడు, వీరాసనం పై (ఎడమపాదాన్ని ఎత్తి కుడితొడపై

కూర్చున్నాడు) కూర్చున్నాడు, వేదాయజ్ఞఉపవీతము ధరించాడు (అకార ఉకార, మకార వాటి సంకేతములైన ఋగ్ యజు సామములకు సంకేతం), భస్మధారణ చేసి ఉన్నాడు, నాగాభరణ భూషితుడు, వ్యాఘ్రచర్మము ధరించాడు, యోగపట్టములో ఉన్నాడు!

ఎవరు ఈయన? "సర్వేషామ్ ప్రాణినాం ఆత్మా"! ఆయన సర్వప్రాణికోట్లలో ఆత్మగా ఉన్నవాడు!

ఆయన ఏమి చేస్తున్నాడు? కుడిపాదముతో ఒక రాక్షసుడిని తొక్కిపెట్టాడు!

రూపధ్యానంతో రూపతత్త్వంలోకి ప్రవేశిస్తున్నాము!

స్వామి అజ్ఞానం అనే అపస్మారుడిపై పాదం పెట్టాడు!

**అపస్మారము అంటే ఏమిటి?**

తన స్థితి తనకి తెలియకుండా ఉండడమే అపస్మారము! సృష్టిలో అందరూ ఈ స్థితిలోనే ఉన్నారు!

నువ్వు చచ్చి, పోయి మరలా పుట్టేవాడివి కాదు అని శాస్త్రము చెప్తున్నా అలాగే అనుకుంటూ ఉంటున్నాము అంటే అంతకంటే అపస్మారము ఏమున్నది? ఈ మాట శాస్త్రము చెప్తున్నది! ప్రమాదమే మృత్యువు! అంటే తానేమిటో తనకి తెలియకపోవడం! అదే అపస్మృతి!

స్మృతి అంటే నువ్వు ఏమిటో నీకు నిరంతరం స్ఫూరణలో, స్మరణలో ఉండడం! అలా ఉంటే తరించుతావు, నువ్వేమిటో నువ్వు మర్చిపోయావు కనుక అది అపస్మృతి, అజ్ఞానం యొక్క మరొక రూపం!

అజ్ఞానం, అపస్మారము మూటకడితే ఈ రాక్షసుడు, వాడిని తొక్కిపెట్టి ఉంచాడు స్వామి, ఏమీ కష్టపడడంలేదు, చిరునవ్వు నవ్వుతూనే ఈ పని చేసేస్తున్నాడు! ఆ పాదం పెట్టినంతనే ఆ రాక్షసుడు చితికిపోయి పడిపోయాడు!

అపస్మృతిని తొక్కిపెట్టి స్వామి ప్రకాశిస్తున్నాడు! అంటే అజ్ఞానాన్ని అణచిపెట్టిన జ్ఞానస్వరూపుడు!
స్వామీ! అజ్ఞానాన్ని నేను అణుచుకోలేకపోతున్నాను! జ్ఞానం రావడంలేదు, ముక్తి ఎలా వస్తుంది? అని మనం ప్రార్ధిస్తే, నువ్వు అజ్ఞానాన్ని ఏమి అణచగలవు? నన్ను ఆశ్రయించు నేను తొక్కిపెడతా అంటాడు మహానుభావుడైన స్వామి!
ఈ అపస్మృతి, మాంద్యం అనేవి లౌకిక విద్యల్లో కూడా ప్రమాదమే! ఏ విద్యని అయినా బుద్ధిలోకి రానివ్వని అజ్ఞానమే అపస్మారుడు! "శివాయగురవేనమః" అని దక్షిణామూర్తిని ఆశ్రయిస్తే ఆ అపస్మారుడిని తొక్కిపెట్టేస్తాడు!
"భండమాంద్యాన్ధ ధనుజాంతకమై రేగి శ్రీమయమహోత్సాహ సిద్ధిగూర్చెడి పదము" అంటారు పూజ్య గురుదేవులు!

**వేదప్రకారంగా అన్వయం**
"ఆదిత్యవర్ణం తమసస్తు పారే"
ఈశ్వరుడు చీకటికి ఆవల ఉన్నాడట! అంటే అర్థం ఏమిటంటే అవిద్యకి ఆవల భగవానుడు ఉన్నాడు!
అవిద్య = అచ్చపు చీకటి (పోతనగారు)
బ్రహ్మవిద్య = అచ్చ తెలివి (విశ్వనాథవారు)
"అచ్చపు చీకటి" అంటే కన్నుపొడుచుకున్నా కానరాని కటికచీకటి! అంటే భర్తృహరి ఏమంటారు అంటే అనేకజన్మల నుండి పట్టుకున్న అజ్ఞానం! అలా అనేకజన్మల చీకటి

అలవాటయింది కనుక వెలుగు గురించి చెప్తూ ఉంటే అర్థం కావడంలేదు! అంత అలవాటయింది చీకటి! ఇదే తమస్సు!

ఈ తమస్సును దాటినవారు మాత్రమే ఈశ్వరుడిని తెలుసుకోగలరు!

తమస్సు ఎక్కడ ఉంది? అంటే లోకదృష్టి అంతా తమస్సే! లోకము అనగానే లోకులు, లోకేశులు, లోకస్థులు! మూడూ! ఇదే కనిపిస్తూ ఈశ్వరుడు కనిపించనంతవరకూ అవిద్యయే! ఇది దాటితేనే పరమాత్మ!

"పెంజీకటికవ్వల ఎవ్వడేకాకృతి వెలుగు"!

పెంజీకటికి ఆవల పరమాత్మ, ఈవల ప్రపంచం! అజ్ఞానానికి ఈవల బంధం, ఆవల మోక్షం!

ఈశ్వరుడు అజ్ఞానం మీద పాదం పెట్టి ఉన్నాడు అంటే అజ్ఞానానికి ఆవల ఉన్నాడు, ఆయన పాదం పట్టుకుంటే అజ్ఞానం నుండి దాటిపోవచ్చు!

అవిద్య అంతా ఒకదగ్గర మూటకడితే ఈ అపస్మారుడు! మూర్తీభవించిన అజ్ఞానం అపస్మారుడు అయితే, దాన్ని తొక్కిపెట్టి దానిమీద ఉన్న జ్ఞానస్వరూపుడు దక్షిణామూర్తి!

ఆ "తమసః పరస్తాత్" అయిన తేజస్సు ఏది? "వేదాహమేతం పురుషం మహాంతం" అటువంటి వాడు ఆదిత్యవర్ణుడు అయి ప్రకాశిస్తున్నాడు!

ఆదిత్య అంటే అఖండమైన తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు అని అర్థం! తమస్సుకి ఆవల!

క్రింది కుడి చేత్తో జ్ఞానముద్ర, క్రింది ఎడమ చేత్తో పుస్తకం పట్టుకున్నాడు! ఇది దేనికి సంకేతం అంటే సర్వ శాస్త్రముల (పరపరావిద్యల) సారము. పైన ఉన్న కుడిచేత్తో

అక్షమాల ధరించాడు, ఇది మంత్రశక్తులకు సంకేతం, సర్వమంత్రశక్తులను మాలగా ధరించి ఉన్నాడు, పైన ఎడమచేతితో కుండికను పట్టుకున్నాడు, దీన్నే సుధాకుంభము అంటారు!

తెల్లని స్వామి ప్రకాశిస్తూ గోచరిస్తూ ఉన్నాడు, చంద్రలేఖను ధరించాడు, గంగాధరుడై ఉన్నాడు, జటాజూటము చక్కగా బంధించి ఉంచాడు!
మరి అమ్మవారు? "స్వాత్మభూత పరానంద పరశక్త్యర్థవిగ్రహం" అంటున్నారు!
స్వాత్మభూతా అంటే తనదే అయిన, తనకు భిన్నం కాని పరానందం ఉన్నదో, ఆ పరశక్తి అర్థవిగ్రహంగా ఉన్నది!

ధర్మరూపమైన వృషభేశ్వరుడు స్వామి ఎదురుగా కూర్చుని ఉన్నాడు! దీని అర్థం ఏమిటి? కథలో ద్విజుడు వైదికధర్మాన్ని ఆచరించాడు అని ఉన్నది కదా, దాని సంకేతం వృషభం! అందుచేత వృషభారూఢుడు అంటే ధర్మాన్ని అధిష్ఠించి ఉంటాడు అని అర్థం!

ఆయన చుట్టూ ధార్మికులు, వేదపారగులు! శివుడి చుట్టూ ఉండడానికి అర్హతలు ఏమిటి? అంటే ధార్మికత, వేదవిజ్ఞాన విచారణ! ఈ సంస్కారాలు ఉన్నవారే ఆయన దగ్గర కూర్చోడానికి అర్హులు!

మాయావట మూలములో కూర్చున్నాడు అంటున్నారు! నిన్నటి రోజున జ్ఞానవృక్షం అని తెలుసుకున్నాము! ఇక్కడ చెప్తున్నది రెండవ భావం! దేనికి అదే రెండిటినీ కలపరాదు!

వటము అంటే ఏమిటి?

1) జ్ఞానవృక్షం

2) మాయారూప విశ్వవృక్షం

మాయావటము అంటే ప్రపంచము!  ప్రపంచానికి మూలాన్ని తెలుసుకోగలమా? పెద్ద మఱ్ఱిచెట్టు వద్దకు వెళ్లి మూలము వెతికితే తెలియబడదు!

విస్తరించిన మాయావటము అంటే శివుని యొక్క మాయాశక్తి చేత అనంతముగా విస్తరించిన విశ్వము. విశ్వము కనపడుతున్నది, కానీ విశ్వానికి మూలము ఏమిటో తెలుసుకోవాలి! వటవృక్షానికి మూలము నేను అని చెప్పడానికి అక్కడ కూర్చున్నాడు స్వామి.

3) మనలో ఉన్న బుద్ధిరూప వృక్షం

బుద్ధులు, మాటలు, ఆలోచనలు ఎక్కడ నుండి చేస్తున్నావో గమనించు! రకరకాల భావాలూ, ఆలోచనలు, ఇవన్నీ ఊడలతో ఉన్న మఱ్ఱిచెట్టులానే ఉంటాయి! ఎక్కడ ప్రారంభించామో తెలియదు, ఒకదానితో ఒకటి, ఒకదానితో ఒకటి, ఊహల, యోచనల ఊడలు దింపుకొని విస్తరించుతున్నది.  ఇన్ని ఆలోచనలు రావడానికి కారణం ఒక స్మృతి, ప్రజ్ఞ మనలో ఉండడం వల్ల కదా! దానికి మూలము ఎవరో తెలుసుకోవాలి! మూలానికి ఇంత విస్తారము లేదు, ఒకడే ఉన్నాడు!  కనుక ఇన్నిరకాల శక్తులు వెలువరించే నీ బుద్ధిశక్తికి ఎవరు ఆత్మగా మూలముగా ఉన్నాడో ఆయనే వటమూలమునందు ఉన్నాడు! "యో బుద్ధే పరతస్తు సః"

"ఈశానం సర్వవిద్యానాం ఈశ్వరేశ్వరమవ్యయం"

ఈశ్వరులకే ఈశ్వరుడు! రకరకాల లోకాలకి రకరకాల పాలకులు ఉంటూ ఉంటారు! వీరందరికి కూడా ఎవడు పాలకుడో, ఎవరికి పాలకుడు లేడో ఆయన ఈశ్వరేశ్వరుడు అవ్యయుడు

**ఉత్పత్త్యాది వినిర్ముక్తం** - ఉత్పత్తి మొదలైనవి లేనివాడు!

**ఓంకార కమలాసనం** - ఓంకారము అనే కమలము మీద కూర్చున్నాడు! విచ్చుకున్న ఓంకారంలో ఆయన ఉన్నాడు! అంటే ప్రణవోపాసన సంపూర్ణంగా చేసినప్పుడు ఏ జ్ఞానం భాసిస్తుందో ఆ జ్ఞానంలో ఆయన ఉన్నాడు!

**"స్వాత్మవిద్యాప్రదానేన సదా సంసారమోచకం"**
స్వస్వరూపమైన ఆత్మవిద్యని ఇవ్వడం వల్ల సంసార మోచనం కలిగిస్తాడు!

"రుద్రం"
**"రుద్ర" అంటే అర్థం ఏమిటి?**
1) దుఃఖములు తొలగించువాడు 2) పాపములు తొలగించువాడు 3) పాపకారణములైన అవిద్యను తొలగించువాడు! అత్యంతికదుఃఖనాశకుడు
రుద్ర అంటే గురుస్వరూపం అని అర్థం! అంతేకాదు వేదములు ఎవరి నుండి వచ్చాయో ఆయన!

**"పరమ కారుణ్యాత్ సర్వప్రాణిహితేరతం"**
ఏ మూర్తి లేని వాడు ఎందుకు కనపడుతున్నాడు? కామేశ్వర పండితుడు దక్షిణామూర్తి నామానికి భాష్యం రచిస్తూ ఇలా అంటారు:

ఒక గొప్ప నటుడు చూస్తున్న ప్రేక్షకులకు రసోత్పత్తి (ఆనందం) కలిగించడం కోసం వేషం ధరించి, దానికి తగ్గట్లు వేష భాషాది నటనలు చేస్తాడు! అప్పుడు చూస్తున్న సహృదయుడైన ప్రేక్షకుడు ప్రపంచాన్ని మరచి లీనం అయి ఆనందం పొందుతాడు! అలాగే ఉపాసకులకు సంసారిక దుఃఖం పూర్తిగా మరిపింప చేయడానికి, బ్రహ్మానంద సుఖం తెలియచేయడానికై, ఏ మూర్తీ లేనటువంటి సచ్చిదానంద (శాశ్వత, జ్ఞాన ఆనందరూపుడు), స్వరూపుడైనటువంటి వాడు అటువంటి దక్షిణామూర్తి వేషాన్ని ధరించి ఉన్నాడు!

**ఉపాసకానాం సర్వేషామ్ అభీష్టసకలప్రదం**

దక్షిణామూర్తి ఉపాసన ప్రధానంగా మోక్షం ఇస్తున్నప్పటికీ, ఆయన్ని ధ్యానిస్తూ, ఆయన నామం పలుకుతూ ఉంటే సకలాభీష్టాలు కూడా ఇస్తాడు! స్వామి మంత్రం రహస్యల్లో ఈ ధర్మబద్ధ ప్రయోజనాలకు సంబంధించిన మంత్రరాశి కూడా ఉన్నది.
ఆయన్ని ఆశ్రయిస్తే ఏదయినా ఇవ్వగలడు, ఏదయినా చెయ్యగలడు! దాన్నే సమర్ధత, దక్షిణ అంటారు! అదే ఆయన మూర్తి కావున దక్షిణామూర్తి!

**దక్షిణామూర్తి దేవాఖ్యం జగత్సర్గాదికరణం**

అటువంటి దక్షిణామూర్తిని ద్విజుడు ఉపాసించాడు! ఆ దక్షిణామూర్తి ఎవరు అంటే, ఎవరు సృష్టి, స్థితి, లయలకు హేతువో అతడే!

అటువంటి స్వామిని సాక్షాత్కారం చేస్కున్న ఈ విప్రుడు స్వామిని నమస్కరించి, స్వామిని సమారాధన చేసి ఇలా అడిగాడు "రుద్రయత్తే దక్షిణం ముఖం తేన మాం పాహినిత్యం" అంటే "హే రుద్రా! నీ దక్షిణాభిముఖముతో నన్ను రక్షించు" అన్నాడు!

ఇది శ్వేతాశ్వరోపనిషత్తులోని వాక్యం! పురాణాలు వద్దు ఉపనిషత్తుల వైపు వెళ్ళాము అనేవారు ఇది గమనించాలి!


"రుద్ర" అంటే మరో అర్థం సృష్ట్యాదులయందు బ్రహ్మకు వేదాలని ఇచ్చినవాడు కూడా! ఉత్తరంవైపు ఉంటూ దక్షిణం వైపు చూస్తూ దక్షిణముఖంతో నన్ను రక్షించు అంటున్నాడు! దక్షిణముఖం జ్ఞానముఖం!


అంబికాపతి అయినటువంటి దక్షిణామూర్తి అలా ఆశ్రయించిన ద్విజశ్రేష్ఠునికి స్వాత్మజ్ఞానాన్ని ప్రసాదించి సంసార రూపమైన పాశాన్ని తొలగించాడు! ఆత్మస్వరూపాన్ని అనుభవానికి తీసుకొచ్చి ముక్తిని కలిగిస్తున్నాడు!

సారాంశం:
ప్రతీవారు కూడా తమకి తెలిసినంతమేరకు శాస్త్రచోదిత కర్మలు పాటిస్తూ, చేసినవన్నీ ఈశ్వరార్పణబుద్ధితో అర్పణ చేసి, ఆయన్నే చింతన చేస్తూ, దక్షిణామూర్తిని ఆరాధించినట్లు అయితే తప్పకుండ వారు జన్మని సార్ధకం చేస్కుని ముక్తిని పొందుతారు!

"అందుచేత మహానంద స్వరూపుడు అయిన మహాదేవుడిని ఆయనే సంసారమోచకుడు అనే తెలివితో సర్వభావాలా భజించండి, తప్పకుండా సర్వమూ సిద్ధిస్తుంది" అంటున్నారు సూతపౌరాణికుడు మహర్షులతో!

**సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు**





## శ్రీదక్షిణామూర్తి 4వ రోజు (6/15/2021)

శివాయగురవేనమః శ్రీమాత్రేనమః శ్రీవిష్ణురూపాయ నమఃశివాయ

శ్రీకాళహస్తీశ్వరాయ నమఃశివాయ

శ్రీదక్షిణామూర్తయే నమఃశివాయ

**ఉపాసకానాం యదుపాసనీయం**

**ఉపాత్తవాసం వటశాఖిమూలే**

**తద్ధామ దాక్షిణ్యజుషాస్వమూర్త్యా**

**జాగర్తిచిత్తే మమ బోధరూపం**

నిన్నటి స్మరణ: సూతసంహితలో ద్విజుని కథ, అతడు పరమేశ్వరుని దక్షిణామూర్తిని సాక్షాత్కరించుకుని, ఆత్మజ్ఞానం లభించి ముక్తిని పొందడం తెలుసుకున్నాము.

ఉపాసన: 1) గురువు దగ్గర మంత్రం తీస్కుని ఆ చెప్పిన పద్ధతుల్లో ఆరాధన చేయడం 2) కేవలం ఆ మూర్తిపై, తత్త్వంపై, నామంపై ప్రేమ కలిగి, ఉపాసిస్తే కూడా ఉపాసనయే! ఆయనని కీర్తించినా, ధ్యానించినా, పూజించినా ఉపాసన ఫలితం లభిస్తుంది! అందుచేత మంత్రములు లేవు, యంత్రములు లేవు, అనుకోవడం కాదు, భక్తితో మనస్సు ఈశ్వర సాన్నిధ్యాన్ని పొందితే అదే ఉపాసన!

భక్తి లేనప్పుడు మంత్రం, యంత్రం మొదలైనవి ఆడంబరాలు కూడా పెంచుతాయి! అహంకారం పెంచుతాయి కూడా!

శివాయగురవేనమః, దక్షిణామూర్తయేనమః అంటూ వర్ణించిన స్వ రూపాన్ని మనస్సులో తలంచుకొని ఆర్ద్రమైతే అది భక్తి! ఆ స్థితి కలగాలి! అటువంటి భక్తి ప్రవచనాదులు వింటున్నప్పుడు కలిగినప్పటికీ కూడా అనేక జన్మల పాపసంస్కారాలు తొలగిపోయి చిత్తము శుద్ధము అవుతుంది, దక్షిణామూర్తి అనుగ్రహం లభిస్తుంది! ఈ దృష్టితో వినాలి!

ఉపాసనలు కూడా ఉత్కృష్టములే, అవి కూడా ప్రేమతో భక్తితో చేస్తే జ్ఞానానికి దోహదపడుతుంది! అంతేకానీ అహంకారాదులతో కూడి చేస్తే ముక్తికి హేతువు కాదు! భక్తి ఎక్కడ నుండో తెచ్చుకునేది కాదు! సహజంగా పరమాత్మ మీద ప్రేమ కలిగి ఉండడమే భక్తి!

హృదయంలో ఆ మూర్తి స్ఫుటంగా భాసిస్తే అది అంతఃకరణంలోని అనేక వాసనలను తొలగించి, ఈశ్వరానుగ్రహాన్ని కటాక్షిస్తుంది. ప్రవచనంలో స్వామిని వర్ణనరూపంగా కాదు, ధ్యానరూపంగా చెప్తున్నారని భావించాలి. ఒక్కసారి స్వామిని మనస్సులో భాసింప చేసుకుంటే అత్యంత విస్తారమైన వటవృక్షం మూలంలో భగవానుడు భాసిస్తున్నాడు!

ప్రతీ రూపం ఒక తత్త్వాన్ని చెప్తుంది, అందుకే భావానికి తత్త్వం కలియాలి! వటవృక్షం మూలంలో స్వామిని భావిస్తూనే ఆ వటవృక్షాన్ని తత్త్వదృష్టితో ఎలా చూడాలో మూడు విధాలుగా చెప్పుకున్నాము. ఆ మూడింటినీ తలంచుకుంటూ, దాని క్రింద కూర్చున్నవాడు, ఈ విశ్వానికి, జ్ఞానానికి, మన అంతఃకరణానికి కూడా మూలమని భావన కలగాలి! అలాంటి భగవానుడు ధవళ కాంతులతో భాసిస్తూ చిన్ముద్ర, పుస్తకం, సుధాకలశం, అక్షమాల ధరించి మందహాసంతో ప్రకాశిస్తున్నాడు! శివునికి సహజంగా ఉన్న నీలగ్రీవం, నాగాభరణాదులు, జటాజూటము ఇత్యాదులతో ప్రకాశిస్తున్నాడు!

వీరాసనంలో ఉన్నాడు, అపస్మారుడిని తొక్కి అణచి ఉన్నాడు, అంటే అజ్ఞానాన్ని అణచిన జ్ఞానస్వరూపం! అందుకు ఆ స్వామిని స్మరించి, ఆశ్రయిస్తే చాలు మన బుద్ధిమాంద్యాలని తొలగిస్తాడు! అదే విధంగా అజ్ఞానాన్ని తొలగించి స్వస్వరూపం ఏమిటో స్మృతికి వచ్చేటట్లు చేస్తాడు!

**నామవైభవం**

ఒక నామము ఉన్నది అంటే దాని ద్వారా తత్త్వం ఆవిష్కరింపబడుతుంది! అసలు తత్త్వావిష్కారం కోసమే నామరూపములు ఉన్నాయి. ఆ తత్త్వం అనుభవానికి వచ్చాక నామరూపాలు ఆ తత్త్వములో లయమవుతాయి! తత్త్వం తెలిసి నామాన్ని అన్నప్పుడు అది జ్ఞానంతో ఆనందంతో భాసిస్తూ ఒక రసానుభూతిని ఇస్తుంది! అదే త్యాగయ్య "తెలిసి రామచింతనతో నామము సేయవే" అన్నారు!
తెలియకపోయినా శక్తిని ఇస్తుంది కానీ తెలిసి చేస్తే ఎక్కువ ఉంటుంది!

**దక్షిణామూర్తి అర్థవిచారణ**

ఒక నామానికి అనేక అర్థాలు ఉంటాయి కనుకనే ఆ నామము శక్తిమంతము అవుతుంది!
దక్షిణః
ఎవడు దక్షిణుడో ఆయన మూర్తి ధరించి దక్షిణామూర్తి అయ్యాడు!
దక్షిణ అంటే మాటకి పరమాత్మ పరమైన అర్థాలు ఎన్నో ఉన్నాయి! వివిధ తత్త్వములతో భాసించే ఏకస్వరూపాన్ని దక్షిణ నామ అర్థంగా తెలుసుకోబోతున్నాము!
1) "దక్షతే వర్ధత ఇతి దక్షిణః" అన్నారు ఆదిశంకరులు భాష్యంలో!
పూర్తిగా వృద్ధి పొందువాడు అనగా పరిపూర్ణంగా వృద్ధి చెందువాడు! ప్రకృష్టంగా వృద్ధి చెందువాడు! ఆయన పరిపూర్ణుడు, సంపూర్ణ వికసనము కలిగిన తత్త్వము!

2) దక్షిణః = సమర్థుడు/శ క్తః
సమర్థుడు భగవంతుడు ఒక్కడే! శక్తి అంటే ఆయనదే! సర్వ సమర్థుడు! "కర్తుం అకర్తుం అన్యథా కర్తుమపి సమర్థారం", ఏదయినా చేస్తాడు, చెయ్యకుండా కూడా ఉంటాడు, ఒకదానికి ఒకటి చేస్తాడు, ఆయన్ని ప్రశ్నించేవారెవరు?

3) శీఘ్రకారి
ఏదయినా వెంటనే ఇస్తాడు, ఆలస్యం చేయడు! అనుగ్రహం శీఘ్రంగా ఇస్తాడు!
ఈ మూడూ (1,2,3) కూడా ఆయనయందు సహజంగా ఉన్నటువంటి లక్షణములు!

4) దక్షిణ దిక్కుకు అభిముఖంగా ఉంటూ ఉత్తర దిక్కున కూర్చుని సనకాది బ్రహ్మవాదులకు వాత్సల్యంతో బ్రహ్మవిద్య ఉపదేశించాడు!
"గురువు శిష్యులకు వాత్సల్యంతో చెప్తాడు అంతేకానీ శిష్యులనుండి ఏదో ఆశించి చెప్పడు! ఈశ్వర వాత్సల్యం కారుణ్యము"
దక్షిణ దిక్కు వైపు చూస్తూ ఉత్తర దిక్కున కూర్చున్నందున దక్షిణుడు
ఈ అర్థాలన్నీ గుర్తుపెట్టుకుంటూ నామం అంటే అది మహామంత్రం అవుతుంది!
శ్రీదక్షిణామూర్తయేనమః
శ్రీభగవతే దక్షిణామూర్తయేనమః
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే
ఇలా ఎన్నో ఉన్నాయి!

5) దక్షిణుడు అంటే స్వతంత్రుడు! ఎవరికీ తాను అధీనుడు కాడు, అన్నీ తన అధీనంలో ఉంటాయి! సర్వమూ ఎవరి వశంలో ఉంటుందో అతడు ఈశ్వరుడు! పరమేశ్వరుడు స్వతంత్రుడు! ఎందుకు ఇలా చేసావు అని ఎవరూ అడగలేరు! నమస్కరించవలసినదే!

6) దక్షిణుడు సాక్షాత్తు మృత్యుంజయుడే!
దక్షిణామూర్తి ఉపాసన మృత్యుంజయ ఉపాసనయే! దక్షిణం వైపు చూస్తున్నాడు కదా స్వామి, దక్షిణం యముడి దిశ, అంటే యముడిపై ఒక కన్ను వేసి ఉంచాడుట స్వామి.

స్వామిని ఆశ్రయించిన వారు ఉత్తరదిక్కువైపు తిరిగి కదా కూర్చుంటారు! భక్తులు ఉత్తరం వైపు చూసినప్పుడు, వారి పృష్ట భాగం దక్షిణంవైపు ఉన్నది కదా అంటే అర్థం యముడికి పృష్ట భాగం చూపించారు! అంటే అర్థం ఏమిటి? శివుడిని ఆశ్రయించిన మాకు యముడితో పనిలేదు అన్నట్లుగా వాళ్ళు యముడిని పట్టించుకోకుండా శివుడిని చూస్తున్నారు!

యముడు అంటే కాలము, మృత్యువు! ఎవడు ఈశ్వరాభిముఖులై ఉంటారో వారిని కాలము, మృత్యువు ఏమీ చేయలేవు! కాలముకు, మృత్యువుకు లొంగిపోయే సంసారం నుండి బయటపడిపోతారు, అటువంటి వారు మృత్యువును దాటినట్లే!

మృత్యువు అంటే? ఆత్మవిస్మృతి!

ఏది అమృతమో అని నువ్వు అని శాస్త్రము చెప్తూ ఉంటే మృతలక్షణము కలిగిన శరీరమే నేను అనుకుంటూ దానితో ఏడుస్తూ అఘోరిస్తూ దానితో పోతున్నాము!

అందుకే అమృతత్త్వాన్ని తెలుసుకున్నవాడు మృతలక్షణమైన దేహంతో తాదాత్మ్యం చెందడు కనుక అతడు యముడికి నిర్లక్ష్య ధోరణి చూపిస్తున్నాడు. పృష్టభాగం చూపాలి అని అతడు అనుకోలేదు, శివుడికి అభిముఖుడు అయ్యాడు అంటేనే యముడికి విముఖుడై పోతాడు సహజంగా!

తన భక్తులపై యముడి దృష్టి పడకుండా స్వామి నిఘా వేసి ఉంచాడుట! మృత్యు రూపమైన అజ్ఞానము తన భక్తులని పీడించకుండా అటువైపు చూస్తున్నాడు స్వామి!

7) అవైషమ్య వృత్త్యా సర్వత్ర తుల్య:

అన్నిటి పట్లా సమభావంతో ఉండేవాడు, వైషమ్యము లేనటువంటి వాడు.

వైషమ్యం = సమదృష్టి

ఈ జగత్తంతా విషమమే అనగా ద్వంద్వము! అది ఉన్నప్పుడు ఒకదానియందు ఆధిక్యత ఒకదానియందు న్యూనత ఉంటాయి! వైషమ్యంగా కనిపించే ద్వంద్వ జగత్తులో సమంగా వ్యాపించిన పరమాత్మ మాత్రం ఒక్కడే!

**సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।**

**వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ।। గీత 13. 28 ।।**

సమమైన స్థితిని తెలుసుకుని ఆ స్థితిలో ఉండడాన్ని సమత్వం యోగముచ్యతే అంటాడు మరోచోట కృష్ణపరమాత్మ! సమత్వం తెలిసి కర్మాచరణ చేసేవాడు సమయజ్ఞుడు!

**సమదృష్టి అంటే ఏమిటి?**

రాజకీయంగా చెప్పేటటువంటి సమసమాజం, సోషలిజం అనే పిచ్చిమాటలు కాదు! సమసమాజము ఎప్పుడూ ఉండదు! తత్త్వములో మాత్రమే సమత్వము ఉంటుంది! అటువంటి సమస్థితిలో అందరిలో ఎవడు సమంగా వ్యాపించి ఉన్నాడో అతడు అందరిపట్లా తుల్యంగా ఉన్నాడు! అటువంటి స్వామి దక్షిణుడు! అతడికి వైషమ్యాలు లేవు!

**భగవానుడు మరి ఒకరికి దుఃఖం ఒకరికి సుఖం ఇస్తున్నాడు కదా, మరి వైషమ్యం ఉన్నట్లే కదా, దయ లేకుండా ఉన్నాడు అని కదా?**

దీనికి బ్రహ్మసూత్రాల్లో ఒకమాట చెప్తారు, ఈశ్వరుడికి ఒకరియందు ప్రేమ, ఒకరియందు ద్వేషం లేదు! వారి వారి కర్మలను అనుసరించి ఫలాన్ని ఇస్తాడే తప్ప ఆయనకీ వైషమ్యం లేదు! సమంగానే ఉంటాడు!

ఒకడు కల్పవృక్షం కిందకి వెళితే వాడు ఏది కావాలో అది పొందుతాడు అంతేకాని కల్పవృక్షం వీడికి ఫలం ఇవ్వాలి అనుకోదు వాడు వెళ్ళాడు కనుక పొందాడు, అలాగే ఈశ్వరుడిని ఆశ్రయించినవాడు అనుగ్రహింపబడుతున్నాడు అంటే తనపై భక్తి చూపినవారినే అనుగ్రహిస్తాడు అని కాదు, ఆశ్రయించాడు కనుక అనుగ్రహం పొందుతాడు! వృక్షం వలె ఉదాసీనుడుగా ఉంటాడు భగవానుడు!

ఇవన్నీ కూడా పరమేశ్వరః అన్నదానికి అర్థాలు అందుచేత దక్షిణుడు అంటే పరమేశ్వరుడు/ఈశ్వరుడు/మహేశ్వరుడు.

## 8) సర్వాపేక్షయా మహాస్

అన్నీ విధాలుగా ఎవరు గొప్పవారో వారిని దక్షిణుడు అనాలి. సర్వసమర్థుడు, సర్వోన్నతుడు, మహాశక్తి కలవాడు!

మన స్థితి నుండి చూస్తే దేవతలు గొప్పవారు! దేవతలకు, ఋషులకు జ్ఞానం ఇచ్చినవాడు బ్రహ్మదేవుడు! అటువంటి బ్రహ్మదేవుడికి వేదములు ఇచ్చిన బ్రహ్మము పరమేశ్వరుడు!

దీనికి ప్రమాణములు కూడా ఎన్నో ఉన్నాయి!

కేనోపనిషత్తు కథలో కూడా దక్షిణామూర్తియే తన కరుణ అయిన అమ్మవారిలా ప్రత్యక్షం అయి బ్రహ్మవిద్యను బోధించారు!

వివిధ ఉపనిషత్తుల్లో దక్షిణామూర్తి తత్త్వం ప్రతిపాదించారు! శ్వేతాశ్వతర ఉపనిషత్తులో కూడా ఈ వివరాలు ఉన్నాయి. కర్మకాండలు అంటూ విభాగం చేసిన వాటిల్లో కూడా బ్రహ్మజ్ఞానం ఉన్నది.

"**ఏకో రుద్ర:**" అనే మంత్రము ఉన్నది దీనిలో! ఉన్నదంతా ఒకటే ఈశ్వరుడు అని చెప్పడమే ఇక్కడ ముఖ్యం!

**ఉన్నది రుద్రుడు మాత్రమే అన్నప్పుడు శివుడు తప్ప రెండవవాడు లేడు అని చెప్పడమా? అంటే కాదు, రెండవది అనేది లేదు, ఉన్నదంతా ఒకడే ఈశ్వరుడు అని చెప్పడం!**

**రుద్ర అంటే అనేక అర్థాలు చెప్పుకున్నాం, ప్రధానంగా ఆనందం ఇచ్చేవాడు, దుఃఖాన్ని నాశనం చేసేవాడు! అది కూడా ఈశ్వర శబ్దానికి మరొక పేరే కదా! అందుచేత వేదము చెప్పే భగవన్నామములన్నీ ఈశ్వరుడి పేర్లే, ఇది తెలియక పరస్పర వైషమ్యాలలోకి మనం వెళిపోతున్నాము! వైషమ్యరహిత పరమేశ్వరుడే వివిధ నామములతో వ్యక్తమవుతున్నాడు!**

"రుద్రయత్తే దక్షిణం ముఖం తేన మాంపాహి నిత్యం" - . శ్వేతాశ్వతర ఉపనిషత్తు

ఈ ఉపనిషత్తులో దక్షిణామూర్తి గురించి కూడా వచ్చింది. శ్వేతాశ్వతర ఉపనిషత్తులో రుద్ర నామం అనేకసార్లుచెప్పబడింది. ఎవడు తన శక్తితో సర్వలోకాలను శాసిస్తున్నాడో ఆ ఈశ్వరుడు రుద్రుడు! ఎవరు ముందుగా బ్రహ్మదేవుడిని తననుండి సృజించి ఆయనకీ వేదాలు ఇచ్చాడో (సృష్టిరచనాజ్ఞానం). వేదము అంటే జ్ఞానం! ప్రవృత్తి మార్గం వారు ఎలా తరించాలి వారి ధర్మములు, నివృత్తి మార్గం వారు ఎలా తరించాలి, వారి ధర్మములు, నియమములు చెప్పేదే వేదము! ఈ మార్గాలు, పద్ధతులు, శాస్త్రాలు అందివ్వవలసిన భాద్యత బ్రహ్మదేవుడికి పెట్టి, ఆయనకు ఆ వేదవిద్యను అనుగ్రహించాడు! అనుగ్రహించాడు అంటే పుస్తకాలు ఇచ్చాడు అని కాదు, బుద్ధికి స్ఫురింపచేసేదే జ్ఞానం! ఆ బ్రహ్మదేవుడు ఆ జ్ఞానాన్ని ఋషులకి ఇస్తే, వారు మనకి ఇచ్చారు! కనుక **ఆదిఋషి ఎవరు?** దక్షిణామూర్తి! ఆయన గురువు, దేవత, ఋషి, పరబ్రహ్మ! బ్రహ్మదేవుడికే వేదములు స్ఫురింపచేసినవాడు స్వస్వరూప జ్ఞానాన్నినాకు స్ఫురింపచేయుగాక!

**అందుకు మనం ఏమి చేయాలి? శరణాగతి! ఆయన్నే చింతన చేయడం, ఆయన్నే ఆశ్రయించడం, ఆయనయందు నిష్ఠ కలిగి ఉండడం, కనపడుతున్నవన్నీ కూడా అశాశ్వతములే, శాశ్వతము ఆయనే అనేటువంటి వైరాగ్యపూరితమైన భగవత్ప్రేమ కలిగి ఉండడమే శరణాగతి! అదే జ్ఞానం! శుద్ధ శరణాగతి రూపమైన ప్రేమభక్తి, శుద్ధ జ్ఞానం కలిసిపోతాయి! ఇదే కృష్ణపరమాత్మ ఉద్ధవగీతలో చెప్తారు.**

ఆత్మను తెలుసుకునే జ్ఞానం ప్రేరేపింపమని శరణు వేడుతున్నాము! **బుద్ధిని ప్రేరేపించేవాడే భగవానుడు!** బ్రహ్మదేవుడికి కూడా జ్ఞానం ఇచ్చాడు అంటే, అన్నివిధాలా మహాన్, **సర్వాపేక్షయా మహాన్**

9) దక్షిణ అంటే సరళ, ఉదార!

సరళం అంటే త్రికరణములూ ఒకేలా ఉండడం! నిర్మల అంతఃకరణం! ఇదే నిష్కపటం, ఏ మాయా లేనివాడు, మాయాతీతుడు! **భగవానుడు నిరస్తకుహకః** అనే మాట భాగవతము చెప్తున్నది. కపటం అంటే ఒకదాని బదులు ఒకటే కదా!

భక్తుల పట్ల సరళంగా అనుగ్రహిస్తాడు!

ఉదారత అంటే దాపరికం లేని దేవుడు! అనుగ్రహించే దేవుడు!

మనం అడిగాము అనా ఇవన్నీ అనుగ్రహించాడు!

10) దక్షిణః అంటే నిపుణః అని అర్థం!

ఏ వృత్తిలో ఉన్నా నిపుణత్వం చూపించగలగాలి! ఆ నైపుణ్యం ఈశ్వరానుగ్రహము!

నైపుణ్యానికి దేవుడు దక్షిణామూర్తి!

నిపుణః అంటే ఇక్కడ ఏమి చెప్తున్నారంటే అందరికంటే విశిష్టంగా చేయగలగడం! సృష్టి, స్థితి, లయలు చేయగలడు భగవానుడు! మనం చేయగలమా? ఎవడి వల్ల సృష్టి, స్థితి, లయలు జరుగుతున్నాయో, ఎవరికి అవి లేవో, ఎవరు వీటియందు వ్యాపించి ఉన్నారో, ఎవరికి ఇవేవీ అంటవో ఆయన ఈశ్వరుడు!

**దక్షిణామూర్తి:**

దక్షిణ అభిముఖంగా కూర్చున్న విగ్రహం కలవాడు - స్థూలార్థం

ఇందులోని సంధిలో ఉన్నది అద్భుతం!

పైన చెప్పిన దక్షిణ విషయాలన్నీ మూర్తి కడితే ఆ మూర్తి దక్షిణామూర్తి! దాక్షిణ్యము రూపు కడితే దక్షిణామూర్తి! అందుచేత కదా విషాన్ని నిగ్రహించి నిలబడ్డాడు స్వామి!

శ్రీదక్షిణామూర్తి అనడంలో ప్రత్యేకత ఉన్నది!

సురేశ్వరాచార్యులవారు చక్కటి నిర్వచనం చూపించారు.

"తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే" - రెండు మార్లు "శ్రీ" ఎందుకు ప్రయోగించారు?

జ్ఞానానికి ఉన్న అందం దేనికి కూడా లేదు! కనుక బ్రహ్మజ్ఞానమే సౌందర్యం! అదే సౌందర్యలహరి!

జ్ఞాన, ఆనంద రూపమైన శోభ శ్రీ అది కలవాడు శ్రీదక్షిణామూర్తి!

దక్షిణామూర్తిని గురుమూర్తి అని ఎందుకు అంటారు?

సచ్చిదానంద మూర్తి, గుర్వి అంటే అతిమహత్తరమైన అటువంటి స్వరూపం కావున శ్రీగురుమూర్తి అన్నారు!

"గురు" పదానికి చాలా అర్థాలు ఉన్నాయి, కానీ సూటి అర్థం ఉపనిషత్తు చెప్తున్నది, "తన శిష్యులకు యథార్థ జ్ఞానం చెప్పే వారి"ని గురువు అనాలి! ఆదిగురువు ఆయన, ఆయన వెలుగు వారి మీద పడితే మిగిలినవారు గురువులవుతారు!

"గురు" అంటే గొప్ప, అందుచేత గౌరవభావం!

ఆకృతి ధరించినప్పుడు ఎలా ఉన్నాడు? మునుపు చెప్పిన లక్షణాలన్నీ కలబోసి వచ్చాడు!

దక్షిణామూర్తి అనే మాటలో సంధి

దక్షిణా మూర్తి

దక్షిణ అమూర్తి

పారమార్థికంగా రూపరహితుడు, భక్తుల కోసం రూపు ధరించాడు! అందుచేత దక్షిణుడు కానీ అమూర్తియే!

దక్షిణుడు మూర్తి ధరించాడు!

సర్వ దాక్షిణ్య భావములూ ఆయనని తలంచితే అర్ధములై (ప్రయోజనములై) లభిస్తాయి!
ఆ మూర్తి దాక్షిణ్య స్వభావ మూర్తి, ప్రభావ మూర్తి కూడా!
ఆయనకి అది స్వభావం, ఆయన అనుగ్రహిస్తే మనకి ప్రభావం!

**దక్షిణుడు మూర్తియా? అమూర్తియా?**

సగుణుడు అని చెప్తే దక్షిణామూర్తి, నిర్గుణుడు అని చెప్పినప్పుడు దక్షిణ, అమూర్తి! స్వతహాగా నిర్గుణుడు అయినప్పటికీ కూడా భక్తులని అనుగ్రహించడం కోసం తనదైన సచ్చిదానంద లక్షణాన్ని తెలియచేయడానికి మూర్తి ధరించాడు! ఆ మూర్తి కూడా తనదయిన ఈశ్వర లక్షణాన్ని తెలియచేయడానికి ధరించిన మూర్తి! అందుకే మూర్తి, అమూర్తి లక్షణాలు కనపడుతున్నాయి.
శ్రీదక్షిణామూర్తి నామ వివేచన, విచారణ చేస్తే అది జ్ఞానానికి, మోక్షానికి హేతువు అవుతుంది!
నామము యోగము చేసుకోవాలంటే ఉచ్చారణ నుండి విచారణకి వెళ్లి ఆ జ్ఞానాన్ని స్మరణ చేసుకోవాలి! (నామయోగ ప్రవచనం)

రామతీర్థయతి అంటారు, దక్షిణామూర్తిని ఎలా ధ్యానించాలి అంటే రెండు విధాలుగా ధ్యానించాలి! గురువుగా, దేవతగా కూడా ధ్యానించాలి! ఇక్కడ దేవత అంటే ఉపాస్య దేవత! సగుణబ్రహ్మరూపం!
ఉపాస్య దేవత అంటే దేవతలందరికీ నియామకుడు అయిన ఈశ్వరుడు ధరించిన రూపములు, మంత్రములు ఉపాసించడం!

దక్షిణామూర్తిని కొలుచుకుంటే సర్వసమర్థుడు కనుక అన్నీ ఇస్తాడు, ఆఖరికి ఇంకా మోక్షం అడగవేంటి అంటారు, నాకర్థం కాలేదు స్వామీ అంటే, అర్థమయ్యే జ్ఞానం కూడా ఇస్తాడు, క్రమంగా పరమార్థమైన మోక్షం ప్రసాదిస్తాడు!

"తస్మై" అనేమాట గొప్పది! "సః" శబ్దం చతుర్థీ విభక్తితో తస్మై అవుతున్నది! అది కూడా "తత్" శబ్దమే కదా! ఆ తచ్ఛబ్ద వాచ్యుడైన పరబ్రహ్మము! గాయత్రీమంత్రం ప్రకటించే పరమాత్మయే!
తత్ శబ్ద వాచ్యుడు అయిన ఏ బ్రహ్మము ఉన్నాడో అతడు భక్తులను అనుగ్రహించడానికి తనదయిన దాక్షిణ్య స్వభావంతో మూర్తి ధరించాడు కదా! అటువంటి స్వామికి నమస్కారం అన్నారు!

**నమస్కారం అంటే ఏమిటి?**
భగవంతుని ముందర మనల్ని మనం అల్పులుగా భావించడమే కాకుండా, నేను, నాది అనే భావం కూడా ఈశ్వరార్పణ చేయాలి! అప్పుడు "నేను" ఈశ్వరుడై అహం బ్రహ్మాస్మి స్థితికి వెళతాం!
నమః శబ్దం అంత గొప్పది!
అహంకారం అణుచుకోవడం కోసం ముందర -> అణచిన అహంకారాన్ని అర్పించడానికి వాడి -> అహం బ్రహ్మమే అని గ్రహించడానికి కూడా వినియోగించుకోవచ్చు!

దక్షిణామూర్తి ఋషి కూడా!
ఋషి అంటే మంత్రాన్ని దర్శించి ఇచ్చేవాడు!
విశ్వాధికో రుద్రో మహర్షి: అంటున్నది ఉపనిషత్తు!
ఋషి అంటే మంత్రప్రవర్తకః మంత్రద్రష్టః

ద్రష్ట ఆయన ఒక్కడే అని ఉపనిషత్తు అంటున్నది కదా, అందుచేత ఋషి ఈశ్వరవాచ్యం! ఆయన అనుగ్రహం పొంది మరలా మంత్రములు దర్శించి ఇచ్చినవారిని ఋషి అంటున్నాము!

స్వామి అన్నీ మంత్రాలని అనుగ్రహించాడు కదా పంచముఖాలతో!

లౌకిక, పారలౌకిక, పారమార్థిక ప్రయోజనాలు అందించడానికి కావలసిన మంత్రాలన్నీ ఆయన నుండి వచ్చాయి!

ఆమ్నాయములన్ని ఆయన ముఖాలే, వాటి నుండే మంత్రాలన్నీ వచ్చాయి!

సర్వమంత్రములు శివుడి నుండే వచ్చాయి, ఆ మంత్రం స్వరూపం స్వామియే!

ఆమ్నాయములన్ని కలిసి షడ్ ఆమ్నాయముల విద్య శ్రీవిద్య!

శ్రీవిద్యా శాస్త్ర ప్రవర్తకుడు స్వామి! అమ్మవారి భక్తులకు గురుస్వరూపం స్వామి!

"శ్రీ గురుర్ దక్షిణామూర్తి: దక్షమార్గ ప్రవర్తకః" అంటున్నారు!

శ్రీవిద్యా ప్రవర్తకుడు హయగ్రీవ స్వామి కూడా! ఉభయులూ కూడా దక్షమార్గ ప్రవర్తకులు!

వామ ఆచారానికి ఆనందభైరవుడు!

ఏ విద్యకి అదే గొప్ప! తన సంప్రదాయం మీద గౌరవం ఉండవచ్చు మరొకదాన్ని తక్కువగా చూడరాదు!

నీ గురువు క్రమంలో నీకు ఏది వచ్చిందో అదే సత్సంప్రదాయం!

శ్రీచక్రంలో కూడా ఈ వివిధ సంప్రదాయాలు ఉన్నాయట!

హయగ్రీవ సంప్రదాయంలో శ్రీచక్రంలో వృత్తములు ఉండవు!

శ్రీదక్షిణామూర్తి సంప్రదాయంలో వృత్తత్రయం ఉన్నది!

అమూర్తి అంటే పరమార్థతః ఆకారం లేనివాడు! స్థూలము కాదు, అణువూ కాదు! గాడ్ పార్టికల్ అంటే అంతకంటే అజ్ఞానం లేదు! పార్టికల్ అయితే గాడ్ యే కాదు! భౌతిక విద్యలకు పరమాత్మ దొరుకుతాడా?

మూర్తి ఘనరూపం ధరిస్తాడుట! ఏమిటా ఘన రూపం అంటే చరాచరజగత్తు! సర్వ జగత్తూ ఆయన రూపమే!

సర్వ జగత్తూ ఆయన యొక్క ప్రకటనమే! నామరూప జగత్తంతా ఆయన రూపమే!

చరాచరవిశ్వమూర్తి దక్షిణామూర్తి!

సహస్రంలో వస్తుంది ఈ మాట!

భగవంతుడు ఎందుకు మూర్తి ధరిస్తాడు అన్న విషయం, శృతి ఏమని చెప్తున్నదంటే, ఎవరైతే ఆయనకోసం తపించిపోతున్నారో అంటే తపస్సు చేయడం, నియమబద్ధంగా పరమేశ్వర ప్రాప్తి కోసం స్వామీ నువ్వు తప్ప నాకేమీ అక్కర్లేదు అనే తపన ఉన్నది కదా, ఆ శుద్ధ తపన కోసం తనని తాను వ్యక్తపరచుకుంటాడు! అలా భగవానుని మూర్తి కలిగినది!

దక్షిణ అమూర్తి అనుగ్రహించడానికి దక్షిణామూర్తి అయ్యాడు అంటూ ఆ నామంలో పరమేశ్వర సగుణ, నిర్గుణ తత్త్వములు చెప్తున్నారు!

నిర్గుణముగా అమూర్తి అయినవాడు సగుణముగా విశ్వరూపుడు! అంతేకాక భక్తులను అనుగ్రహించడానికి ధరించిన రూపం!

**స్వామి యొక్క మౌనం**

మౌనం గురించి చాలా మాట్లాడుకోవాలి! ఆ స్థితి కోసం బోలెడు మాట్లాడుకోవాలి!

ఏమీ తెలియని వాడు ఏమీ మాట్లాడలేడు, అన్నీ తెలిసినవాడు ఏమీ మాట్లాడడు!

మౌనం అనే మాట చాలా విశేషం!

ముఖంలో నవ్వు ఎప్పుడూ ఉన్నది! ఆనందమే తాను అయినవాడు ఆనంద చిహ్నమైన చిరునవ్వు నవ్వుతున్నాడు!

ప్రసన్నమైన ఆనందం ఉన్నప్పుడు చిరునవ్వు ఉంటుంది!

మందహాసం ఎందుకు? స్వాత్మారామ స్థితిని తెలియచేస్తున్నది, స్వాత్మారామ అనుభవ స్థితి!

బ్రహ్మతత్త్వం ఎలా చెప్పాడు? మౌనంతో

యతో వాచ్య నివర్తంతే అప్రాప్య మనసా సః

మాటతో తెలుసుకోవలసినవన్నీ తెలుసుకుని కూర్చున్నారు బ్రహ్మవేత్తలు! అందుచేత!

"మాటను మనసును దాటినా తేటతెలివి ఏదో వాటముగా మౌనముతో వ్యాఖ్య చేసినాడు" అంటారు గురుదేవులు!

"కూటస్థం అచలం ధృవం"

వికారాలు లేకుండా ఉండడం అచలం

ఎప్పుడూ ఉండడం ధృవం

మరి జగత్తు? వికారాలతో ఉన్న జగత్తు నిర్వికారుడు అయిన ఆయన్ని ఆధారం చేస్కుని ఉన్నది. ఆ ఆధారం కనుక కూటస్థం! ఆయన లేకపోతె జగత్తే లేదు, ఆయనకి ఆ వికారాలు లేవు!

అంతేకాక కూటములో ఉన్నాడు కనుక కూటస్థుడు! మన ఇంద్రియ, ప్రాణ, ఆలోచనల కూటములతో ఉన్న దేహం మధ్యలో ఉన్నవాడు కూటస్థుడు! వికారాలు కూటానికే, కూటస్థుడికి లేవు!

"కూటస్థుడు నాకిదిగో గురి అయి గురుపైనాడు" అంటారు గురుదేవులు!

ముని యొక్క భావం మౌనం!
మౌనం అనేది మనోలక్షణం!
రామకృష్ణపరమహంస అంటారు తుమ్మెద పువ్వు చుట్టూ చప్పుడు చేస్తూ ఉంటుంది, మకరందం ఆస్వాదించేటప్పుడు మౌనంగా ఉంటుంది! కనుక అనుభవం వరకూ వాక్కులు, అటుపై వాక్కులు అణగిపోతాయి! నిర్వాకార స్థితియే మౌనం! అందులో ఉండేవాడు ముని!

బ్రహ్మానంద సుఖప్రాప్తికి హేతువు మౌనమే!
ప్రాపంచిక విషయాల కల్లోలాలు లేని స్థితియే మౌనం! అది అంత తేలిక కాదు! కానీ అసాధ్యం కాదు! సాధనతో పొందవలసినది! బ్రహ్మానంద అనుభవ స్థితి! బ్రహ్మానంద అభిముఖంగా ప్రయాణించేవాడు కూడా మౌనాన్ని ఆశ్రయించాలి!
ఎంత మౌనంగా ఉంటే మనలోని భగవంతుడికి అంత దగ్గర అవుతాము!
మాట్లాడాము అంటే సంగం కదా, సంగం పెరుగుతున్న కొద్దీ పరమాత్మకు దూరం అవుతాము! మరి సంగం వదులుకోలేకపోతే సత్సంగం పెట్టుకోవాలి, సత్సంగ ప్రభావం నిస్సంగం ఏర్పడుతుంది! నిస్సంగ స్థితియే మౌనం, నిర్వికార స్థితియే మౌనం, అదే కూటస్థం, అచలం, ధృవం!

**యతో న వేదా మనసా నహైనా మనుప్రవిశ్యన్తి తతస్య మౌనం**
వేదములు మనస్సుతో సహా దేనియందు ప్రవేశించలేవో అది మౌనం!
ఇది కాదు ఇది కాదు అని నిషేధించగా దేన్ని నిషేధించాలేమో అది బ్రహ్మము, మౌనము! దానితో ప్రకాశిస్తున్నారు స్వామి!

మనస్సుకు మౌనం అలవాటు చేయాలి! ఇది మానసిక తపస్సుగా చెప్పారు కృష్ణపరమాత్మ! ముందర మాట నిగ్రహించుకుంటే అప్పుడు మనస్సు నిగ్రహింపబడుతుంది!

మాధవ శబ్దానికి అర్థం చెప్తూ, మౌనముతో, ధ్యానముతో తెలియబడువాడు మాధవ! మౌనం కుదిరితే ధ్యానం కుదురుతుంది! ఆ స్థితియే బ్రహ్మమును తెలియచేస్తుంది

మౌనం ప్రయోజనం - వాఙ్మనసాతీత పదము పొందుట.

**నీలకంఠ పండితుల వ్యాఖ్యానం మౌనం గురించి**

మౌనం అంటే బాహ్యేంద్రియ నిగ్రహం మనోనిగ్రహం కలిపి మౌనం అనాలి! అప్పుడు మాటకి మనసుకి అందని బ్రహ్మానందం లభిస్తుంది! అంతగొప్ప దానికోసం ఆ మాత్రం ప్రయత్నం చేయకపోతే ఎలా?

బాహ్యేంద్రియ నిగ్రహం మనోనిగ్రహం వల్ల -> మౌనం -> క్రమముగా బాహ్య అభ్యంతర ప్రపంచం (బయట జగత్తు నువ్వు మనస్సులో కల్పించుకున్న జగత్తు) ఉండదు, లయిస్తుంది -> అధిష్ఠాన బ్రహ్మము లభ్యము అవుతుంది!

అది పొందడానికి సాధన -> బాహ్యేంద్రియ నిగ్రహం మనోనిగ్రహం చేయడం!

మౌనం ఒక అర్థం - బ్రహ్మము మాటకి మనస్సుకి అందనిది

మౌనం మరో అర్థం -> బాహ్యేంద్రియ నిగ్రహం మనోనిగ్రహం వల్లనే జగదతీతమైనా బ్రహ్మము తెలియబడుతున్నది

శంకరులు సనత్సుజాతీయ భాష్యంలో చెప్పారు - తత్ శబ్ద వాచ్య విషయమే మౌనమునకు విషయం! పైన చెప్పిన నీలకంఠ పండితుల వ్యాఖ్యానం దీనికే!

**ఉపాసనా దృష్టిలో మౌనం (శ్రీవిద్యా పరంగా)**

దక్షిణామూర్తి అంటే శ్రీవిద్యా సంప్రదాయానికి ఆదిగురువు కదా! స్వామి అనుజ్ఞని తీసుకునే శ్రీచక్ర అర్చన చేస్తారు!

శివాదిశ్రీగురుభ్యోనమః అంటున్నాము కదా!

శ్రీవిద్య లేదే అనుకోవక్కర్లేదు, దేని ద్వారా మనం తరిస్తామో అదే "శ్రీ" విద్య అవుతుంది స్వామి తెలియచేసాడు!

అనేక జన్మల పుణ్యం ఉంటే షోడశాక్షరీ వస్తుంది, దానికి ముని దక్షణామూర్తి! "ముని" అన్నారంటే మౌనమే తన స్వభావంగా, ప్రబోధముగా కలిగినవాడు ఋషి! దేవత శ్రీమత్ త్రిపురసుందరీ!

షోడశాక్షరి వచ్చేటప్పటికి దక్షిణామూర్తి "ముని" అన్నారంటే, ఈ మంత్రము ఉచ్చరారహితం అన్నారు! ఉచ్చరించే మంత్రములన్ని వాచికములు, ఈ శ్రీవిద్యా షోడశాక్షరి మాత్రం ఉచ్చార రహితము! ఎంత మౌనంగా చేస్తే అంత మంచిది! ఇది స్థూలంగా చెప్పే అర్థం!

ఉచ్చారరహితమైన వస్తువు శ్రీషోడశాక్షరి అంటున్నారు, అంటే నామరూపాలు అతీతమైన బ్రహ్మమే!

అక్షరాలు ఉన్నప్పటికీ శ్రీషోడశాక్షరి ప్రతిపాదించేది మాత్రం నిరక్షరం, నేరుగా బ్రహ్మమునే చెప్తున్నది!

షోడశాక్షరి ఇచ్చినవాడు కనుక ఆయన ఇచ్చే వస్తుతత్త్వాన్ని చెప్తూ మౌనంగా ఉన్నారని చెప్తున్నారు!

ఎవడు కామేశ్వరుడు అని చెప్పబడుతున్నాడో ఆయనే దక్షిణామూర్తి!

లలితామహాత్రిపుర సుందరి ఎవరు కామేశ్వరుడి పత్ని! సృష్టి చేయాలని సంకల్పించిన కామేశ్వరుడే దక్షిణామూర్తి!

కామేశ్వరుడైన శివుడే తన తత్త్వం తెలుసుకోవడానికి తానే ఇచ్చాడు శ్రీవిద్యని! ఆ ఇచ్చేటప్పుడు దక్షిణామూర్తిగా ఇచ్చాడు! అసలు కామవిద్య అంటేనే కామేశ్వరుడు ఇచ్చిన విద్య!

నలుగురు యుగనాథులు ఉంటారు, వారు కామేశ దేవునిచే సృజింపబడ్డారు, మిత్రేశ, ఉడ్డీశ, షష్టీశ ఆచార్యులు! మొదట కామేశ్వరుడు!

ఆ కామేశనాథుడే మహాగురునాథుడైన దక్షిణామూర్తి!

**బ్రహ్మసూత్ర భాష్యము - ఉభయలింగాధికారణం (శంకర భాష్యం)**

భాష్కలి అనేటువంటి శిష్యుడు బ్రహ్మవేత్త అయిన గురువుని అడిగాడు, బ్రహ్మమును గురించి నాకు తెలియచేయి అన్నాడు, గురువు మాత్రం మౌనముగా ఉంటున్నారట, ఎన్నిమార్లు అడిగినా అలాగే ఉన్నారట! మూడుమార్లు అడిగాక కష్టపడి ఈ మౌనమే సమాధానం నాయనా అని ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్తున్నారట, "ఉపశాంతోయమాత్మా" అన్నీ ఉపశమించాక ఏది ఉంటుందో అది ఆత్మ అన్నారట!

మాటలతో చెప్పే ఏ వస్తువు అయినా జగద్విషయమే! ఈ మాటకి మనస్సుకి అందే జగత్తు అంతా లయించిపోయాక ఏది ఉంటుందో అదే ఆత్మ!

ప్రపంచోపశమం శాంతం అంటే కూడా ఇదే!

ఉపశాంతి = ద్వైతభావం లయించిపోవడం

నామరూపములు లయించాక మిగిలేది అద్వైతమే!

**చిన్ముద్ర**

మౌనానికి మరో రూపం!

చిన్ముద్ర, మౌనం, చిరునవ్వు ఈ మూడు చూసేటప్పటికి వారికి సంశయాలు పటాపంచలు అయ్యాయి!

దేవతకయొక్క లక్షణాన్ని ముద్రతో చూపిస్తారు!
తన మౌనాన్ని చిన్ముద్రతోనే బోధించాడు స్వామి!
"స్వాత్మానమ్ ప్రకటీకరోతి యోముద్రయా భద్రయా" - ఆత్మతత్త్వాన్ని భద్రమైన ముద్రతో ప్రకటిస్తున్నారు
చిన్ముద్ర/వ్యాఖ్యాముద్ర/జ్ఞానముద్ర/విద్యాముద్ర/బోధముద్ర అని ఎన్నో పేర్లు దీనికి!

**చిన్ముద్ర అంతరార్థం**

"**అంగుష్ఠతర్జనీయోగ ముద్రావ్యాజేన దేహినాం శ్రుత్యర్థం బ్రహ్మజీవైక్యం దర్శయన్నోవతాత్ శివః** "



అంగుష్ట తర్జనీ యోగమే చిన్ముద్ర! ఈ రెండిటి యోగము ద్వారా వేదము యొక్క హృదయం అనగా బ్రహ్మ, జీవ ఐక్యం తెలియచేస్తున్నాడు స్వామి! అటువంటి స్వామి మనల్ని రక్షించుగాక!
వేదము యొక్క పరమ తాత్పర్యం బ్రహ్మ జీవ ఐక్యం! జీవుడి యొక్క పరమలక్ష్యం అదే! అది పొందేవరకూ రకరకాల ఆర్భాటాలు ఉంటూ ఉంటాయి!

అంగుష్ఠం తత్పదం ప్రోక్తం - అంగుష్ఠం తత్ అనే పదాన్ని తెలియచేస్తున్నది, తత్ అనగా బ్రహ్మము, అనిర్వచనీయం! తెలుగులో "అది" అని అర్థము!

తర్జనీ త్వంపదం స్మృతం - తర్జనీ "త్వం" ని చెప్తున్నది! త్వం అంటే జీవుడు! గురువు చెప్పేటప్పుడు "నువ్వు" అంటారు, మనం "నేను" అనుకోవాలి.
తయో సంధి: తయోరైక్యం చిన్ముద్రా సా ప్రకీర్తితా - త్వం అని చెప్పబడుతున్న జీవుడు, తత్ అని చెప్పబడుతున్న బ్రహ్మము అజ్ఞాన దశలోనే విడిగా ఉన్నాయి, జ్ఞానదశలో రెండూ ఒకటే! అప్పుడు ఒకటే ఈశ్వరుడు, అది పూర్ణత్వం అవుతున్నది! రెండిటి కలయిక రెండిటి ఐక్యాన్ని చెప్తోంది! జ్ఞానం అంటే అదే!
"అహం బ్రహ్మాస్మి" లేదా "తత్త్వమసి" అదే చూపిస్తున్నది చిన్ముద్ర!
మౌనానికి ఎంత అర్థమో చిన్ముద్రకి అంత అర్థం!

**విద్రావితాశేష తమోగుణేన ముద్రావిశేషేణ ముహూర్మునీనాం**
**నిరస్య మాయాం దయయా విధత్తే దేవో మహాంస్తత్త్వమసీతి బోధం**

అశేష తమోగుణంతో ఉన్నటువంటివారికి తమోగుణం సంపూర్ణంగా పోగొట్టే ముద్ర! తమోగుణం అంటే సత్యాన్ని తెలుసుకోనివ్వని పెనునిద్ర! చుట్టూ ఆశ్రయించిన మననశీలురైన మునులకు (సాధన దశలో ముని అంటే మననశీలురు, సిద్ధ దశలో ముని అంటే బ్రహ్మానుభవం పొందినవాడు) మాయను తొలగించాడు! మౌనం మాత్రంచేత, చిన్ముద్ర మాత్రం చేత, చిరునవ్వు మాత్రం చేత అజ్ఞానం తొలగించాడు! ఎలా? దయతో తొలగించాడుట!
గురువుకు దయ లేకపోతే శిష్యుడు ఎక్కడ తరిస్తాడు!
తత్త్వమసి వాక్యమే చిన్ముద్రలో ఉన్నది!
అంగుష్టం = తత్ (ఈశ్వరుడు)
తర్జని = త్వం (జీవుడు)

మిగిలిన మూడువేళ్ళు = జగత్తు, మూడు అవస్థలు, మూడు శరీరాలు, మూడు లోకాలు, మూడు కాలాలు, త్రిగుణాలు, తాపత్రయాలు... ఇలా భిన్నమైనవన్నీ ప్రపంచ విషయాలే! (శ్రీకాళహస్తి అన్వయం కూడా గుర్తు ఉంచుకోవాలి)

జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఈ మూడింటి గురించి విచారణయే ఆధ్యాత్మికత!

జగత్తుతో ముడిపడినవాడు జీవుడు! జగత్తుతో (మిగిలిన మూడు వేళ్ళు) మమైకం అయినంత కాలం దానితోనే ఉన్నాడు! అటువంటి వాడు జీవుడు! ఈ మమేకం ఇప్పటిదా? కాదు కదా! జన్మలలలల నుండి ఉన్నది, అందుకే అంత తేలికగా వదలదు! గురుబోధ వల్ల ఎవడో ఒకడికి కాస్త బుద్ధి తిరిగి అంతటికి ఆధారమైనదాన్ని (అంగుష్టం) చూసాడు! తెలుసుకుని క్రమంగా ఆయనకీ అభిముఖంగా ప్రయాణం చేస్తూ ఉన్నాడు! ప్రపంచం నుండి ఎంత దూరమైతే ఈశ్వరుడికి అంత దగ్గరవుతాడు! పూర్తిగా దగ్గరైతే పూర్ణమయింది. పూర్ణమయ్యాక మూడింటితో కలయిక లేదు! కనుక "త్రి" "త్రి" అవన్నీ ప్రపంచమే, వీటినుండి మరలి, దృష్టిని పరమాత్మ వైపు తిప్పి అదొక్కటే సత్యమని తెలుసుకుని, అంతఃకరణంలో ప్రతిబింబిస్తున్న ఆ చైతన్యం ఈశ్వర స్వరూపమని తెలుసుకుని తాను ఆ ఈశ్వరుడితో తాదాత్మ్యం చెంది, త్వం తత్ అవుతున్నాడు, అహం బ్రహ్మ అవుతున్నాడు, ఆ స్థితిలో ఆయన జగత్తులో ఉన్నా జగత్తుకి అతీతంగా ఉంటాడు! ప్రపంచం తాను అనే భ్రాంతి వదిలి బ్రహ్మముతో తాదాత్మ్యము చెందిన జీవన్ముక్తిది స్థితి చిన్ముద్రలో చూపించిన మహర్షులకి నమస్కరించుకోవాలి. ఇంత విజ్ఞానాన్ని చిన్ముద్రలో చూపించిన ఆదిమహర్షి, బ్రహ్మవిద్యకు ఋషి అయినటువంటి దక్షిణామూర్తికి నమస్కారం!

**చిన్ముద్ర మరో కోణం:**

అంగుష్టం, తర్జని నామరూపాలు!

మిగిలిన మూడు వేళ్ళు = సత్ (అస్తి), చిత్ (భాతి), ఆనందం(ప్రియం)

ఈ నామరూపాలకు అందము, ఐశ్వర్యము ఈశ్వరుడి వల్లనే! అటువంటిది ఆయనను మర్చిపోయి ఈ నామరూపాలే పట్టుకుని తిరుగుతున్నాము! ఈ నామరూప జగత్తువల్ల రాగద్వేషాలు పెరుగుతున్నాయి! మరి ఏమి చేయాలి? అవి విడిచిపెట్టమని కాదు! కానీ నామరూపాలకి అతీతంగా మరో వస్తువు ఉన్నది, దానికి మూడు లక్షణాలు సత్, చిత్, ఆనందం! అది ఎప్పుడూ ఉంటుంది, దాని స్వరూపమే జ్ఞానం, దాని లక్షణమే ఆనందం! అదే బ్రహ్మము!

బ్రహ్మము ఎక్కడ ఉన్నది? నామరూపాల జగత్తులో లీనం అయి ఉన్నది!

అది ఎలా తెలియబడుతుంది? నామరూపాలు ఉన్న జగత్తుని ఉపసంహరించాలి!

అప్పుడు బ్రహ్మము తెలియబడుతుంది. ఒక పత్రంలో ఈనెని తీసినట్లుగా నామరూపాత్మకం అయిన జగత్తు నుండి బ్రహ్మమును బయటికి తీయి అంటున్నారు!

**బ్రహ్మమును జగత్తును వేరు చేయడం అంటే ఏమిటి?**

ఇక్కడ వేరు చేయడం అంటే పదార్థంగా వేరు చేయడం కాదు బుద్ధితో, విచారణతో వేరు చేయడం! బ్రహ్మము లక్షణములు ఏమిటో తెలుసుకుని జగత్తుని వేరు చేయాలి!

అస్తి = ఎప్పుడూ ఉండటం/సత్

భాతి = ప్రకాశించడం/చిత్ (జ్ఞానము, ప్రతీది పోల్చగలిగే చైతన్యం)

ప్రియం = ఆనందం

ఈ మూడూ బ్రహ్మలక్షణాలు!

నామరూప జగత్తులో ఆయన ఉంటాడు కానీ ఆయనకి అవి ఉండవు!

అస్తి, భాతి, ప్రియం, నామము, రూపము మొత్తం అయిదు, అందుకే మనకి అయిదు వేళ్ళు ఇచ్చాడేమో భగవంతుడు!

అస్తి, భాతి, ప్రియం = బ్రహ్మము (మూడు వేళ్ళు)

నామం రూపం = అంగుష్టం, తర్జని

నామం, రూపం ఉపసంహరించాక మిగిలినది ఏమిటి? అస్తి, భాతి, ప్రియం, అదే బ్రహ్మము!

**దక్షిణామూర్తి వర్ణం**

తెల్లని స్వామి అట! ఎలాంటి తెలుపు? అంటే గోక్షీరం అన్నారు, స్ఫటికంలా అని కూడా చెప్పారు!

స్ఫటికంలా అంటే ఆయన క్లారిటీ

తెల్లని వాడు అంటే శుద్ధ సత్త్వగుణంతో ఉన్నవాడు అని అర్థం! ఏ గుణమూ లేనివాడు భక్తుడిని అనుగ్రహించేటప్పుడు రజోతమో గుణ వికారాలు లేని శుద్ధసత్వగుణంతో రూపాన్ని స్వీకరిస్తాడు! అటువంటి శుద్ధసత్త్వగుణాన్ని ఉపాసిస్తే క్రమంగా రజోతమో వికారాలు వదిలిపోయి శుద్ధసత్త్వ గుణం యొక్క దయవల్ల గుణాతీత స్థితికి వెళతాము!

తెలుపు జ్ఞానానికి సంకేతం! "తేటతెల్లంగా చెప్పడం" అని వింటూ ఉంటాము! అంటే ప్యూరిటీ, క్లారిటీ/స్వచ్ఛత, స్పష్టత!

చతుర్భుజాలు - నాలుగు దిక్కులా వ్యాపించింది తానే అని చెప్పడానికి

అమృతకలశం - విద్య వల్ల దొరకవలసినది అమృతమే కాబట్టి (విద్యయా అమృతమస్నుతే)

అక్షమాల - అక్షరములన్నీ మంత్రముల్లా ఉపాసన చేయండి అని చెప్తూ పట్టుకున్నాడు

పుస్తకం - సర్వశాస్త్ర సారం

వీరాసనం - అపస్మారుడిని తొక్కుతున్నాడు! అజ్ఞానాన్ని తొక్కి ప్రకాశించే జ్ఞానం

జటాజూటం - సర్వవిద్యలే శాఖలుగా కలిగిన జటాజూటం యొక్క స్వరూపం

చంద్రకళ - శాశ్వతత్వం, అమృతత్వం

**సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు**

# శ్రీదక్షిణామూర్తి 5వ రోజు (6/16/2021)

శివాయగురవేనమః శ్రీమాత్రేనమః శ్రీవిష్ణురూపాయ నమఃశివాయ

శ్రీకాళహస్తీశ్వరాయ నమఃశివాయ

శ్రీదక్షిణామూర్తయే నమఃశివాయ

**ఉపాసకానాం యదుపాసనీయం**

**ఉపాత్తవాసం వటశాఖిమూలే**

**తద్ధామ దాక్షిణ్యజుషాస్వమూర్త్యా**

**జాగర్తిచిత్తే మమ బోధరూపం**

**నిన్నటి స్మరణ:**

దక్షిణామూర్తి రూపంలోని అంతరార్థం, ముఖ్యంగా చిన్ముద్ర, మౌనం అంతరార్థాలు తెలుసుకున్నాము!

దక్షిణామూర్తి యొక్క శ్రీవిద్యా తత్త్వం! శ్రీవిద్యకి గురువు దక్షిణామూర్తి! శ్రీవిద్యలో దక్షిణామూర్తి మంత్రం ఉంటేనే అని కాదు, శ్రీవిద్యయే దక్షిణామూర్తి స్వరూపం! స్వామియే ప్రసాదించినది శ్రీవిద్య!

హయగ్రీవ స్వామి అగస్త్య మహర్షితో ఈ విధంగా చెప్పారు: లోకాలని రక్షించడానికి వచ్చిన గురుస్వరూపులు నలుగురు! వారిని ఎవరు సృజించారు అంటే కామేశ్వరుడు!

అనగా పరమేశ్వరుడు! సృష్టిని చేయాలని సంకల్పించిన పరమేశ్వరుడు కామేశ్వరుడు ఆయన శక్తి కామేశ్వరి!

కాది విద్య అంటే కేవలం మన్మథుడు ఉపాసించిన విద్య అని మాత్రమే కాదు, కామేశ్వరోపాసిత విద్య!

కామేశ దేవునిచే సృజింపబడిన యుగనాథులు: మిత్రేశ, ఉడ్డీశ, షష్టీశ, చర్య

ఈ నలుగురు ప్రథమ యుగనాథులు, వారిలో ప్రథముడు కామేశ్వరుడు ఆయనే దక్షిణామూర్తి!

శ్రీవిద్య = శివశక్త్యాత్మక విద్య!

తాను, తన శక్తి కలిసి ఉన్నటువంటి ఏ తత్త్వం ఉన్నదో దాన్ని ఉపదేశించిన కామేశ్వరుడే దక్షిణామూర్తి!

దక్షిణ శబ్దానికి చెప్పిన అర్థాలన్నీ పరమేశ్వరునియందు పర్యవసిస్తున్నాయి! ప్రతీదాని అర్థం పరమేశ్వరుని దివ్యత్వాన్ని ప్రకటిస్తున్నది అందుకే దక్షిణామూర్తి మహామంత్రం అయినది!

**దాక్షిణ్యం = దక్షిణస్య భావం దాక్షిణ్యం**

దయ, దాక్షిణ్యాలు అంటూ ఉంటాము! ఇవి రెండూ ఈశ్వర గుణాలు!

దయ, దాక్షిణ్యం = కరుణ, సమర్థత

ఈ రెండూ కలిసే పరమేశ్వరుడు! కొందరికి దాక్షిణ్యం ఉంటుంది కానీ దయ ఉండదు, కొందరికి దయ ఉంటుంది కానీ దాక్షిణ్యం ఉండదు! ఈశ్వరుడి శక్తిలోనే దయ, దాక్షిణ్యం కలిసిపోయి ఉంటాయి! ఆ రెండూ కలిసి ఉన్న స్వరూపమే దక్షిణామూర్తి!

దయ = పరదుఃఖఅసహిష్ణుత; అవతలి వారి దుఃఖం చూడగానే సహించలేకపోవడం

దాక్షిణ్యం = వారి దుఃఖం తొలగించడం

భక్తుడు పరమేశ్వరుని ప్రార్థించగానే "నేను సంసారమగ్నుడనై ఉన్నాను" అని శరణు వేడి నిజంగా దుఃఖపడితే, ఆ దుఃఖంలో నిజాయితీ ఉంటే భగవంతుడు దయ చూపిస్తాడు, ఆ దయ దాక్షిణ్యంగా అతడిని ఉద్ధరిస్తుంది! దుఃఖవిమోచనుడు ఈశ్వరుడు!

ఈశ్వరుడు మాత్రమే సంపూర్ణ దుఃఖ నాశకుడు! ఆయన ఒక్కసారి దయ చూపిస్తే మరలా దుఃఖపడనవసరం లేకుండా చేస్తాడు! అదే కైవల్యం/మోక్షం! అందుచేత దాక్షిణ్యం అంటే మోక్షము ఇచ్చే శక్తి! ఆ కైవల్యాన్ని మన అర్హతలని బట్టి ఇస్తాడా అంటే ఆయన దయని బట్టి ఇస్తాడు!

ఎవరు శ్రద్ధాభక్తులతో పరమేశ్వరుని ఆశ్రయిస్తాడో, ఎవరి అంతఃకరణం శుద్ధి అయి ఉంటుందో, ఎవడు చిత్తశుద్ధితో సాధన చేస్తాడో వాడిపై స్వామికి దయకలిగి, వెంటనే దాక్షిణ్యంతో సంపూర్ణ దుఃఖనాశనం చేస్తాడు!

ఉదార, సరళ భావములే దయ దాక్షిణ్యములు!

## శివపదం

"**మాటలేకనే యితడు మహిత బోధలు జేసె ఏటి వింతల వేల్పో ఈ జవ్వనపు శివుడు**"

మాట లేకనే గొప్ప బోధ చేసాడు స్వామి! ఎక్కడైనా విషయం అర్థం అయ్యేలా చెప్పాలంటే ఎంత ఇబ్బందో! అటువంటిది ఒక్కమాట లేకుండా ఎలా బోధ చేసాడు స్వామి? అదే వింత!

"**కన్నులరమూసుకొనే కాంచుచుండును జగము ఎన్నరానిది వీని ఇట్టి చూపుల సరళి** "

ప్రపంచాన్ని చూడాలంటే కనులు తెరచి కదా చూడాలి కానీ ఈయన ఎలా ఉన్నాడు అంటే కన్నులు అరమూసుకుని ఉన్నాడు! ఎప్పుడూ ధ్యానంలో, అర్ధనిమీళిత నేత్రాలతో స్వాత్మస్థితిలో ఉంటాడు! కానీ సర్వసాక్షి ఆయనే!

"**తిన్నగా స్థాణువై దివిరి వెలిగే వాడే ఇన్ని లోకాలు వెలిగించు విన్నాణియే**"

ఆయన కదలకుండా కూర్చుని జగత్తుని కదిలిస్తున్నాడు!
"తిన్నగా" అంటే సూటిగా, స్పష్టముగా అని అర్థం.
"విన్నాణి" = విజ్ఞాని
"చెట్టుమొదటనే దోచి చెలగు నీ స్వామి ఎట్టులీ జగములు తానే నిండుటలు తెలిపె"
ప్రపంచమంతా వ్యాపించినవాడు చెట్టు మొదట్లో కనపడుతున్నాడు! అదే వింత! అంతా తానే ఉన్నాడని ఒక చోట కూర్చుని చెప్తున్నాడు!
"పట్టుగా విశ్వసంభార సంసారి ఏ పట్టునను వైరాగ్య పద్ధతిని బోధించె"
పైగా వైరాగ్యం బోధిస్తున్నాడు! వైరాగ్యం చెప్తున్న ఈయన ఏమైనా సన్యాసి యా? కాదు పరమసంసారి!
"దక్షిణుడు మూర్తియా తలచనమూర్తియా దక్షిణామూర్తియను ద్వయము తానౌనా లక్షణాతీతుడు సులక్షణాన్వితుడు అక్షయదనంతుడమరే షణ్ముఖ హృదిని" చూస్తూ ఉంటే గమనిస్తూ ఉంటే దక్షిణుడు అమూర్తి అని అర్థమవుతున్నది!
ఆయన మూర్తియా? అమూర్తియా? లక్షణాతీతమైన బ్రహ్మము సులక్షణాలతో కనపడుతున్నాడు! ఆయన అక్షయుడు అనంతుడు, కానీ తన భక్తుల గుండెలో ఇమిడిపోయాడు!

**దక్షిణామూర్తి - వైదిక ప్రమాణాలు**

వేదాలు విష్ణువు నుండి వచ్చాయా? శివుని నుండి వచ్చాయా?
పరమేశ్వరుడి నుండి వచ్చాయి! ఒకప్పుడు శివుడిగా, ఒకప్పుడు విష్ణువుగా! ఒకే బ్రహ్మము!
అసురాక్రాంతమైన వేదములు తిరిగి తెచ్చాడు నారాయణుడు, ప్రళయాదుల తర్వాత వేదాలు ఇచ్చాడు శివుడు! హరిహర అబేధం!

దక్షిణామూర్తి ఉపనిషత్తు అని కృష్ణ యజుర్వేదంలో ఉన్నది!

ఉపాసన - సగుణబ్రహ్మ ఉపాసన ఉపాసనకి ఉపనిషత్తే,

విచారణ - నిర్గుణబ్రహ్మ జ్ఞానానికి కూడా ఉపనిషత్తే! అంటే ఆ రెండిటి వలన బ్రహ్మమును పొందగలము అని చెప్పడానికి!

సగుణబ్రహ్మ ఉపాసన -> చిత్తశుద్ధి -> నిర్గుణబ్రహ్మ అనుభవం

అందుకే ఆదిశంకరులు కూడా ఉపాసనా సంప్రదాయాన్ని సుష్టు పరచారు!

ఉపాసన వల్ల సగుణబ్రహ్మ అనుగ్రహిస్తే కానీ ఆ బ్రహ్మానుగ్రహం కలగదని తెలుసుకుని ఆ బ్రహ్మవిద్యయే అయిన శ్రీవిద్యని ప్రతిష్ఠించారు! ఇది ఉపాసనా రూపమైన బ్రహ్మవిద్య!

అందుకే దశమహావిద్యల్లో శ్రీవిద్యని తీస్కుని దాన్ని నెలకొల్పారు!

## పరమరహస్యశివతత్త్వం

**దక్షిణామూర్తి ఉపనిషత్తు బోధిస్తున్నది మార్కండేయ మహాముని!**

సుమారు అయిదు దక్షిణామూర్తి మంత్రాలు ఇందులో ఉంటాయి! గురుముఖతః తెలుసుకోవాలి!

దక్షిణామూర్తి తత్త్వాన్ని చెప్పే వాక్యాలు ఉంటాయి! ఉపాసనని, విచారణని కలిపిన భావాన్ని తెలుసుకోబోతున్నాము!

ఒక్కసారి వేదఋషి నమస్కరించుకుంటున్నారు ఆదిగురువైన దక్షిణామూర్తిని!

మౌనుల సమూహాన్ని మౌనవ్యాఖ్యతో మహామౌనాన్ని అందించి అనుగ్రహించిన గురువు నాకు గతి అంటున్నారు! ఆ మౌనవ్యాఖ్య ఎంతసేపుట? క్షణమాత్రం!

బ్రహ్మావర్తము అనే ప్రాంతములో భాండీరము అనే వనం, అందులో పెద్ద వటవృక్షం, ఆ సమీపంలో గొప్ప సత్రయాగం చేసారు సౌనకాది మహర్షులు! వారందరు అక్కడున్న మార్కండేయ మహర్షి వద్దకు (గురువు వద్దకు) వెళుతున్నారు!
గురువు వద్దకు ఎలా వెళ్ళాలి?
అప్పట్లో సమిధలు తీసుకెళ్ళేవారు దానికి సంకేతం ఏమిటి అంటే కర్మలని సమిధల్లా కూడబెట్టుకున్నాను మీరు జ్ఞానాగ్నితో దాన్ని హుతం చేయాలి అని సంకేతం!
తత్త్వజిజ్ఞాసువులు అయి వెళ్లారు! యదార్థం ఏమిటో తెలుసుకోవాలని చిరజీవి అయిన మార్కండేయుని వద్దకు వెళ్లారు!

**మార్కండేయుని అడుగుతున్నారు!**

* **దేనివల్ల నువ్వు చిరంజీవిగా ఉన్నావు?**
* **దేనివల్ల ఆనందం అనుభవిస్తున్నావు?**

చిరంజీవిగా ఉండడం కంటే బాధ ఉన్నదా? జరుగుతున్న సంఘటనలు చూస్తూ కకావికలం అవుతూ, ఆ ప్రభావాలని భావాలుగా చేస్కుని భయపడిపోతూ ఎప్పుడు పోతామా అన్నట్లు కదా ఉంటుంది! అవేవీ కలగకుండా ఆనందంగా ఉండడం విశేషం! అలా ఉన్నాడు మార్కండేయ మహాముని!
అందరూ బాగుంటే ఆనందంగా ఉంటాను అంటే నువ్వు ఆనందం కోసం బయట వస్తువుల మీద ఆధారపడుతున్నావు! కాదు ఆనందమే బ్రహ్మము! ఆయన్ని పట్టుకుని ఆయనతో తాదాత్మ్యం చెందితే అదే ఆనందం! ఆ ఎరుక కలగాలి!

**ఎందువల్ల మార్కండేయ మహాముని ఆనందంగా ఉన్నారు?**
పరమ రహస్య శివతత్త్వ జ్ఞానము వల్ల!

మృత్యుంజయుని అనుగ్రహం వల్ల కదా ఆ మార్కండేయముని మృత్యువుని జయించాడు!

సృష్టిలో ఒక జ్ఞానం తెలిసేవరకు రహస్యమే! తెలిసిన తర్వాత అది అనుభవం లోకి వస్తుంది!

ఏ జ్ఞానం అయితే ఇంద్రియాలతో, బుద్ధితో, ఊహలతో, ప్రమాణాలతో తెలివితేటలతో తెలుసుకోలేమో అది పరమరహస్యం అయిన శివతత్త్వ జ్ఞానం చేత నేను చిరంజీవిగా కాగలిగాను, ఆనందంగా ఉండగలుగుతున్నాను!

ఎన్నాళ్ళున్నా ఉండకపోయినా కూడా ఉండి పోయే దేహము నేను కాదు, ఉండిపోయే బ్రహ్మము అనే ఎరుక కలిగి ఆనందించే స్థితి బ్రహ్మజ్ఞానికి ఉంటుంది!

బ్రహ్మజ్ఞానమే కైవల్యం! అది చచ్చిపోయాక కాదు, బ్రతికి ఉండగానే పొందాలి బ్రహ్మానందము!

బ్రతికి ఉండగానే శివానుభూతి పొందగలిగితే తాను శివం, తన చుట్టూ శివం, శివం తప్ప అన్యము లేదు! చిదానంద రూపం శివః కేవలోహం, శివోహం శివోహం!

ఆ అనుభవమే పరమరహస్యశివజ్ఞానం! దానివల్లనే నేను హాయిగా ఉన్నాను!

చిరంజీవిగా ఉండడం గొప్ప కాదు, ఆనందంగా ఉండడం గొప్ప!

ఎప్పుడూ ఉండేది ఏదో తెలుసుకున్నాను కనుక ఆనందంగా ఉన్నాను!

**మహర్షులు అడుగుతున్నారు ఈ ప్రశ్నలు**

**# ఏమిటి ఆ పరమరహస్యమైన శివతత్త్వ జ్ఞానం?**

**# ఎవడు ఆ దేవుడు?**

**# జపం ఏమిటి?**

**# మంత్రములు ఏమిటి?**

**# ముద్రలు ఏమిటి?**

**# నిష్ఠ ఏమిటి?**

**# సాధన ఏమిటి?**

**# సాధన పరికరాలు ఏమిటి?**

**# బలి అనగా అర్పించవలసినది ఏమిటి?**

**# ఆ దైవానికి కాలము ఏది?**

**# ఆ దైవం ఎక్కడ ఉంటాడు?**

**పరమరహస్య శివతత్త్వ జ్ఞానం అంటే ఏమిటి?**

ఏ జ్ఞానం చేత దక్షిణామూర్తి అయిన శివుడు అపరోక్షం అవుతాడో అది!

దక్షిణామూర్తి ఎక్కడో విడిగా ఉన్నాడు అని కాకుండా ఆయన అపరోక్షం అవ్వాలి!

ఆత్మతత్త్వమైన దక్షిణామూర్తి అనుభవంలోకి రావడం పరమరహస్య శివతత్త్వ జ్ఞానం!

అది దక్షిణామూర్తి అనుగ్రహం వల్లనే లభిస్తుంది!

ప్రత్యక్షం - అపరోక్షం

ఇంద్రియాలకు అనుభవంలోకి వచ్చేది ప్రత్యక్షం, కానిది పరోక్షం!

ఎవడు సర్వసమర్థుడో, సచ్చిదానంద ఘనుడో అటువంటి పరమాత్మకు నేను భిన్నం కాను అనేది అపరోక్షం!

**దక్షిణామూర్తి ఎవరు?**

ఎవరు ప్రళయకాలంలో సర్వజీవులని తనయందు ఉపసంహరింప చేసి స్వాత్మానందంలో ఆనందంగా ఉంటాడో ఆయన దక్షిణామూర్తి!

ఇది ఎలాంటిది అంటే పగలంతా పని చేసి రాత్రి విశ్రాంతి పొందడం వంటిది! సర్వజగత్తు కూడా ఏ పరమాత్మయందు కలిగిందో ఆ పరమాత్మయందు లీనమవుతున్నది!

ఎవడు ప్రళయకారకుడో వాడే మోక్షం ఇస్తాడు!

ఒకసారి ఆయనలో లీనమయ్యాక మరి పుట్టవలసిన అవసరం లేకుండా యోగ్యులైన యోగులని తనలోనే లీనం చేస్కుని ఏకస్థితిలో ఉంచుకునేవాడు ఈశ్వరుడు, ఆయనే దక్షిణామూర్తి!

సర్వజగత్తుకి లయం ఉంది! ఆయనకీ లేదు! ఎప్పుడూ ఉండని జగత్తు ఎప్పుడూ ఉండేవాడిలో లీనమవుతుంది!

**జపం ఏమిటి?**

జపమంత్రాలన్నీ గురుముఖతః తెలుసుకోవలసినవి! ఈ మంత్రములు ఉపాసిస్తూ దక్షిణామూర్తిని ఆరాధన చేస్తే -> చిత్తశుద్ధి -> జ్ఞానం -> అపరోక్షానుభూతి

మంత్రములు వేదమునందు ఎలా ఇస్తారు అంటే సంకేతంగా ఇస్తారు! గురువు ద్వారా మాత్రమే పొందాలి! తెలుసు కదా ప్రజలకి అన్నీ చెప్పేయడం కాదు! దేవతానుగ్రహం కలిగించవలసిన విషయాలు చెప్పాలి, బీజాక్షర సహిత మంత్రములు మాత్రం గురుముఖతః తెలుసుకోవలసినవే!

***సారాంశం: దక్షిణామూర్తిని ఎవరైనా భక్తితో ఆరాధన చేస్కోవచ్చు! శివనామము చేస్కుంటూ దక్షిణామూర్తిని భావించవచ్చు! దక్షిణామూర్తి మీద భక్తి కలిగి శివాయగురవేనమః శ్రీభగవతే దక్షిణామూర్తయేనమః అనుకున్నా తరించవచ్చు! తత్త్వవిచారణ, భక్తి వీటితో ఈశ్వరానుగ్రహం తొందరగా లభిస్తుంది! ఈ రెండింటితో కూడి శ్రద్ధతో సాధన చేయాలి!***

**దక్షిణామూర్తి ముద్ర ఏమిటి?**

మౌనముద్ర!

ఆ మౌనంతోనే ఆనందాన్ని కలిగిస్తున్నాడు!

**దక్షిణామూర్తికి సంబంధించిన నిష్ఠ ఏమిటి?**

సః అహం అని భావన చేస్తూ ఉపాసించాలి! అదే నిష్ఠ!

సోహం భావనతో పూజించాలి!

దేవతతో అభిన్న భావం కలిగినప్పుడే ఆనందం! ఆ సోహం అనే ఆ స్థితియే నిష్ఠ!

**సాధన ఏమిటి?**

అభేద భావంతో మంత్రాన్ని ఆమ్రేడనం చేయాలి!

నమః = దేవతతో ఏకీకృతం అవ్వడం

స్వాహా = ఈశ్వరునితో ప్రవిలీనం అవ్వడం! (అగ్నిహోత్రంతో స్వాహా అని నెయ్యి వేసాక ఇంక నెయ్యి ఎక్కడ ఉన్నది అగ్నియే ఉన్నది, అలాగే "నేను" అనే సర్వభావాలు ఈశ్వరునితో ప్రవిలీనం అయ్యాక ఈశ్వరుడే మిగిలాడు!

మంత్రం అర్థాన్ని నిరంతరం మననం చేస్కుంటూ ఉండడమే జ్ఞానసాధనం!

మంత్రానికి, దైవానికి, గురువుకు అభేద భావంతో ఆమ్రేడనం చేసుకోవడమే జ్ఞానసాధనం!

**పరికరాలు ఏమిటి?**

చిత్తాన్ని ఏకాగ్రపరచి పరమాత్మయందు నిలపడమే పరికరం!

**బలి ఏమిటి?**

అంగచేష్టార్పణం బలి!

ఈ శరీరంతో ఎన్ని పనులు చేసాము, ఒక్కొక్క ఇంద్రియవృత్తులు లోకంలో మునిగిపోయాయి! అవన్నీ ఈశ్వరార్పణం చేయి! అదే బలి! (కమలాక్షుని చూచు చూడ్కులు... )

**పరమాత్మ యొక్క కాలం ఏమిటి?**

జాగ్రత్, స్వప్న, సుషుప్తులే ఆయనకీ కాలం, అన్నిటా ఉన్నాడు!

**పరమేశ్వరుని స్థానం ఏమిటి?**

ద్వాదశాంతం! అకార, ఉకార, మకారాలతో ఆజ్ఞాచక్రం వరకు, ఆ తర్వాత సహస్రారం వెళ్లేవరకూ పన్నెండు భూమికలు ఉంటాయి, ఆ పన్నెండవది చివరి స్థానం అంటే శివశక్తియే దక్షిణామూర్తి!

ఇప్పటివరకు పదకొండు ప్రశ్నలకు పదకొండు సమాధానాలు మార్కండేయ మహాముని చెప్పారు!

**మహర్షులు మరలా ప్రశ్నిస్తున్నారు**
**#ఆయన ఎలా ఉదయించాడు? ఎప్పుడూ ఉన్నవాడు ఉదయించడం ఏమిటి? అంటే నీలో అనుభవానికి రావడం ఉదయించడం**
**# ఆయన స్వరూపం ఏమిటి?**
**#ఎవడు ఆయన ఉపాసకుడు? మొట్టమొదట ఉపాసకుడు అని అర్థం?**

**ఈశ్వరోదయం**
సాధనలోకి తెచ్చుకోవాలి!
ముందుగా వైరాగ్యం! ఇది లేనప్పుడు భక్తిలేదు, జ్ఞానం లేదు!
అభ్యాసము, వైరాగ్యములతో మాత్రమే భగవానుడు దొరుకుతాడు! ఈ రెండూ బలపడితే సాధన!
***నూనె = వైరాగ్యం***
***వత్తి = భక్తి***; భక్తి లేని వత్తి ఆరకుండా వెలగాలి అంటే వైరాగ్యం ఉండాలి! లోక జంజాటం ఉన్నంతసేపు రామా కృష్ణా శివా అన్నా కూడా నటనయే! ఎప్పటికో అప్పుడు వస్తుంది! కానీ మోక్షం కావాలనుకున్నవాడు మాత్రం వైరాగ్యం తెచ్చుకోవాలి!
ఏకాగ్రమైన ప్రేమ రూపమైన ఆశ్రయం పేరు భక్తి!

ఈ రెండూ లేనప్పుడు ఏవయినా కాలక్షేపాలే! కాలక్షేపానికైనా వింటే తర్వాత ఎప్పటికైనా ఫలిస్తుంది!

"భళిరా వైరాగ్యం ఎంతో బాగున్నది" అంటారు రామదాసు!

వైరాగ్యం ఇచ్చే ఆనందం సృష్టిలో ఏదీ ఇవ్వలేదు! వైరాగ్యం నీలో ఉన్న ఆనందాన్ని ఉబికేలా చేస్తుంది! బయట విషయాల వల్ల

***పాత్ర = ప్రకృష్టమైన బోధ!*** గురువు చెప్పే ఉపదేశం నీలో బోధ పడడం! జ్ఞానం నువ్వు మరువకుండా పదిలపరచుకోవాలి!

గురువు ద్వారా తెలుసుకున్న ప్రబోధం అనే పూర్ణ పాత్రలో వైరాగ్యం అనే తైలాన్ని నింపి భక్తి అనే వత్తిని పెడితే ఆ గురువు కృప వల్ల జ్ఞప్తి దీపం వెలుగుతుంది, అప్పుడు మోహాంధకారం తొలగిపోతుంది!

మోహాంధకారం భయంకరమైనది! అది నిస్సారం, అది తొలగిపోతుంది!

అంధకారం తొలగగానే వెలుగు స్వయంగా ఎలా వస్తున్నదో, అదే విధంగా మోహాంధకారం తొలగగానే ఈశ్వరానుభవం వస్తుంది! అదే స్వామి ఉదయం!

మథనం చేయాలి! అరణి మదించి అగ్నిని తీసుకొస్తాము!

లోకంలో సంబంధించిన వాటికే అంత కష్టపడుతున్నాము అంటే ఏది పొందితే మరేదీ పొందక్కర్లేదో అది పొందాలి అంటే ఇంకెంత కష్టపడాలి!

వైరాగ్యం కింద అరణిగా, జ్ఞానం (విచారణ) కింద అరణిగా చేస్కుని సాధన అనే మథనం చేస్తారో వాడు గాఢమైన మోహాంధకారాన్ని తొలగించి గూఢమైన అర్థాన్ని తెలుసుకోగలడు! అక్కడే ఉన్న పరమాత్మ అనుభవం వస్తుంది!

కబుర్లతో పాండిత్యం ఉన్నా లాభం లేదు! వైరాగ్యం ఉండాలి! అది లేనిదే గ్రంథ జ్ఞానం ఎంత ఉన్నా లాభం లేదు!

**మార్కండేయుడు తన కథ చెప్పడం ఆరంభించారు, యముడి పాశాన్ని తొలగించడం చెప్పి దాని ప్రతీక వాదం చెప్తున్నారు!**

ప్రతీవారిలో ఉన్న వివేకం అనే మార్కండేయుని సంహరించడానికి కాలము అనే యముడు వస్తున్నాడట! మోహము అనే యముడిచేత ఆక్రమింపబడిన వివేకం అనే మార్కండేయుడు తత్త్వవిచారణ చేయకపోవడం అనే పాశం చేత బంధింప బడి ద్వైతం చేత భయపడిపోతున్నాడు!

ద్వైత భ్రాంతి చేతనే రాగద్వేషాలు ఏర్పడి భయం కలుగుతుంది! ఆ భయం చేత ఆతురుడు యమపాశం చేత బంధింపబడుతున్నాడు! యదార్థాన్ని విచారణ చేయకపోవడమే పాశం! ఎప్పుడైనా రెండు నిమిషాలైనా చేశామా?

అప్పుడేమైనది? ఒక్కసారి ఆ పాశాన్ని ఛేదింపచేసి నిజానందం (తనదయిన ఆనందం, తానె ఆనందం) చేత, స్వస్వరూపముతో పరమేశ్వరుడు సాక్షాత్కరించి అవిచార పాశమును తొలగించి, మోహము అనే యముడిని తొలగించి, వివేకమనే మార్కండేయుని రక్షించి అతడిని స్వస్వరూప మార్గములో పెట్టి రక్షించాడు!

బుద్ధియే దక్షిణ! ఇక్కడ బుద్ధి అంటే బ్రహ్మవిద్య!

దక్షిణ అంటే శేముషీ! అనగా మేధాశక్తి! బుద్ధి యొక్క శక్తి!

ఏ బుద్ధి పరమాత్మ గురించి స్పష్టమైన అవగాహన పొందగలదో అదే దక్షిణ! అటువైపే అభిముఖం అయి ఉన్న భగవానుడు దక్షిణామూర్తి!

అందుకు బ్రహ్మవాదులంతా కలిసి శివుడిని దక్షిణామూర్తి అన్నారు! శివుడే దక్షిణామూర్తి!

ఉపాసకుడు - వివేకుడు - మార్కండేయుడు

మోహము - యముడు

పాశము - తత్త్వవిచారణ చేయకపోవడం

**ఆయన్ని ఉపాసించినది ఎవరు?**

సృష్ట్యాది కాలమునందు బ్రహ్మదేవుడు ఆయన్ని ఉపాసించి సృష్టిని చేసే సమర్ధతను పొందాడు!

ఎవరైనా వాడు చేయవలసిన కర్మని చేయవలసినదే అప్పుడే జ్ఞానం!

ఆయన ద్వారా ధన్యుడు అయ్యాడు బ్రహ్మదేవుడు!

ఇప్పుడు నేను చెప్పినదంతా **పరమరహస్యశివతత్త్వం** అంటారు! దీన్ని ఎవరైతే అధ్యయనం చేస్తారో, సర్వపాపములనుండి ముక్తుడయ్యి ధన్యుడు అవుతాడు! ఎవడు దీన్ని తెలుసుకుంటాడో వాడు కైవల్యాన్ని అనుభవిస్తాడు!

వివిధ సందర్భాల్లో పరమేశ్వరుడు ఎన్నెన్ని రూపాలతో కనపడ్డారు, ఆయనవద్ద ఎవరెవరు ఏ ఏ విద్యలు నేర్చుకున్నారు?

ఇందులో కనపడుతున్న దక్షిణామూర్తి వైభవాన్ని మనసుకు తెచ్చుకుంటే పరవశించిపోవాలి!

మొట్టమొదట స్వామిని ఉపాసించిన బ్రహ్మదేవుడిని ఆయన పుత్రుడైన నారదుడు ఈ విధంగా అడుగుతున్నాడుట

నీకు శిరసా నమస్కరించి అడుగుతున్నాను నాకు దక్షిణామూర్తి గురించి చెప్పు!

(గురువు వద్ద ఎలా అడగాలో తెలుసుకోవాలి)

ఎవడు గురువుని ఉపాసన చేస్తాడో వాడికే ఈశ్వరుడు భాసిస్తాడు!

ఉపాసన అంటే ఆశ్రయించుట, అనుసరించుట!

గురువు తృప్తి చెందితే ఏదయినా చెప్పగలము! అందుచేత ఒక క్షణం ఆగు నా గురువుని ధ్యానం చేసి చెప్తాను అన్నారట బ్రహ్మదేవుడు! భక్తితో, శ్రద్ధతో ఆదిగురువైన దక్షిణామూర్తిని ధ్యానం చేసి మొదలుపెట్టాడు!

**బ్రహ్మదేవుడు చెప్తున్న దక్షిణామూర్తి విద్య**

ఇవన్నీ మననం చేస్కోవలసినవి!

ఆకాశము, జ్యోతి అని రెండు శబ్దములు వచ్చాయి! ఇక్కడ చెప్తున్నవి పంచభూతాల్లోవి కావు!

సర్వమునూ ప్రకాశింపచేయునది, ప్రకాశించునది, దానినుండి జగత్తు వచ్చినది!

ఆ ఆకాశ, జ్యోతి స్వరూపమే, వటవృక్షం మూలంలో దక్షిణాభిముఖంగా పురుషాకృతి ధరించింది ఎందుకు అంటే స్వస్వరూప జ్ఞానం ఇవ్వడానికి! ఆయన నుండే సర్వవిద్యలూ వచ్చాయి!

**ఆయన ఎంత ఉంటాడు?** అణువుకంటే సూక్ష్మం, మహతో మహీయన్ ఆయనే!

**సర్వ విద్యలూ అయన నుండి ఎలా వచ్చాయి?**

మొదట ప్రణవం -> నాలుగు వేదములు -> చతుష్షష్టి విద్యలు

జ్ఞానం (విచారణాశక్తి ), సత్యము, తపస్సు, శమము, ధర్మము,  దమము, శ్రద్ధ, భక్తి, ప్రజ్ఞ (గ్రహించే శక్తి), మాయ - శాస్త్రసారం గ్రహించడానికి ఇవన్నీ కావాలి!

ఇవన్నీ విద్యావిభూతులు!

మాయ అంటే ఇక్కడ విచిత్రకార్యకరీశక్తి

ఆయన ఎటువంటి విభాగములు లేని పరిపూర్ణ తత్త్వము!

**ఆయన అవయవాల్లో ఏమి ఉంటాయి?**

బ్రహ్మ = కుడివైపు

విష్ణువు = ఎడమవైపు

రుద్రుడు = మధ్యన

త్రిమూర్త్యాత్మకుడు! ఎప్పుడైనా పరమేశ్వరునిగా ఉపాసించవలసిన స్వరూపాన్ని

త్రిమూర్త్యాత్మకంగా ఉపాసించాలి! ఇది రహస్యం!

మూడు గుణాల నియామకుడు ఆయన!

సృష్టిని నిర్వహించే సాత్త్విక, రాజస, తామస గుణాలు! ఇవి మనం లోకంలో అనుకునేవి కాదు!

బ్రహ్మ = రజోగుణం - స్రష్ట

విష్ణువు = సత్త్వగుణం - భోక్త/స్థితికారకుడు

రుద్రుడు = తమోగుణం - లయకారకుడు

శక్తి = ఉమాదేవి

మూడూ కలిసి గురువు! బ్రహ్మవిష్ణుశివాత్మకుడు!

లేని జ్ఞానం పుట్టించాడు కావున బ్రహ్మ

వచ్చిన జ్ఞానాన్ని పదిలపరచి సాధనరూపంలో వృద్ధి పరచేటప్పుడు విష్ణువు

దాన్ని పరిపూర్ణం చేసి పరమాత్మలో లయం చేసేటప్పుడు ఆయనే రుద్రుడు!

అటువంటి గురుతత్త్వము వేదాంతముయందు ప్రతిష్ఠింప బడింది!

అటువంటి దక్షిణామూర్తి విశ్వరూపుడు! దక్షిణామూర్తి అనగా కలిగినవాడు, ఏదయినా చెయ్యగలిగినవాడు!

"కలిగిన నిన్నే కొలిచితిరా" అంటారు పూజ్య గురుదేవులు

ఆ సర్వసమర్థతయే దక్షిణ!

మనం ఉపాసించే దైవాన్ని విశ్వరూపముగా దర్శించి ఉపాసిస్తే ఆ ఉపాసన ఫలిస్తుంది

**దక్షిణామూర్తి విశ్వరూపం**

విశ్వరూపుడు అయిన శివుడే కైలాసంలో వటవృక్షమూలంలో కనపడ్డాడు! అటువంటి స్వామి దక్షిణామూర్తిగా కనపడ్డాడు, ఋషులకు, మునులకు జ్ఞానం ప్రసాదించడానికి!

ఆ దక్షిణామూర్తి 1) విశ్వరూపుడు, 2) సర్వ దేవతాత్మకుడు!

3) సచ్చిదానందవిగ్రహుడు!

#శిరస్సులోని జటాజూటం = వేదములు, సర్వమంత్రములు, విద్యాశాఖలు

#శరీరపు రోమకూపాలు = మంత్రద్రష్టలు

#ముఖము నుండి = నాలుగు వేదములు, చతుష్షష్టి కళలు, సప్తకోటిమహామంత్రములు

#ఆ వేదాది మంత్రములను వ్యాప్తి చేయడానికి ముఖమునుండి బ్రాహ్మణులు, ఆ ధర్మాన్ని కాపాడి రక్షించేవారైన రాజన్యులు బాహువుల నుండి, ధర్మానికి తగ్గట్లు జీవించేవారు పోషణని పంచి వ్యాపింప చేసేవారు వైస్యులు ఊరువులనుండి, కావలసినవి ఉత్పత్తి చేస్తూ వీరందరికి ఆధారంగా ఉన్న సూద్రులు పాదములనుండి వచ్చారు!

#మనస్సు నుండి చంద్రుడు, సూర్యచంద్రాగ్నులు నేత్రాలుగా ఉన్నాయి.

# పలుకులు వేదాలు

# నాలుక నుండి కిన్నెరలు

# దంతములయందు పితృదేవతలు

# జటలయందు సాధ్యులు

# ఆ ముఖమునందే యక్షులు

# చెమటబిందువుల నుండి కోట్లసంఖ్యలలో వీరభటులు
# పాదముల నుండి గంగ, యమునా, సరస్వతీ ఇత్యాది నదులు ప్రవహిస్తున్నాయి
అద్భుతమైన మౌళిని ధరించి, జంఘముల నుండి భూమిని, పాదాంగుష్ఠముల నుండి గోవులు ఉత్పన్నం అయ్యాయి!
ఏ ఏ స్థానములయందు ఏ ఏ దేవతలున్నారో తెలుసుకుంటూ స్వామి మూర్తిని ధ్యానించాలి! స్వామిని ఉపాసిస్తే సర్వదేవతలని, విశ్వాన్ని, సచ్చిదానందాన్ని ధ్యానించినట్లే!

నారదుల వారు అడిగారు, ఆయన ఆయుధం ఏమిటి అని? మేరువు ఆయన ఆయుధం!
తల్పం - శేషువు
ఆభరణం - అనంతము అనబడే దివ్య సర్పం
యజ్ఞసూత్రము - వాసుకి
కటిసూత్రము - తక్షకుడు
హారము - కర్కోటకుడు
కుండలము - పద్మకుడు
తాటంకము - మహః
మాలికలు - నక్షత్రాలు
భస్మమే చందనముగా అలంకరించుకున్నాడు స్వామి.
శిరోమణిగా కౌస్తుభం భాసిస్తున్నది!
అపస్మారమే పాశముగా ఉన్నది, దాన్ని నిగ్రహించేవాడు ఆయన!
ఆయన కంటిమంటల్లో కాముడు అనంగుడు అయ్యాడు! త్రిపురములు, యముడు కూడా ఆయన పాదముచేత దెబ్బతిన్నవాళ్ళే!

ఎడమవైపు చేతుల్లో పుస్తకము, అగ్ని పట్టుకున్నాడు
కుడివైపు చేతుల్లో చిన్ముద్ర, సుధాకలశం
రూపమంతా పరబ్రహ్మతత్త్వము
ఆయన ఏ దిక్కున ఉంటాడు? సర్వత్రా వ్యాపించిన దిక్కులన్నీ ఆయనవే!
ఆయన వర్ణం? శుక్ల వర్ణం, దానికి సంకేతం ఎల్లవేళలా ఆనందస్వరూపుడు!
ఆయన ఆధారం ? వటవృక్షం
ప్రళయాలను పోగొట్టువాడు!
విశ్వరూపుడిగా ఈశ్వరుడిగా ఉపాసించేటప్పుడు ఆ దేవతని (విష్ణువు అయితే విష్ణువుగా, దక్షిణామూర్తి అయితే దక్షిణామూర్తిగా) బహిరంతరములలో వ్యాపించిన ఈశ్వరుడిగా చూడాలి!

**వటమూలవాసి మరో అంతరార్థం**

ఈశ్వరుని స్థానం హృదయం!
రమణుల వారేమంటారు అంటే దక్షిణం వైపు ఉంటాడు కనుక దక్షిణామూర్తి అని!
ఎవడికి ఎక్కడ దర్శనం ఇస్తే వారది చెప్తారు!
హృదయస్థానం అంటే ఏమిటి?
ఈశ్వరుడు శరీరమంతా ఉన్నాడు! కొందరికి హృదయంలో దర్శనం ఇస్తాడు, కొందరికి కనుబొమలనడిమిలో దర్శనం ఇస్తాడు! వాడికి అది హృదయం!
పూర్వజన్మల నుండి చేసిన సాధనని బట్టి ఈశ్వరుడు వారికి ఎక్కడ దర్శనం ఇస్తాడో వారికి అది హృదయం!
హృదయస్థానంలో పరమేశ్వరుని ధ్యానించడం చాలా ప్రధానమైన అంశము!

సుషుమ్నా నాడి సహస్రారం నుండి మూలాధారం వరకూ కదా, ఆ కాంతి మూలాధారం నుండి హృదయం వరకూ వచ్చి, అక్కడ నుండి అన్నీ నాడీమండలాలకి వెళుతుంది! ఆ చిద్రసం హృదయం అనే మడుగులోకి వచ్చి నాడులు అనే కాలువల ద్వారా శరీరమంతా ప్రసరిస్తుంది అచ్చంగా మర్రిచెట్టు నుండి ఊడలు ప్రాకినట్లుగా! ప్రాణశక్తి అంటే పరమేశ్వరుని చిచ్ఛక్తి!

***వటవృక్షం = హృదయం***

***ఊడలు = నాడీమండలం***

***వటమూలవాసి అయిన దక్షిణామూర్తి = హృదయంలోని పరమాత్మ***

<u>దక్షిణామూర్తి ధరించిన 16 దక్షిణామూర్తులు</u>

స్వామి వివిధ మూర్తులు కరములలో దాల్చేవి: ప్రధానంగా మారనివి అక్షమాల, చిన్ముద్ర, పుస్తకం! ఒకటి మాత్రం మారుతూ ఉంటుంది అమృతకలశం, అగ్ని లేదా సర్పం, వీణ, ఇలా మారుతూ ఉంటాయి!

ఒక్కొక్కరికి కూడా మంత్రాలు ఉన్నాయి! అవి తెలియకపోయినా నామమే మంత్రం!

శ్రద్ధాభక్తులతో నామం అంటే తప్పకుండ అనుగ్రహం లభిస్తుంది!

ఏ మూర్తీ లేని స్వామి రకరకాల ప్రయోజనాల కోసం అన్ని రూపాలు ధరించాడు!

**1) శ్రీ శుద్ధ దక్షిణామూర్తయే నమః**

శుద్ధ అద్వైతాన్ని బోధించే సూక్ష్మ రూపుడు.

ఎవరు గురువుని అంటిపెట్టుకుని ఉంటారో వారి పట్ల వాత్సల్యం కలిగి ఉంటారు.

గురువుతో ఎప్పుడూ అనుబంధం ఉండాలి. గురువుతో నిత్యానుబంధం ఎప్పుడూ శిష్యుడికి ఉండాలి!

**2) శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః**

మేధని ఇస్తాడు! లౌకిక అర్థం బుద్ధిశక్తి!

ఆదిశంకరులు ఇచ్చిన భాష్యం: దక్షిణామూర్తి ఇచ్చే మేధ ఎటువంటిది అంటే ఆ జ్ఞానం ఎలా ఉండాలి అంటే # స్థిరమైన

# అసంభావన మొదలైన దోషాలు లేని బుద్ధి! అసంభావన అంటే అది లేనే లేదు అనే భావం, విపరీత భావన అంటే ఒకదానికి ఒకటి అనుకోవడం

# వాసనని అవిద్యని రెండిటినీ తొలగించాలి! అవి తొలగించే తెలివి!

# ప్రజ్ఞ అనగా ఇక్కడ అర్థం నిరంతరం బ్రహ్మానుభవం పొందగలిగే శక్తి.

ఇటువంటి మేధని, ప్రజ్ఞని, ఈ రెండిటికీ కావలసిన విద్యని ఈ మూడింటినీ ఇచ్చేవాడు స్వామి! భ్రాంతిని పోగొట్టి మోక్షాన్ని ఇస్తాడు.

**3) శ్రీ విద్యా దక్షిణామూర్తయే నమః**

అజ్ఞానం అనే కట్టెలని తగలబెడతాడు!

భక్తులకి ఉపద్రవం రాకుండా చూస్తాడు

వాగ్భవబీజ స్వరూపుడు, ప్రణవాత్మకుడు, షట్ శాస్త్రముల స్వరూపుడు

**4) శ్రీ లక్ష్మీ దక్షిణామూర్తయే నమః**

త్రిపురసుందరీ అమ్మవారు పూజిస్తున్న పాదాలు కలిగినవాడు!

వివిధ ఆయుధాలు ధరించి ఉంటాడు! ధనుర్బాణాలు, ఖడ్గము, పరశువు

కర్మఫలప్రదాత!

ఈయన్ని ధ్యానిస్తే శరీరం రక్షింపబడుతుంది!

సనాతన ధర్మానికి ఉన్న శత్రువులని తొలగించే శక్తి ఉన్నది ఈ మూర్తికి!

లజ్జాయుతమై శక్తిచేత సేవింపబడుతున్నాడు!

**5) శ్రీ వాగీశ్వర దక్షిణామూర్తి**

మంచి పలుకులు ఇస్తాడు!

**6) శ్రీ వటమూలనివాసి దక్షిణామూర్తి**

శ్యామలాంబ వీణ మీటుతూ ఉంటే స్వామి ఆనందిస్తూ వింటున్నాడు!

ఈ స్వామిని ధ్యానిస్తే ఏ సంగీతం పరమాత్మని రంజింపచేస్తుందో ఆ సంగీత విద్య లభిస్తుంది.

ఎఱ్ఱని వస్త్రం ధరించి ఉంటాడు అనుగ్రహానికి తగ్గట్లుగా

దేవకాంతలు చామరాలు వీస్తూ ఉంటారు

తన కన్నుల నుండి వెన్నెల కాంతులు కురిపిస్తూ భక్తులనే చకోరాలను ఆనందింపచేస్తూ ఉంటాడు.

**7) శ్రీ సాంబ దక్షిణామూర్తయే నమః**

సాధారణంగా దక్షిణామూర్తిలో అమ్మ లీనం అయి ఉంటుంది. కానీ పార్వతీ సహితంగా ధ్యానించడం ముఖ్యం!

సురుటపల్లిలో పల్లకొండేశ్వరాయలం అని ఉన్నది, అక్కడ శివుడు అమ్మవారి ఒడిలో తలపెట్టుకుని, అమ్మవారు స్వామి కంఠం మీద చేయి పెట్టి ఉంటుంది (విషము మింగిన తర్వాత సేద తీరుతున్న స్వామి)! అక్కడ శివాలయంలో ఉత్తరస్థానంలో దక్షిణామూర్తి ఉంటారు, ఆయన భుజం మీద చేయి వేసి అమ్మవారు చూస్తూ ఉంటారు! దంపతీ దక్షిణామూర్తి!

పంచాక్షరీ మంత్రం ఈ స్వామి మంత్రంలో ఉంటుంది!

విష్ణువు కంటిచేత పూజింపబడ్డ స్వామి (హరికి చక్రమిచ్చినట్టి అయ్యకు జోత)

సాంబదక్షిణామూర్తి అన్నప్పుడు త్రిపురాసుర సంహార మూర్తిని ధ్యానించమంటున్నారు!

స్వామి చిరునవ్వు గురించి చెప్తూ ఒక మాట అంటారు, ఆయన విష్ణుబాణానికి త్రిపురాసురులు తగలడలేదుట, ఒక నవ్వు నవ్వాడుట అంతే!  ఆ మాత్రానికే దగ్ధం చేశారట స్వామి! అంటే చిరునవ్వుతో అజ్ఞాన నాశనం చేసే మందహాసం!

**8) శ్రీ హంస దక్షిణామూర్తయేనమః**

సూర్యమండలానికి హంస అని పేరు! సూర్యమండలంలో అనుగ్రహించే దక్షిణామూర్తి! సూర్యుడూ ఆయనే, చంద్రుడూ ఆయనే!

ఇక్కడ స్వామి నామాల్లో సూర్యనామాలన్ని వస్తాయి!

**9) శ్రీ లకుట దక్షిణామూర్తయే నమః**

శీఘ్రప్రసాదంగా అనుగ్రహించే స్వామి!

శుకాది మహర్షులని అనుగ్రహించిన మూర్తి!

**10) శ్రీ చిదంబర దక్షిణామూర్తయే నమః**

చిదంబరంలో నటరాజుగా కనపడుతున్నవాడు దక్షిణామూర్తి!  అందుకే ఆయన పాదం కింద అపస్మారుడు తొక్కబడుతూ ఉంటాడు!

"మత్తరోగశిరోపరేస్థిత నృత్తమాన పదాంబుజమ్" అని ఈ స్వామిని స్తుతిస్తారు!

ఆ నటరాజ దక్షిణామూర్తి వామభాగంలో అమ్మవారున్నారు!

ప్రదోష వేళలో తాండవం చేసే నటరాజు ఈయన!

రామచంద్రమూర్తి హృదయం అనే పద్మంలో తుమ్మెదలా తిరుగుతాడుట! అంటే రామతత్త్వ రసపానం చేసేవాడు అని!

**11) శ్రీ వీర దక్షిణామూర్తయే నమః**

అనేక హస్తాలలో అనేక ఆయుధాలు ధరించి ఉంటాడు స్వామి! శత్రు నాశకుడు!

మహా ప్రతాపంతో ప్రకాశిస్తూ ఉంటాడు!

ఈ స్వామిని ధ్యానిస్తే గ్రహదోషాలు పోతాయి, ఉపద్రవాలు పోతాయి!

**12) శ్రీ వీరభద్ర దక్షిణామూర్తయే నమః**

ఈయన కూడా ఉపద్రవాలు పోగొడతాడు, అసురులను సంహరిస్తాడు!

దక్షయజ్ఞం నాశనం చేసినటువంటి తీక్ష్ణదంష్ట్రలు కలిగినవాడు!

**13)  శ్రీ కీర్తి దక్షిణామూర్తయే నమః**

ఈ స్వామిని ఉపాసించినవారిలో రామచంద్రమూర్తి, వాలఖిల్యులు, అగస్త్య మహర్షి, శ్రీకృష్ణపరమాత్మ ఉన్నారు.

పతివ్రతలు ఈ స్వామి అనుగ్రహం చేత సంపూర్ణ సువాసిని లక్షణాలు పొంది సిద్ధిని పొందుతారు!

**14) శ్రీ బ్రహ్మదక్షిణామూర్తయే నమః**

బ్రహ్మదేవుడిని అనుగ్రహించిన రూపం! వేదవిజ్ఞాన రాశి ఈ స్వామి. కేవలం బ్రహ్మజ్ఞాన స్వరూపుడు!

**15) శ్రీ శక్తి దక్షిణామూర్తయే నమః**

అమ్మవారితో ప్రకాశిస్తున్నవాడు

ఆధ్యాత్మిక దుఃఖం అనగా శరీర, మనస్సుకి కలిగే పీడలు, వాటిని పోగొట్టేవాడు!

మాయతో ఆక్రమించిన మనస్సులోని కపటాన్ని ఛేదిస్తాడు!

అమాయకంగా (నిష్కపట భక్తితో) పూజించేవారికి అనుగ్రహిస్తాడు!

ఈయన్ని ఆశ్రయిస్తే పదిలంగా ఉండేలా చూస్తాడు!

సృష్టిలోని స్త్రీపురుష తత్త్వమంతా ఈ స్వామి స్వరూపమే!

**16) శ్రీ సిద్ధ దక్షిణామూర్తయే నమః**

కార్య సిద్ధి, జపసిద్ధి, సాధనసిద్ధి లభిస్తాయి!

శ్రీమహాత్రిపురసుందరితో ప్రకాశించే శ్రీవిద్యాస్వరూపుడు!

పైన ఛత్రం ఉందిట, దానికి ముత్యాలు వేలాడుతున్నాయి! బ్రహ్మదేవుడు, విష్ణువు చామర, వ్యజనాలతో సేవిస్తూ ఉన్నారు.

సిద్ధవటం అని కడపజిల్లాలోని ప్రాంతంలో దర్శనం చేస్కోవచ్చు ఈ స్వామిని.

గోకర్ణంలో వామదేవాది అనేక మహర్షులు వెళ్లి తపస్సుని ఆచరిస్తే స్వామి అనుగ్రహించారు, వారు రుద్రా! నీ దక్షిణ ముఖంతో మమ్మల్ని రక్షించు అని అడిగారు!

"పశుపాశవిమోచకో భవాన్ పశవోఽజ్ఞాన విజృంభితావయం భగవన్ శరణాగతానతాస్మాన్ శివ తద్వధ గుహ్యమపి ప్రభో ముదా"

పశుపాశ విమోచకుడివి నువ్వు స్వామి! అజ్ఞానం విజృంభించే పశువులము మేము! శరణాగతులము కనుక గుహ్యమైన జ్ఞానం మాకు ప్రసాదించు అనగానే, గోకర్ణంలో మహాబలేశ్వర లింగంలో దక్షిణ వైపు నుండి అఘోరముఖం నుండి వచ్చారు స్వామి! ఉమాదేవితో కలిసి కనపడ్డారు!

స్వామి వారితో అంటున్నారు ఇలా "మీరు గొప్ప రహస్య జ్ఞానం అడిగారు! తపించేవాడికే జ్ఞానం ఇవ్వాలి! తపస్సు లేని వాడికి ఇవ్వరాదు! కానీ మీరంతా నా భక్తులు" అంటూ జ్ఞానం ఇస్తారు స్వామి. అంటారు స్వామి! ఇదే మాట కృష్ణపరమాత్మ అంటారు గీతలో!

విభిన్న క్షేత్రాలలో విభిన్న నామరూపాలతో కనపడుతున్న దక్షిణామూర్తికి నమస్కారములు!



సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు